



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 19 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | శనివారం 11 అక్టోబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-




## ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు

- సముద్రంలో మునిగిపోనున్న కోస్టల్ నగరాలు..!
- ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు చోటు చేసుకుంటున్నాయి
- సముద్ర మట్టాలు పెరగడం వల్ల తీరప్రాంత జనాభా ఇప్పటికే ప్రభావితమవుతోంది
- వాతావరణ మార్పుల ప్రస్తుత వేగాన్ని బట్టి చూస్తే.. సముద్రం అనేక మీటర్లు పెరగవచ్చు.
- మెక్గిల్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల సమగ్ర అధ్యయనం

7



## పాక్‌కు కొత్త ఆయుధాలేవీ ఇవ్వడం లేదు

- క్షిపణుల విక్రయం వార్తలను ఖండించిన అమెరికా
- తాజా ఒప్పందం ప్రకారం పాకిస్థాన్ సహా అనేక దేశాలకు ఇప్పటికే ఉన్న ఆయుధాల నిర్వహణ, విడిభాగాలు అందిస్తాం

# 2047 నాటికి ఏపీ నెం.1



- గేమ్ చేంజర్ పాత్రలో రాష్ట్రం: చంద్రబాబు
- చింతా ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం
- పేద విద్యార్థులను దత్తత తీసుకుని అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య
- బయో ఇథనాల్ ప్లాంటుతో వాతావరణ సమతుల్యత.. రైతులకూ మేలు
- 'నందిని సేవ్ ది బుల్' సరికొత్త ఆవిష్కరణ

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

భారత్ 2047కల్లా ప్రబల ఆర్థికశక్తిగా ఆవిర్భవిస్తుందని.. ప్రపంచంలో నంబర్‌వన్ స్థానంలో ఉంటుందని సీఎం చంద్రబాబు అన్నారు. అప్పటికి ఆంధ్రప్రదేశ్ కూడా దేశంలో నంబర్‌వన్ స్థానంలో ఉంటుందని చెప్పారు. పారిశ్రామిక, సాంకేతిక రంగాల్లో రాష్ట్రం గేమ్ చేంజర్ పాత్ర పోషిస్తుందన్నారు. ప్రపంచంలో తెలుగుజాతి నంబర్‌వన్ స్థానంలో ఉంటుందని తెలిపారు. విశాఖలో రూ.88 వేల కోట్లతో ఏఐ సెంటర్ రాబోతోందని.. ఇది రాష్ట్ర భవిష్యత్‌కు గేమ్ చేంజర్ కానుందని వెల్లడించారు. శుక్రవారం నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం ఈదగాలి గ్రామంలో విశ్వసముద్ర బయో ఇథనాల్ ప్లాంట్‌ను, ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శశిధర్ పేరుతో నెలకొల్పిన చింతా శశిధర్ ఫౌండేషన్ నిర్మించిన 'నందగోకులం లైఫ్ స్కూల్', 'నంది పవర్ ట్రెడ్‌మిల్ మిషన్', 'నందగోకులం సేవ్ ది బుల్' ప్రాజెక్టులను ఆయన ప్రారంభించారు. జిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ, జేసీ పాల్గొన్న ఈ కార్యక్రమంలో సీఎం ప్రసంగించారు. మన ముందు ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు. మనతోపాటు పేద వర్గాలకూ గొప్ప భవిష్యత్ అందించే ఉద్దేశంతోనే పీ-4 కార్యక్రమం ప్రవేశపెట్టానని చెప్పారు. దాని స్ఫూర్తిని కొనసాగించే విషయంలో విశ్వసముద్ర సంస్థ, చింతా శశిధర్ ఫౌండేషన్ సేవలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్నారు. ఇంకా ఏమన్నారంటే.. 'ఈ రోజు ఇక్కడ చింతా శశిధర్ ఫౌండేషన్ స్థాపించిన స్కూలును చూశాను. మూడో తరగతి విద్యార్థులు మిషన్ మెకనైజేషన్, ఏఐలో తర్ఫీదు పొందుతున్నారు. భవిష్యత్‌పై నిర్దిష్ట లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారు. వారి ఆత్మవిశ్వాసం చూసి నాకు ధైర్యం వచ్చింది. రాబోయే తెలుగు తరాల పిల్లలు ప్రపంచ సాంకేతిక రంగాన్ని శాసిస్తారు. ఇందులో ఎలాంటి అనుమానమూ లేదు. ఆర్థిక ఫలాలు పేదలు అందుకోవాలనేదే - మిగతా2లో

## ఎయిరిండియా బోయింగ్ 787 విమానాలను నిలిపివేయండి

సాంకేతిక సమస్యల్ని పరిష్కరించే వరకు వాటి రాకపోకల్ని నిలిపి వేయాలి

ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలట్స్ కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖకు లేఖ

7

## 1.27 లక్షల కోట్ల పెట్టుబడులు



- 78,771 మందికి ఉద్యోగావకాశాలు
- ఎస్ఐపీబీ నిర్ణయాలకు క్యాబినెట్ ఆమోదం
- దొనకొండలో బీడీఎల్‌కు 1,400 ఎకరాలు
- రూ.212 కోట్లతో రాజ్‌భవన్ నిర్మాణం

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

రాష్ట్రంలో రూ.1,27,181 కోట్ల విలువైన పెట్టుబడులకు, తద్వారా 78,771 మందికి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం వెలగపూడి సచివాలయంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆ వివరాలను రాష్ట్ర సమాచార-పౌరసంబంధాలు, గృహనిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి విలేకరులకు వివరించారు. దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్‌ను విశాఖలో ఏర్పాటు చేయడానికి గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అనుమతిచ్చినట్లు తెలిపారు. - మిగతా2లో

# అంతా ప్లాన్ ప్రకారమే..!

- కేసును నీరుగారుస్తాం... అప్పటివరకు అంతా డ్రామానే
- చినబాబు భరోసా... గన్నవరంలో దిగిన జనార్దన్‌రావు
- నకిలీ మద్యం కేసును పక్కదారి పట్టించే పక్కా పన్నాగం
- అంతా మీరే చేశారు... మీ పేర్లు బయటపెడతాం
- ప్రభుత్వ పెద్దలకు జయచంద్రారెడ్డి, జనార్దన్‌రావు వార్నింగ్
- దీంతో ప్రభుత్వ పెద్దల్లో గుబులు.. వారిని కాపాడే ఎత్తులు!



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

నకిలీ మద్యం కేసును నీరుగార్చేందుకు చంద్రబాబు ప్రభుత్వం తాము పన్నిన పన్నాగాన్ని పక్కాగా అమలు చేస్తోంది. ఈ మేరకు "కేసును పక్కదారి పట్టించి నీరుగారుస్తాం. కంగారుపడొద్దు" అని పెదబాబు, చినబాబు హామీ ఇవ్వడంతో ఎ1గా ఉన్న జనార్దన్‌రావు గన్నవరం విమానాశ్రయంలో శుక్రవారం దర్జాగా అడుగుపెట్టారు. ఆధారాలతో సహా అడ్డంగా దొరికినా సరే ఆయన ఏమాత్రం జంకు లేకుండా రావడం పోలీసులనే విస్మయప రిచింది. కాగా, కేసును నీరుగార్చేందుకు - మిగతా2లో



# రైడెన్‌కు పచ్చజెండా

- గూగుల్ అనుబంధ సంస్థ పెట్టుబడికి క్యాబినెట్ ఓకే
- రూ.87,500 కోట్లతో విశాఖలో డేటా సెంటర్
- తర్లువాడ, అడవివరం, రాంబిల్లిలో 3 క్యాంపస్‌లు.. 480 ఎకరాలు
- భూమి ధరలో 25శాతం రాయితీ
- స్టాంపు డ్యూటీ రద్దు.. సబ్సిడీపై విద్యుత్
- ఎస్‌జీఎస్టీ 100 శాతం రాయితీ.. 13న ఢిల్లీకి చంద్రబాబు, లోకేశ్

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్ విశాఖలో రూ.87,500 కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ)తో ఒక గిగావాట్ సామర్థ్యంతో భారీ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ పెట్టుబడి ప్రతిపాదనను రాష్ట్ర మంత్రివర్గం శుక్రవారం ఆమోదించింది. రైడెన్ విశాఖలోని తర్లువాడ, అడవివరం, రాంబిల్లిలో 480 ఎకరాల్లో మూడు క్యాంపస్‌లతో కూడిన డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. రాష్ట్రంలో తొలిసారిగా భారీ ఎఫ్‌డీఐతో వస్తున్న ఈ సంస్థకు 25 శాతం - మిగతా2లో




## త్వరలో దేశవ్యాప్తంగా 'సర్'

- వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాల్లో సర్ ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం
- స్థానిక ఎన్నికలు, ఎన్నికలు జరుగనున్న, జరుగుతున్న రాష్ట్రాల్లో స్పెషల్ డ్రైవ్
- ఎన్నికల యంత్రాంగం స్థానిక సంస్థల ఎన్నికలతో బిజీగా ఉందని.. దాంతో సర్‌పై దృష్టి పెట్టలేం

7

# 1.27 లక్షల కోట్ల పెట్టుబడులు

-మొదటిపేజీ తరువాయి

రూ.87,500 కోట్ల పెట్టుబడితో తర్లుపాడు, అడవివరం, రాంబిల్లిల్లోని 480 ఎకరాల్లో మూడు క్యాంప్‌సలలో ఈ డేటా సెంటర్‌ను అభివృద్ధి చేస్తారని చెప్పారు. బుధవారం సీఎం సారథ్యంలో జరిగిన రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశంలో తీసుకున్న పెట్టుబడుల నిర్ణయాలన్నిటినీ మంత్రివర్గం ఆమోదించిందన్నారు. అనకాపల్లి జిల్లాలో అధునాతన కార్బన్ కాంప్లెక్స్ తయారీ, పల్నాడుల్లో శ్రీసిమెంట్ ప్లాంటు విస్తరణ, అనంతపురం జిల్లాలో ఏరోస్పేస్, ఆటోమోటివ్ కాంపోనెంట్ తయారీ పరిశ్రమలు, ప్రకాశం జిల్లాలో బీడీఎల్ ప్లాంట్, కర్నూలు జిల్లాలో పారిశ్రామిక ఎస్టేట్ అభివృద్ధి, విశాఖపట్నంలో పారిశ్రామిక, లాజిస్టిక్ హబ్, కర్నూలు జిల్లాలో ఇన్నోవేషన్ సెంటర్, విజయనగరం జిల్లాలో ప్రైవేట్ మెగా పార్కుకు భూముల కేటాయింపులు.. మొత్తంగా 34 అంశాలకు అంగీకారం తెలిపింది. రాష్ట్రంలో గ్రామ పంచాయతీలు సమర్థంగా సేవలు అందించేందుకు 13,351 పంచాయతీలను నాలుగు గ్రేడ్లుగా విభజించేందుకు ఆమోదం తెలిపింది.

**మరిన్ని నిర్ణయాలు..**

రాజధాని అమరావతిలో రాజ్‌భవన్ అంటే.. గవర్నర్ నివాసం, అసెంబ్లీ దర్బార్ హాల్, గవర్నర్ ఆఫీస్, అధికారుల స్టాఫ్ క్వార్టర్స్ మొదలైన వాటితో కూడిన నిర్మాణ పనులకు రూ.212.22 కోట్లతో పరిపాలనా ఆమోదం.

అమరావతిలో క్వాలిటీ బేస్ట్ సెలెక్షన్ విధానం ద్వారా నాలుగు ప్రదేశాల్లో (ప్రతి దానికీ 2.5 ఎకరాలు) కన్వెన్షన్ సెంటర్ల ఏర్పాటు.

రాష్ట్రంలో రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ సహా నాలుగు ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు.

అమరావతిలో దస్పల్లా అమరావతి హోటల్స్ ఆధ్వర్యంలో 4 స్టార్ హోటల్ నిర్మాణానికి అనుమతి.

అరకు వ్యాలీలో 55కోట్ల పెట్టుబడితో వీఎస్కే హోటల్స్ రిసార్ట్స్ ఏర్పాటుకు ఆమోదం. శ్రీశైలంలో రూ. 83 కోట్ల పెట్టుబడితో శ్రీవెంకటేశ్వరా లాడ్జ్ ప్రైవేట్ లిమిటెడ్ త్రీ స్టార్ హోటల్ నిర్మాణానికి ఆమోదం.

అమరావతిలో రూ. సదరన్ గ్లోబ్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ -4 స్టార్ హోటళ్లకు రూ. 117 కోట్ల పెట్టుబడితో హోటల్స్ నిర్మాణానికి ఆమోదం.

పల్నాడు జిల్లాలో రూ.2,260 కోట్లతో శ్రీసిమెంట్ ఫ్యాక్టరీ విస్తరణకు ఆమోదం.

విశాఖ బీచ్ రోడ్‌లో 13.74 ఎకరాల్లో మెగా షాపింగ్ మాల్ ప్రాజెక్టు చేపడుతున్న లులు లిమిటెడ్‌కు లీజు అద్దె నిబంధనలకు క్యాబినెట్ ఆమోదం. వార్షిక లీజు అద్దె రూ.78.08 కోట్లుగా నిర్ణయం. ఏటా పది శాతం పెంపుదల.

విజయవాడ మల్లవల్లిలో లులూ గ్రూపులో భాగమైన ఫెయిర్ ఎక్స్ ఫోర్ట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మెగా ఫుడ్ పార్కు కోర్ ప్రాసెసింగ్ సెంటర్‌కు 7.48ఎకరాలు లీజు ప్రాతిపదికన కేటాయింపు. ఏటా రూ.50 లక్షల చొప్పున 66 ఏళ్లకు కేటాయింపు.

విజయనగరం జిల్లాలో 1166.43 ఎకరాల్లో జేఎసడబ్ల్యూ ఆధ్వర్యంలో మెగా పారిశ్రామిక పార్కు అభివృద్ధికి ఆమోదం. రూ.531 కోట్ల పెట్టుబడితో 45,000 మందికి ఉద్యోగావకాశాలు.

అనకాపల్లిలో రూ.55 వేల కోట్లతో నిర్మించతలపెట్టిన ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు భూముల కోసం ఆర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ దశల వారీగా చేసినచెల్లింపులకు రూ.12.58 కోట్ల వడ్డీ మినహాయింపు.

రాష్ట్రంలో ఏడు పర్యాటక ప్రాజెక్టులకు ఆమోదం. వీటితో రూ.1,628.8 కోట్ల పెట్టుబడులు.. 4,398 ఉద్యోగాలకు అవకాశం.

విశాఖ స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణకు రాష్ట్రప్రభుత్వ మద్దతు చర్యగా గతంలోని విద్యుత్ చార్జీల బకాయిలను, రాబోయే కాలంలో కరెంటు చార్జీల బకాయిలను రెండేళ్లలో విశాఖలోని ఏపీఈపీడీసీఎల్‌కు బదలాయించడానికి మంత్రిమండలి ఆమోదం. ఈ మొత్తం రూ.2,400 కోట్లు.

2025-26 సంవత్సరానికి మేజర్, మీడియం, మైనర్ నీటిపారుదల వనరుల నిర్వహణకు సంబంధించిన 7,197 పనులకు రూ.344.39 కోట్లతో పరిపాలనా ఆమోదం

# ఎన్నికలకు వెళ్లాల్సింది మనం.. అధికారులు కాదు

**మంత్రులకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం**
**అనుమతులు పొందిన సంస్థలు తమ వద్దకే రావడం లేదన్న మంత్రి దుర్గేష్**

అమరావతి

'ఎన్నికకు వెళ్లాల్సింది అధికారులు కాదు, మనం అనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని' మంత్రులకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం కష్టపడి పెట్టుబడులు తెస్తున్నప్పుడు రాజకీయంగానూ మైలేజీ వచ్చేలా చూడాల్సిన బాధ్యత మంత్రులదేనన్నారు. వారే చొరవ తీసుకుని పెట్టుబడుల ఒప్పందాలు ఆచరణలోకి వచ్చేలా, ప్రాజెక్టులు ప్రారంభమయ్యేలా చూడాలని తెలిపారు. ఆయా ప్రాజెక్టుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో మంత్రులు విధిగా పాల్గొనాలని దిశానిర్దేశం చేశారు. శుక్రవారం మంత్రివర్గ సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ జోక్యం చేసుకుని.. ప్రభుత్వం అనుమతులిచ్చిన తర్వాత, ఆయా సంస్థల ప్రతినిధులెవరూ తమను కలవడం లేదని, అధికారులను కలిసి వారి పని చేసుకుని వెళ్లిపోతున్నారని, తమను పట్టించుకోవడం లేదని తెలిపారు. దానిపై సీఎం స్పందిస్తూ.. 'మంత్రులు డ్రైవింగ్ ఫోర్స్‌లా వ్యవహరించాలి. అంతిమంగా ఓనర్‌షిప్ తీసుకోవాల్సింది, వారి శాఖల్లో కార్యకలాపాలకు బాధ్యత వహించాల్సింది మంత్రులే. కంపెనీల ప్రతినిధులు రావడం లేదు కాబట్టి నేనెందుకు పట్టించుకోవాలని కూర్చుంటే లేనిపోని అవరోధాలు సృష్టించినట్లవుతుంది. ఆయా సంస్థల్ని మీరే పిలిపించి మాట్లాడండి. ప్రాజెక్టులు వేగంగా మొదలయ్యేలా చూడండి. వాటి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో మీరు పాల్గొన్నప్పుడే నేను మంత్రిగా ఉన్నప్పుడు ఫలానా ప్రాజెక్టు తెచ్చానని చెప్పుకోగలరు. అధికారులు ఏదో చేసుకుని వెళ్లిపోతారులే అనుకుంటే.. ఎన్నికలకు వెళ్లాల్సింది వాళ్లు కాదు, మనం' అని స్పష్టంచేశారు. గత ఏడాదిన్నర కాలంలో రాష్ట్రానికి వచ్చినన్ని భారీ పెట్టుబడులు గతంలో ఎన్నడూ రాలేదని సీఎం తెలిపారు. మెరుగైన రాయితీలు ఇవ్వడం వల్లే తీవ్రమైన పోటీని తట్టుకుని రాష్ట్రానికి దిగ్గజ కంపెనీల్ని, భారీ పెట్టుబడుల్ని తేగలుగుతున్నామని సీఎం తెలిపారు.

**ఆవు మాంసం వద్దని నిబంధన పెట్టాలి**

గన్నవరం సమీపంలోని మల్లవల్లి పారిశ్రామికవాడలో లులు అనుబంధ సంస్థ అయిన ఫెయిర్ ఎక్స్‌పోర్ట్స్‌కు ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటుకు అనుమతిచ్చే అంశం చర్చకు వచ్చినప్పుడు.. వారి ప్రతిపాదనలో పండ్లు, మాంసం ప్రాసెసింగ్ అని చెప్పారు తప్ప, ఏ మాంసమో స్పష్టంగా పేర్కొనలేదని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రస్తావించారు. అక్కడ గోవధ, గోమాంసం ప్రాసెసింగ్ చేయరాదని స్పష్టంగా నిబంధన పెట్టాలని తెలిపారు. సాధారణంగా లులు సంస్థ వారి షాపింగ్ మాల్స్, పారిశ్రామిక యూనిట్‌లలో పనిచేసేందుకు సిబ్బందిని కేరళ నుంచి నియమించుకుంటుందని, కానీ మన రాష్ట్రంలో స్థానికులకే ఉద్యోగాలిచ్చేలా నిబంధన పెట్టాలని ఆయన సూచించారు.

**ప్రభుత్వ భరోసాతోనే పెట్టుబడులు**

విశాఖలో లులు షాపింగ్ మాల్ స్థలానికి అద్దెను ఐదేళ్లకు ఒకసారి కాకుండా, పదేళ్లకు ఒకసారి పెంచేలా నిబంధన సడలించాలన్న ప్రతిపాదనపై చర్చ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ఒక్కో సంస్థకు ఒక్కోలా నిబంధనలు ఉంటే ఇబ్బంది అవుతుందని అభిప్రాయపడ్డారు. దానిపై సీఎం స్పందిస్తూ 'ఆ సంస్థను వైకాపా ప్రభుత్వం అనేక ఇబ్బందులు పెట్టి వెళ్లగొట్టింది. మన ప్రభుత్వంపై నమ్మకంతో మళ్లీ వచ్చేందుకు అంగీకరించారు. అందుకే ప్రోత్సాహకాలిస్తున్నాం' అని తెలిపారు. 'అలాంటి సంస్థలకు భరోసా ఇవ్వాల్సిన బాధ్యత మనపై ఉంది' అని పవన్‌కల్యాణ్ తెలిపారు.

**మరో ముంబయిలా విశాఖ..**

దిగ్గజ ఐటీ కంపెనీలు రావడం వల్ల 2028 నాటికి విశాఖలో లక్షల సంఖ్యలో ఐటీ ఉద్యోగాలు వస్తాయని, మరో 15-20 ఏళ్లలో విశాఖ అత్యుత్తమ నగరంగా ఎదుగుతుందని సీఎం పేర్కొన్నారు. ముంబయికి దీటుగా విశాఖ అభివృద్ధి చెందుతుందన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడామని, రైల్వేజోన్ సాధించామని, భారీ ఎత్తున పెట్టుబడులు తీసుకొస్తున్నామని తెలిపారు. వాటన్నింటినీ మంత్రులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం తెలిపారు. కేంద్ర సహకారం వల్లే రైడెన్ డేటా సెంటర్ విశాఖకు వస్తోందని, ఆ సంస్థతో ఈ నెల 14న దిల్లీలో ఒప్పందం చేసుకోబోతున్నామని చెప్పారు.

**చేస్తున్న మంచి పనులు చెప్పాలి..**

మంత్రులు ఇంకా చురుగ్గా పనిచేయాలని ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, వైకాపా అసంబద్ధ ఆరోపణలు, విమర్శల్ని అంతే తీవ్రస్థాయిలో తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. 'విద్యుత్ ఛార్జీలు యూనిట్‌కి 13 పైసలు తగ్గించినా ఓనర్‌షిప్ తీసుకోలేకపోయాం. అదేదో విద్యుత్‌శాఖ మంత్రికి సంబంధించిన వ్యవహారం అనుకుంటే ఎలా? ప్రజలకు జరిగే మేలు గురించి మంత్రులంతా జిల్లాలకు వెళ్లినప్పుడు వివరించాలి కదా? ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకెళితేనే వచ్చే ఎన్నికల్లో సానుకూల ఫలితాలు సాధించగలం' అని సీఎం పేర్కొన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు వాడుకలో ఉన్న 'స్కావెంజర్' వంటి పదాల్ని మార్చాలని, వారి వ్యక్తిగత గౌరవానికి భంగం కలగని విధంగా పేర్లు పెట్టాలని సీఎం సూచించారు.

**వైకాపా కుట్రలపై అప్రమత్తం: లోకేశ్**

ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు వైకాపా పన్నుతున్న కుట్రలపై అప్రమత్తంగా ఉండాలని సహచర మంత్రులకు మంత్రి లోకేశ్ సూచించారు. 'కల్తీ మద్యం కేసులో నిందితులు ఎన్నికల ముందు మన పార్టీలోకి వచ్చారు. మన పార్టీ తరపున పోటీ చేశారు కాబట్టి.. వాళ్లు చేసిన తప్పుల ప్రభావం పార్టీపై పడుతోంది. అలాంటి వారిని ఉపేక్షించవద్దు' అని ఆయన సహచర మంత్రులకు సూచించారు. మంత్రివర్గ సమావేశానికి ముందు లోకేశ్ వారందరికీ ఉండవల్లి నివాసంలో అల్పాహార విందు ఇచ్చారు. 'స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ అంశాన్ని ప్రస్తావించిన మంత్రి సవిత.. లోకేశ్ చెప్పింది వినకుండా తన వాదన కొనసాగించడంతో ఆయన అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

# భూములు తీసుకుంటూ ప్రభుత్వానికే కండిషన్లా?

లులూ గ్రూప్‌కు భూకేటాయింపుపై మంత్రివర్గ సమావేశంలో ఆసక్తికరమైన చర్చ జరిగింది! ఆ సంస్థ షరతులు మరీ అతిగా ఉన్నాయని... రాష్ట్రానికే తన అవసరం ఉన్నదన్నట్లుగా వ్యవహరిస్తోందనే అభిప్రాయం వ్యక్తమైంది. లులూ ప్రతిపాదిత కార్యకలాపాలపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వరుస ప్రశ్నలు సంధించారు. సందేహాలు లేవనెత్తారు. దీనిపై అధికారులతోపాటు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పందించారు. సీఎం చంద్రబాబు సైతం లులూ గ్రూప్ షరతుల విషయంలో ఒకింత అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం మంత్రిమండలి సమావేశం అయింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం... కృష్ణాజిల్లా మల్లవల్లి మెగా ఫుడ్ పార్కులో లులూగ్రూప్‌లో భాగమైన మెస్సర్స్ ఫెయిర్ ఎక్స్‌పోర్ట్స్‌కు 7.48ఎకరాలను కోర్ ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటుకు లీజుకు ఇవ్వాలనే ప్రతిపాదన వచ్చింది. ఆ సమయంలో... ఆహారశుద్ధి పేరిట అక్కడ ఏం చేస్తారో సమాచారం ఉందా? అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. ఆహారాన్నే శుద్ధి చేస్తారని అధికారులు బదులిచ్చారు. "ఆహారశుద్ధి అని ఊరికే అంటే కుదరదు. అక్కడ అసలు ఏం పని చేస్తారు? కూరగాయలు, పండ్లు సాగుచేస్తారా? ఉద్యానవన పంటలు సాగుచేస్తారా? లేక కబేళాను నిర్వహించి గోవధ చేసి ఆ మాంసాన్ని ఎగుమతి చేస్తారా?" అని పవన్ సూటిగా ప్రశ్నించారు. గోవధ జరగడానికి వీల్లేదని, ఇందుకు తాము పూర్తి వ్యతిరేకమని స్పష్టం చేశారు. దీంతో అధికారులు నీళ్లు నమిలారు. ఫుడ్ ప్రాసెసింగ్ అంటూనే పొంతనలేని సమాధానాలు చెబుతుండటంతో చంద్రబాబు జోక్యం చేసుకున్నారు. రాష్ట్ర పరిధిలో ఎక్కడా గోవధ జరగడానికి వీల్లేదని, అలాంటి వాటిని అనుమతించబోమని స్పష్టంచేశారు. అక్కడ ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్‌కు మాత్రమే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. మామిడి, బొప్పాయి వంటి పండ్లు మాత్రమే ప్రాసెస్ చేస్తారని చెప్పారు. ఆ తర్వాత లులూ గ్రూప్ వ్యవహారశైలి, దానికి భూ కేటాయింపులు, స్థానికంగా ఉద్యోగాల కల్పన, రెంటల్ అగ్రిమెంట్లు వంటి పలు కీలక అంశాలను పవన్ ప్రస్తావించారు. మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా ఇవే అంశాలను లేవనెత్తారు.

**ప్రాతిపదిక ఏమిటి?**

లీజు మొత్తాన్ని 5 సంవత్సరాలకు 5 శాతం మాత్రమే పెంచడం గురించి మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రస్తావించారు. నిబంధనల ప్రకారం 3 ఏళ్లకు 10 శాతం పెంచాలి కదా అని ప్రశ్నించారు. దీనికి సంబంధిత అధికారులు స్పందిస్తూ.. 'లులూ యాజమాన్యం పదే పదే కోరడంతోపాటు పెద్ద పరిశ్రమ, ఉపాధి కల్పనను దృష్టిలో పెట్టుకుని సడలింపు ఇచ్చాం' అని తెలిపారు. లులూ గ్రూప్ చాలా అతిగా కండీషన్లు పెడుతోందని, ప్రభుత్వానికే తన అవసరం ఉందన్నట్లుగా వ్యవహరిస్తోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నట్లు తెలిసింది. విశాఖపట్నం, విజయవాడల్లో ఆ సంస్థకు ఏ ప్రాతిపదికన భూములు కేటాయిస్తున్నారు? ఇందుకు అనుసరిస్తున్న విధానాలు, మార్గదర్శకాలు ఏమి టి? అని ప్రశ్నించారు. "లులూ గ్రూప్‌కు ప్రభుత్వం భూము లు ఇచ్చి మాల్స్ ఏర్పాటు చేయమంటోంది. ప్రభుత్వమే భూములు ఇస్తోంది. కానీ... షరతులు ఆ కంపెనీ పెడుతోంది. ఇదెక్కడి చోద్యం? మూడు సంవత్సరాలకోసారి లీజు పెంచాలని ప్రభుత్వ రెంటల్ అగ్రిమెంట్స్‌లో ఉంటోంది. కానీ, ఆ కంపెనీ పదేళ్లకోసారి పెంచాలని కండీషన్ పెడుతోంది? వీటిపై మీరేం చెబుతున్నారు? మాల్స్ నిర్మించాక, ఆ కంపెనీ షాప్‌ల రెంట్ ఎలా పెంచుతుంది? మూడేళ్లకోసారి అద్దెలు పెంచుతారా? లేక పదేళ్లకోసారి పెంచుతామని చెబుతారా? కచ్చితంగా ఏటేటా అద్దె పెంచుకుంటారు కదా! వారికో న్యాయం? ప్రభుత్వానికో న్యాయం! ఇలా ఎక్కడైనా ఉంటుందా? దీనిపై మీరేమంటారు?" అని పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్ అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది.

**ఉద్యోగాలు ఎవరికి ఇస్తారు?**

లులూ ఏర్పాటు చేసే మాల్స్, సంస్థల్లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వడంపైనా పవన్ కల్యాణ్ పలు ప్రశ్నలు సంధించారు. "విశాఖ, విజయవాడలో లులూ గ్రూప్ ఏర్పాటు చేసే మాల్స్‌లో, సంస్థల్లో ఉద్యోగాలు ఎవరికి ఇస్తారు? స్థానికులకు ఏ మేరకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు? సహజంగా ఆ కంపెనీ తన సొంత మనుషులనే సిబ్బందిగా నియమించుకుంటుందని విన్నాం. ఇక్కడా అలాగే జరుగుతుందా? అదే జరిగితే ఇక్కడ భూములు ఇచ్చి ఏం లాభం? కచ్చితంగా స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలి. ఈ విషయంలో మీరు ఎలాంటి విధానం అనుసరించబోతున్నారు?" అని పవన్ సూటిగా ప్రశ్నించినట్లు తెలిసింది. స్థానికులకు ఉద్యోగాలు ఇచ్చే విషయంలో కచ్చితమైన నిబంధనలు చేర్చుతున్నామని అధికారులు నివేదించారు.

## 2047 నాటికి ఏపీ నెం.1

-మొదటిపేజీ తరువాయి

నా తపన. అందుకే పీ-4 ప్రవేశపెట్టాను. పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, ప్రజాప్రతినిధులు... ఇంతకాలం సమాజం నుంచి తీసుకున్నారు. ఇప్పుడు సమాజానికి ఎంతోకొంత తిరిగిచ్చే సమయం వచ్చింది. మీరు సంపాదించినదానిలో కొంత పేదలకు ఇవ్వండి. పేద కుటుంబాలను దత్తత తీసుకుని వారి జీవన ప్రమాణాలు, ఆర్థిక స్థితిగతులు మారడానికి చేయూతనివ్వండి. శశిధర్ ఫౌండేషన్ చేసిన సేవలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. నందిని లైఫ్ స్కూల్ ఒక అద్భుత పాఠశాల. పేద విద్యార్థులను దత్తత తీసుకుని వారికి అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య అందిస్తున్నారు. ఇలాంటి స్ఫూర్తి కావాలి. ఫౌండేషన్ సేవలు మరింత మందికి ఆదర్శం కావాలి. అప్పుడే పేదరికం లేని సమాజం సాకారం అవుతుంది. విశ్వసముద్ర సంస్థ, శశిధర్ ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం. బయో ఇథనాల్ ప్లాంట్ ద్వారా వాతావరణ సమతుల్యతతోపాటు రైతులకు మేలు జరుగుతుంది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా బయో ఇథనాల్‌ను వినియోగించాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనను అందిపుచ్చుకుని ప్లాంట్ ఏర్పాటు అభినందనీయం. ఇక 'నందిని సేవ్ ది బుల్' ప్రాజెక్టు ఇప్పటి వరకు ఎప్పుడూ, ఎక్కడా చేయని సరికొత్త ఆవిష్కరణ. వారసత్వ సంపదగా మానవ నాగరికతతో బలమైన అనుబంధం కలిగిన ఎడ్ల జాతి అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నప్పుడు వాటి ద్వారా సరికొత్త ఆదాయ మార్గాలను ఈ ప్రాజెక్టు చూపింది. ఎద్దులను ట్రెడ్‌మిల్‌పై నడిపించడం ద్వారా విద్యుదుత్పత్తి చేసే విధానం అద్భుతం. బహుశా ఇలాంటి ప్రయోగం ఇప్పటి వరకు ఎక్కడా జరిగి ఉండదు. ఒకవైపు పర్యావరణ పరిరక్షణ.. మరోవైపు పశుజాతి సంరక్షణ.. ఇంకోవైపు పేద విద్యార్థులకు ఉత్తమ విద్యాబోధన అందిస్తున్న చింతా శశిధర్ ఫౌండేషన్‌ను ప్రభుత్వం తరపున అభినందిస్తున్నా.

## రైడెన్‌కు పచ్చజెండా

-మొదటిపేజీ తరువాయి

రాయితీకి భూములివ్వాలని.. వాటికి పూర్తిగా స్టాంపు డ్యూటీ మినహాయింపు ఇవ్వాలని, 100 శాతం ఎస్‌జీఎస్‌టీ రాయితీ ఇవ్వాలని ప్రతిపాదించారు. వీటితో పాటు ఎలక్ట్రిసిటీ డ్యూటీ పూర్తి మినహాయింపు, పది శాతం క్యాపిటల్ సబ్సిడీ ఇవ్వాలన్న ప్రతిపాదనను కూడా క్యాబినెట్ ఆమోదించింది. మంత్రివర్గ సమావేశంలో ఈ ప్రతిపాదనలు వచ్చినప్పుడు సీఎం చంద్రబాబు స్పందించారు. రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిపై కొత్త విశ్వాసం కనిపిస్తోందని.. టీసీఎస్, కాగ్నిజెంట్ సహా.. ప్రపంచ ప్రఖ్యాత గూగుల్, ఐబీఎం వంటి సంస్థలు రాష్ట్రంలో వ్యాపార కార్యకలాపాలు చేపట్టేందుకు ముందుకొచ్చాయన్నారు. విశాఖ నగరం భవిష్యత్‌లో ఐటీ రంగంలో అత్యున్నత స్థాయికి చేరుకుంటుందన్న ధీమా వ్యక్తంచేశారు. కాగా.. రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్ ఏర్పాటుకు సంబంధించి 14న ఢిల్లీలో ఎంవోయూ కుదుర్చుకోనున్నారు. ఇందుకోసం చంద్రబాబు, లోకేశ్ 13న ఢిల్లీ వెళ్లనున్నారు. వీరితోపాటు కేంద్ర ఐటీ-ఎలక్ట్రానిక్స్ మంత్రి అశ్వనీ వైష్ణవ్ సమక్షంలో డేటా సెంటర్ ఏర్పాటు ఒప్పందంపై గూగుల్, రైడెన్ సంస్థల ఉన్నతాధికారులు సంతకాలు చేసి అధికారిక ప్రకటన చేస్తారు. ఈ పర్యటనలో భాగంగా సీఎం ప్రధాని మోదీని కూడా కలిసే అవకాశం ఉంది.

## అంతా ప్లాన్ ప్రకారమే..!

-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వ పెద్దలు ఇచ్చిన హామీ కథ కమామిషు ఇలా సాగింది. అన్నమయ్య జిల్లా ములకలచెరువులో పట్టుబడ్డ నకిలీ రాకెట్‌లో అడ్డంగా దొరికిన ఆఫ్రికా మోడల్ కల్తీ మద్యం మాఫియా సూత్రధారులు టీడీపీ తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి, ఆయన భాగస్వామి జనార్దన్‌రావుతో పాటు సురేంద్రనాయుడు ప్రభుత్వ పెద్దలకు ఎదురుతిరిగారు. తమను బయటపడేయకుంటే ఎన్నికలకు ముందు కుదిరిన డీల్ ప్రకారం... పెదబాబు, చినబాబు ఆదేశాలతోనే రాష్ట్రస్థాయిలో నకిలీ మద్యం దందాను వ్యవస్థీకృతం చేశామనే వాస్తవాన్ని బయటపెడతామని తేల్చి చెప్పారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ఓ టీడీపీ సీనియర్ ప్రజాప్రతినిధితో పాటు కేసును పర్యవేక్షిస్తున్న ఐపీఎస్ అధికారి ద్వారా కూడా సమాచారం పంపించారు. 'మమ్మల్ని బయటపడేసే బాధ్యత ప్రభుత్వ పెద్దలదే... లేకపోతే మొత్తం నకిలీ మద్యం గుట్టు విప్పుతామని కుండబద్దలు కొట్టారు. జయచంద్రారెడ్డి, జనార్దన్‌రావు నోరువిప్పితే బండారం బయటపడుతుందని నకిలీ మద్యం దందా కుట్రదారులు, లబ్ధిదారులైన పెదబాబు, చినబాబు బెంబేలెత్తారు. "తప్పని పరిస్థితుల్లో కేసు నమోదు చేశాం తప్ప అంతకుమించి దర్యాప్తు ముందుకుసాగకుండా నీరుగారుస్తాం" అని హామీ ఇచ్చినట్టు సమాచారం. ప్రజలను తప్పుదారి పట్టించేందుకే జయచంద్రారెడ్డిని సస్పెండ్ చేసినట్టు ప్రకటించి కనికట్టు చేశామని.. టీడీపీలో ఆయన స్థానానికి ఢోకా లేదని కూడా భరోసా ఇచ్చారు. "విచారణకు హాజరైనట్టు, పోలీసులకు సహకరిస్తున్నట్టు నటించండి. కొన్ని రోజుల్లోనే మిమ్మల్ని బయటకు తెచ్చి కేసును పూర్తిగా పక్కదారి పట్టిస్తామని" చెప్పారు. ఈ డ్రామా కొనసాగింపులోనే నకిలీ మద్యం వ్యవహారంలో టీడీపీ నేతల ప్రమేయం లేదని వీడియో ద్వారా ప్రకటించాలని జనర్దాన్‌రావును చినబాబు ఆదేశించినట్టు తెలుస్తోంది. ఇలా అందరినీ నమ్మించేందుకు ఓ ఆధారాన్ని సృష్టించినట్టు కూడా అవుతుందన్నదన్నది అసలు ఉద్దేశం. కేసు నుంచి బయటపడేస్తామన్న భరోసా వచ్చాకే... జనార్దన్‌రావు 4 రోజుల క్రితం వీడియో విడుదల చేశారు. అయితే, నకిలీ మద్యం వ్యవహారంతో టీడీపీ నేతలకు సంబంధం ఉందో లేదో చెప్పాల్సింది దర్యాప్తు చేసే పోలీసు అధికారులు. కానీ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న జనార్దరావు టీడీపీ నేతలకు క్లీన్‌చిట్ ఇవ్వడం గమనార్హం. ఇదంతా చూస్తుంటే కేసును పక్కదారి పట్టించేందుకు ఎంత పక్కాగా కథ నడుపుతున్నారో స్పష్టమవుతోంది. ఆ స్కెచ్‌లో భాగంగానే జనార్దన్‌రావు పోలీసులకు సమాచారం ఇచ్చి మరీ గన్నవరం విమానాశ్రయంలో దిగారు. వెంటనే పోలీసులు అరెస్టు చేయడంతో డ్రామాలో మొదటి అంకం పూర్తయింది. ఇక కొద్ది రోజుల్లోనే జనార్దన్‌రావును బెయిల్‌పై తీసుకొచ్చి కేసును పూర్తిగా నీరుగార్చాలన్నదే ప్రభుత్వ పెద్దల ఎత్తుగడ అని పోలీసు వర్గాలే వ్యాఖ్యానిస్తున్నాయి.


**నకిలీ మద్యం కేసులో జనార్దన్‌రావు అరెస్ట్**

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నకిలీ మద్యం కేసులో ప్రధాన సూత్రధారి అద్దేపల్లి జనార్దన్‌రావును ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం గన్నవరం ఎయిర్‌పోర్టులో అదుపులోకి తీసుకుని విజయవాడకు తరలించారు. అద్దేపల్లి జనార్దన్‌రావు ములకలపల్లి, ఇబ్రహీంపట్నం నకిలీ మద్యం కేసులో ఏ1 నిందితుడిగా ఉన్నారు. నకిలీ మద్యం గుట్టు రట్టయిన వెంటనే ఆయన ఆఫ్రికా పారిపోయినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఇబ్రహీంపట్నం నకిలీ మద్యం కేసులో 12 మందిపై ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో మొదట ముగ్గురు నిందితులు అద్దేపల్లి జగన్మోహన్‌రావు, బాదల్ దాస్, ప్రతాప్ దాస్, కట్టారాజు, శ్రీనివాసరెడ్డి, కళ్యాణ్‌ను అరెస్ట్ చేశారు. శుక్రవారం ఉదయం హైదరాబాద్‌కు చెందిన రవిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేసి విజయవాడ తరలించారు. ఏ%-%1 అద్దేపల్లి జనార్దన్‌రావు కూడా అరెస్ట్ కావడంతో ఈ కేసులో ఇప్పటి వరకు మొత్తం 8 మంది నిందితులను ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేసినట్టయింది. అద్దేపల్లి జనార్దన్‌రావు అరెస్ట్‌పై శుక్రవారం ఉదయం నుంచి నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఆయన విదేశాలకు పారిపోయాడని అధికారులు చెబుతున్నప్పటికీ... విజయవాడలోనే తలదాచుకున్నాడని ప్రచారం జరిగింది. కానీ జనార్దన్‌రావు ఎయిర్ ఇండియా విమానంలో ముంబై నుంచి గన్నవరం ఎయిర్ పోర్టుకు శుక్రవారం సాయంత్రం 5.45 గంటలకు చేరుకున్నారు. అప్పటికే అక్కడికి చేరుకున్న ఎక్సైజ్ పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా జనార్దన్‌రావు మీడియాతో మాట్లాడుతూ తనను రాజకీయంగా ఈ కేసులో ఇరికించారన్నారు. ఆయన తరపు న్యాయవాది రవీంద్ర రెడ్డి మీడియాతో మాట్లాడుతూ జనార్ధనరావును తీసుకొచ్చి సరెండర్ చేస్తామని చెప్పినా ఎక్సైజ్ పోలీసులు స్పందించలేదన్నారు. ఆయనను బలవంతం చేసి వారికి కావాల్సిన విధంగా వాంగ్మూలం తీసుకొనేందుకు అదుపులోకి తీసుకున్నారన్నారు.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...







కాకినాడ తూర్పు గోదావరి

డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

శనివారం, 11 అక్టోబర్ 2025




www.viswamvoice.com

## మండపేట పట్టణ అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే వేగుళ్ల...




**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులు పూర్తి నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వర్గతిన పూర్తి చేయాలని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. మండపేట ఆలమూరు రోడ్ లో మున్సిపల్ నిధులతో చేపట్టిన పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మెయిన్ రోడ్ పాత టోల్ గేటు వద్ద ఏర్పాటు చేసిన స్వాగత తోరణం ఆధునీకరణ పనులు పరిశీలించారు. పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు పూర్తి పారదర్శకతతో చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు, అర్ అండ్ బి ఎస్ ఈ , ఈ ఈ, డి ఇ, మునిసిపల్ ఏ ఇ దాసరి పవన్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఏలూరు రేంజ్ ఐజి అశోక్ కుమార్ సంతృప్తి



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఏలూరు రేంజ్ ఐజి అశోక్ కుమార్ ఐపీఎస్ సంతృప్తి వ్యక్తం చేశారు. వాడపల్లి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేసిన ఏలూరు రేంజ్ ఐజి అశోక్ కుమార్ బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా శుక్రవారం ఆయన వాడపల్లి విచ్చేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్, కొత్తపేట డీఎస్పి సుంకర మురళీమోహన్, రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్ విద్యాసాగర్, ఆత్రేయపురం ఎస్సై రాంబాబు, వాడపల్లి దేవస్థానం డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావులతో కలిసి ఆయన బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. మాడవీధులను,పార్కింగ్ ప్రదేశాన్ని, క్యూలైన్ల ఏర్పాటును పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు బాగున్నాయన్నారు.గత ఏడాదిలో ఆలయం మరింత అభివృద్ధి చెందిందని తెలిపారు. మాడవీధులు విశాలవంతమైయ్యాయని, ఆలయ దక్షిణ,ఉత్తరసింహ ద్వారాల వెడల్పుతో భక్తులకు సులభతరంగా దర్శనం అవుతుందని ఆయన అన్నారు. శనివారం అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తు ఉండడంతో ప్రత్యేకమైన భద్రత ఏర్పాటు చేశారన్నారు.


## విద్యార్థి స్థాయికి అనుగుణంగా బోధన చేయాలి

లెర్నింగ్ అవుట్ కమ్స్‌పై దృష్టి సారించాలి - జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా, సమగ్ర శిక్షా ఏపీసీ జి.మమ్మీలు



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక మండలం ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో డీఎస్సీ2025 ఉపాధ్యాయుల ఇండక్షన్ ట్రై నింగ్ ముగింపు సమావేశం శుక్రవారం నిర్వహించారు. కోర్సు డైరెక్టరు పి.పల్లయ్యశర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీఈవో సలీం బాషా, సమగ్ర శిక్షా ఏపీసీ మమ్మీలు మాట్లాడుతూ పాఠశాలలో తరగతి లక్ష్యాలకు అనుగుణంగా బోధన చేయాలన్నారు. ఆసక్తికరంగా బోధన చేయాలని, వెనుకబడిన విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని బోధన చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థి తరగతి గది అభ్యసనా సామర్థ్య లక్ష్యాలను సాధించాల్సిన అవసరం ఉపాధ్యాయులపై ఉందన్నారు. వెన్యూ అబ్జర్వర్, సమగ్ర శిక్షా ఏఎంవో పి.రాంబాబు మాట్లాడుతూ 244 మంది ఉపాధ్యాయులు శిక్షణను సమర్థవంతంగా తీసుకున్నట్లు తెలిపారు. 10 మంది ఎస్ఆర్పీలు గణితం, ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ సబ్జెక్టులకు సంబంధించిన బోధనా మెళకువులను తెలియజేశారన్నారు. ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశరావు, సమగ్ర శిక్షా ఏపీలో, జీసీడీవో డాక్టర్ ఎంఏకే భీమారావు, జిల్లా సైన్స్ అధికారులు జీవీఎస్ సుబ్రహ్మణ్యం, ఎం.శ్రీనివాసవినీల్, జీఎన్‌వీఎస్ నెహ్రూ, ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, వైవీవీ సత్యనారాయణ, చోడిశెట్టి ఆంజనేయులు, హెచ్ఎం బీహెచ్.రామకష్ణ తదితరులు మాట్లాడారు. గణితం, ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ సబ్జెక్టు నిపుణులు పీఎల్ఎన్ శ్రీరామ్, బెహరా సత్యనారాయణమూర్తి, అంగాని గోపాలకష్ణ తదితరులు ఆయా సబ్జెక్టులకు సంబంధించి అకడమిక్ విద్యా సంవత్సరంలో గణితం, సైన్స్ పరంగా నిర్వహించే కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం ఉపాధ్యాయులకు పార్టిసిపేషన్ సర్టిఫికేట్లు అందజేశారు. అలాగే మూడు సబ్జెక్టుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన తొమ్మిది మంది ఉపాధ్యాయులకు బెస్ట్ పార్టిసిపేషన్ సర్టిఫికేట్లు అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు కడలి వెంకటేశ్వరరావు, వైవీవీ సత్యనారాయణ, చోడిశెట్టి ఆంజనేయులు, ఎస్ఆర్పీలు కేఆర్ఎస్ పద్మావతి, మేకా రామలక్ష్మి, ఏవీఎల్ నరశింహారావు, ఎస్.బాబులు, బి.రామకృష్ణ, నూకరాజు, స్వర్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు అలాగే బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో శిక్షణలో ఉత్తమ ఉపాధ్యాయులుగా నిలిచిన వారికి ప్రశంసా పత్రాలు అందజేస్తున్న డీఈవో సలీం బాషా, ఏపీసీ మమ్మీ తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత...



**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పురపాలక సంఘం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా దోమలు నివారణకు మందు చల్లారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, దోమల వృద్ధిని అరికట్టడానికి ముందస్తుగా చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం శానిటరీ ఇన్స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు పర్యవేక్షణలో వార్డు శానిటేషన్ మేస్త్రీలు, సెక్రటరీలు ఆద్వర్యంలో పట్టణంలోని 30 వార్డులలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించారు. మేజర్ డ్రైన్ల లో ఆయిల్ బాల్స్ కట్టించారు. అన్ని మైనర్ డ్రైన్ లో ఏం ఎల్ ఆయిల్ ను స్ప్రేయింగ్ చేశారు. ఆయిల్ బాల్స్ స్ప్రేయింగ్ ద్వారా దోమల వృద్ధిని అరికట్టవచ్చునని కమీషనర్ టివి రంగారావు పేర్కొన్నారు. ప్రజలందరూ తమ ఇంటి పరిసరాలలోనూ ఇంటి లోపల మంచినీటి నిల్వలు ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. డెంగ్యూ ఇతర సీజనల్ వ్యాదుల నుండి రక్షణ పొందాలని పేర్కొన్నారు.

## లైన్ డిపార్ట్మెంట్, మిల్లర్లు, ధాన్యం కొనుగోలు పగడ్బందీగా చేపట్టాలి : జేసీ నిషాంతి



**అమలాపురం విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఖరీఫ్ సీజన్ 2025బి26 సంవత్స రానికి సంబంధించి ధాన్యం సేకరణ పకడ్బందీగా చేప ట్టాలని. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి లైన్ డిపార్ట్మెంట్ అధికారులను మిల్లర్స్ ను ఆదేశించారు. శుక్రవారం స్థాని కలెక్టరేట్ నందు సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్, ఫుడ్ కార్పొరే షన్ ఆఫ్ ఇండియా ప్రతిని ధులు పౌరసరఫరాల అధికారులు మిల్లర్లతో సమావేశం నిర్వహించి ఖరీఫ్ సీజన్లో ధాన్యం కొను గోలు సన్నద్ధత చర్య లపై సమీక్షించారు జిల్లాలో ధాన్యం సేకరణకు చేపట్ట వలసిన పటిష్ట చర్యలపై మిల్లర్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం సేకరణ సజావుగా చేపట్టే విధంగా ముందస్తు ప్రణా ళికతో సిద్ధంగా ఉండా లన్నారు. వ్యవసాయ, పౌరసరఫరాలు, రెవెన్యూ శాఖల అధికారులు సమ న్వయం, మిల్లర్లతో సహకారం చేసుకుంటూ ధాన్యం సేకరణ చేపట్టాల న్నారు. సాగు విస్తీర్ణం ఆధారంగా జిల్లావ్యాప్తంగా 4 లక్షల 40 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం దిగుబడి రానున్నదని దీనిలో స్థానిక వినియోగానికి పోను మిగి లిన 3 లక్షల 50 వేలు మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలుకు పౌర సరఫ రాల శాఖ లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. ధాన్యం సేకరణకు గాను జిల్లా వ్యాప్తంగా 85 లక్షలు గోనె సంచుల సిద్ధం చేయాల న్నారు రవాణా వాహనాల జిపిఎస్ కోఆర్డినేట్స్ తో రిజిస్ట్రేషన్ పూర్తి చేయాల న్నారు. రైతు సేవా కేంద్రాలు నుంచి మిల్లులకు చేరే ధా న్యంలో తేమ శాతంలో ఎలాంటి వ్యత్యాసాలు ఉండకూడదని, రెండు చోట్ల ఒకే కంపెనీకి చెందిన తేమ శాతం కొలిచే యంత్రాలు ఉండాలని ఆదేశించారు తేమ శాతాన్ని నిర్ధారించ డంలో సిబ్బంది జాగ్రత్తగా వ్యవహరించే విధంగా చూడాలన్నారు. ఆ గ్రామం లో రోజుకు ఎంత మొత్తం లో ధాన్యం దిగుబడి రావ చ్చనే విషయంపై గ్రామ వ్యవసాయ సహాయకులు అవగాహన కలిగి ఉండా లని, కోత కోసే విషయాన్ని రైతు సేవా కేంద్రంలో ముం దుగా తెలియపరిచేవిధం గా రైతులకు గ్రామ సభల ద్వారా అవగాహన పరచా లని, తద్వారా ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలో ఏర్పడే గందరగోళాన్ని నిరోధించాలన్నారు. రైతు సేవా కేంద్రం ద్వారానే మిల్లుకు ధాన్యం వెళితే ట్రక్ షీట్ జనరేట్ అవుతుందని, లేనిపక్షంలో మిల్లర్లు ధాన్యం అన్లోడ్ చేసుకోక రైతు ఇ బ్బంది పడాల్సి వస్తుందని, ఈవిషయాన్ని రైతుకు అర్థమయ్యే విధంగా వివ రించి చెప్పాలన్నారు, జిల్లా వ్యాప్తంగా 151, రైస్ మిల్లు లు ఉన్నాయన్నారు వీటికి కెపాసిటీ ఆధారంగా లక్ష్యా లు నిర్దేశిస్తామన్నారు. ఇప్పటికే మిల్లుల తనిఖీ ప్రక్రియ సజావుగా నిర్వ హించి సెల్ఫ్ డిక్లరేషన్ సమర్పించడం జరిగింద న్నారు. సీఎంఆర్ సేకరణ లో జిల్లా మొదటి ప్లేస్ లో నిలిచిం దని రానున్న ఖరీఫ్ లో కూడా అదే స్ఫూర్తితో ధాన్యం సేకరణ పూర్తి చేయాలన్నారు. ఏడాది దాన్యం సేకరణ పెంచి నందున మిల్లర్లకు సం తృప్తికర స్థాయిలో లక్ష్యాలు వస్తాయన్నారు నాణ్యమైన గోనె సంచులను మిల్లర్లు సరఫరా చేయాలన్నారు. గోనే సంచులను ముందుగా రైతు సేవ కేంద్రాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవ సరాల మేరకు నిల్వ ఉంచా లన్నారు. సీఎంఆర్ డెలివ రీలో జాప్యాలకు తావివ్వ రాదని మిల్లర్లకు సూచించారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన ఆన్లైన్ బ్యాంకు గ్యారంటీ విధానం విజయవంత మైందని ప్రస్తుతం వ్యాప్తం గా ఈ విధానాన్ని ప్రవేశపె ట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఇది పూర్తయితే ఆన్లైన్ విధానం అందుబాటులోకి వస్తుందని ప్రస్తుతం ఆఫ్ లైన్ లోనే అమలాపురం బ్రాంచ్ ఐసిఐసిఐ బ్యాంక్ కోడ్ నెంబర్ ద్వారా బ్యాంక్ గ్యారంటీలను తీసి సమ ర్పిస్తే బ్యాంకుకు వెళ్లే అవసరం లేకుండా ఆన్లైన్ వెరిఫికేషన్కు ఆస్కారం ఉంటుందన్నారు.తక్కువ సామర్థ్యం కలిగిన మిల్లుల కు తక్కువ ధాన్యం పంపా లని, అదేవిధంగా అత్యవస ర పరిస్థితుల్లో ఇతర మిల్లు లకు ధాన్యం పంపేందుకు గానూ అవసరమైతే ముం దస్తుగా మిల్లులను ఆన్లైన్లో అనుసంధానం చేసుకొని సిద్ధంగా ఉంచు కోవాలన్నా రు. నవంబర్ మొదటి వారంలో ధాన్యం సేకరణ ప్రారంభమవుతుందన్నారు ధాన్యం సేకరణ సజావుగా సాగేందుకు ఈబిపంట నమోదు త్వరితగతిన పూర్తి చేయాలని ఈ సంద ర్భంగా ఆమె అధికారులకు సూచించారు. ధాన్యానికి ప్రస్తుత సీజన్లో ధర రూ 69 ల వరకు పెంచారని అదే విధంగా గోనె సంచెలు అద్దె కూడా రూ 4 .74 పైసలకు పెంచడం జరిగిందన్నారు. రైతులకు ఇబ్బంది తలెత్త కుండా ప్రతి దశలో అప్రమ త్తంగా వివరించి గిట్టుబాటు ధరలు కల్పించాలని సూ చించారు. కంట్రోల్ రూమ్ను 24/7 ఏర్పాటు చేసి ఫిర్యా దులు పరిష్కరిం చడం జరుగుతుం దని ఆమె సూచించారు. గత సీజన్లో అతి తక్కువగా ధాన్యం సేకరణ చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తీసివేసి గతంలోఎక్కువగా ధాన్యం సేకరించిన కొనుగో లు కేంద్రాల వద్ద మరో కేం ద్రంగా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మిల్లు ల విద్యుత్ వినియోగాన్ని మిల్లుల ఉత్పత్తిని బేరీజు వేస్తూ వ్యత్యాసాలు ఉన్నట్ల యితే సరి చేసుకోవాలని లేని పక్షంలో తనిఖీలలో చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఏ ఉద య భాస్కర్, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ పి శ్రీనివాసరావు, ఎఫ్ సి ఐ రీజినల్ మేనేజర్ గంగాధర్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు చౌదరి లక్ష్మీనా రాయణ మిల్లర్ల ప్రతిని ధులు పాల్గొన్నారు.


## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆటలపోటీలు...



**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** క్రీడలతో మానసిక ఉల్లాసం తో పాటు శారీరక దృఢత్వం ఉంటుందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టికెవి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ స్పోర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో వివిధ ఆటల పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని పేర్కొన్నారు. చదువుతో పాటు క్రీడలను నేర్చుకుని విద్యార్థులు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. వాలీ బాల్, కబడ్డీ, ఖో ఖో, పరుగుపందెం, సైక్లింగ్ పోటీలలో గెలుపొందిన వారికి మెడల్స్, సర్టిఫికెట్స్ తో బాటు బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు లెఫ్టినెంట్ కమాండర్ డాక్టర్ కె ఎస్ ఆర్, ఎన్ స్ వి కిరణ్, వెంకన్న, వ్యాయామ అధ్యాపకులు చంద్ర శేఖర్ రాజేష్, వీర్రాజు, చంటి,జి. ఇస్మాయిల్ యువజన మంత్రిత్వ శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

### సి.సి రోడ్డు నిర్మాణ పనులను

## పరిశీలించిన చైర్ పర్సన్ రాణి



**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట 1,29 వ వార్డుల్లో జరుగుతున్న సి.సి రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి ఆ వార్డు కౌన్సిలర్ల తో కలిసి శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.77లక్షలతో రోడ్డు నిర్మాణ పనులను చేపట్టామన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్ కు సూచించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పోతంశెట్టి ప్రసాద్, పిల్లి శ్రీనివాసు, ఏ.ఈ డి.పవన్ కుమార్, ఇంజినీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 'జీఎస్టీ తగ్గింపును లాభాలుగా మళ్లిచేందుకు కంపెనీల ప్రయత్నాలు'



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** జీఎస్టీ తగ్గింపు ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.ఎమ్మార్పీ ధరలను పెంచే ఆలోచనలో వ్యాపార వర్గాలు జీఎస్టీ తగ్గింపును లాభాలుగా మలిచేందుకు కంపెనీలు ప్రయత్నాలు ప్రజలకు మేలు చేసేందుకు గాను ఇటీవల ఎన్డీఏ ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపును అమలు చేసిందని ప్రభుత్వానికి ఆదాయం తగ్గుతున్నప్పటికీ ఇది ప్రజలకు ఎంతో గాను మేలు చేస్తుందని భావించి జీఎస్టీ తగ్గింపును కూటమి ప్రభుత్వం అమలు చేసిందని టిడిపి నాయకులు తెలియజేశారు. జీఎస్టీ తగ్గింపును ప్రజలకు అవగాహన కల్పిస్తూ జీఎస్టీ అమలపై షాపులు వద్దకు వెళ్లి పర్యవేక్షిస్తున్నారు. జిఎస్టి అమలపై కూటమి నాయకులు మాట్లాడుతూ జి ఎస్ టి తగ్గింపు వలన కొనుగోలు ధరలో వినియోగదారుడికి కలిగిన వ్యత్యాసాన్ని లాభాలుగా మలిచేందుకు వ్యాపార వర్గాలు ప్రయత్నిస్తున్నారు. ఎమ్మార్పీ ధరలను పెంచే ఆలోచనలో కంపెనీలు ఉన్నట్టు తెలుస్తుందని పేర్కొన్నారు.ప్రభుత్వ ఉద్దేశం ప్రజలకు చేరాలంటే ఇప్పట్లో ఎమ్మార్పీ ధరలను పెంచకుండా చూడాలని కచ్చితంగా నియంత్రించవలసిన బాధ్యత ప్రభుత్వం ఉందని అన్నారు.అప్పుడే సామాన్య ప్రజలకు సైతం మేలు జరుగుతుంది.జీఎస్టీ తగ్గింపును సమర్థవంతంగా అమలు జరగకపోతే ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతుందే తప్ప ప్రజలకు మేలు జరగదని వారన్నారు పాత స్టాక్కులను మార్చి వరకు యధావిధిగా అమ్మకాలు జరుపుకోవచ్చుననీ వ్యాపార వర్గాలకు ప్రభుత్వం కల్పించిన ఉపసమనం కారణంగా కొన్ని వస్తువులుపై జిఎస్టి తగ్గడం లేదు. కారులు బైకులు వంటి వాటిపై జిఎస్టి ప్రభావం కనిపిస్తున్నప్పటికీ నిత్యవసర సరుకులు పై అంతగా ప్రభావం కనిపించడం లేదు. ధరలు పెంచేటప్పుడు మరుసటి రోజే పెరిగిన ధర అమల్లోకి వస్తాయి.ధరలు వెంటనే పెంచేస్తారు. తగ్గించేటప్పుడు మాత్రం మార్చి వరకు ఆగాల్సిన పరిస్థితిలు కల్పిస్తున్నారని అన్నారు.జీఎస్టీ తగ్గింపు పూర్తిస్థాయిలో అమలు జరిగితే ప్రజలకు ఎంతో ఊరట కలిగిస్తుంది. ప్రజలకు మేలు జరుగుతుందనటంలో ఎటువంటి సందేహం లేదు ప్రతిపక్షాల సైతం ఒప్పుకొని తీరాల్సిందే జీఎస్టీ తగ్గింపుకు తూట్లు పొడవకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టి కచ్చితంగా అమలు జరిపించాలి. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జీఎస్టీ తగ్గింపును ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రజలకు చేరువయ్యేలా చూడాలని ఎమ్మెల్యేలకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఆదేశాలకు అనుగుణంగా కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు జిఎస్టి తగ్గింపును ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అనేక కార్యక్రమాలు చేస్తూ పాల్గొంటున్నారు.ప్రజలకు మేలు చేయాలన్నదే కూటమీ ప్రభుత్వ లక్ష్యం. అది నెరవేర్చే దిశంగా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు తీసుకుంటుంది. అందులో భాగంగా జీఎస్టీ తగ్గించరనీ తెలియజేస్తూ ఇది ప్రజలకు నూటికి నూరు శాతం అంది తీరాలని అన్నారు.

**కంపెనీలు చేస్తున్న మరో ఘరానా మోసం**

అమ్మకాల కోసం కొన్ని కంపెనీలు ధర పెంచకుండా వస్తువు తూకం తగ్గించి అమాయక వినియోగ దారులను మోసం చేస్తున్నారు.ఉదాహరణకు ఒక లీటర్ ఆయిల్ 150 రూపాయలకు ఒక కంపెనీ కనిష్ట ధర నిర్ణయించి విక్రయిస్తుంటే మరొక కంపెనీ 150గ్రాములు బరువు తగ్గించి ధరలో 5 నుండి 8 రూపాయలు మాత్రమే ధర తగ్గించి విక్రయిస్తుండడంతో తక్కువ ధర అనుకుని వినియోగదారుడు కొనుగోలు చేస్తున్నాడు. ఇక్కడ కొనుగోలుదారుడు నష్టపోతున్నారు. 50 గ్రాములు పేస్టు 35 గ్రాములు గాను 100 గ్రాముల సబ్బులు 90 గ్రాములు గాను విక్రయిస్తున్నారు. ఖచ్చితమైన ప్రమాణికంగా తూనికలు ఉండడం లేదు. ఎప్పుడూ కూడా ఒక వస్తువుకు కేజీ గాని 1/2 కేజీ అని గాని 50 గ్రాములు 100 గ్రాములు అని ప్రమాణికంగా తూనికలు ఉండాలి. పూర్వం నుండి ఈ బరువులకే ధరలు నిర్ణయించి అమలు చేయబడ్డాయి.ఇప్పుడు కొత్తగా కంపెనీలు ఇటువంటి తప్పుడు తూనికలను నిర్ణయించి వినియోగదారులను అయోమయంలో పడేస్తున్నారు.ఒక వస్తువుకు ఖచ్చితమైన ప్రమాణికమైన తూనిక ఉండటం లేదు.ఇది గమనించి ధర ఏదైనాప్పటికీ తూనిక మాత్రం ఒకే విధంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కూటమి నాయకులు గుబ్బల మూర్తి. చోడపనీడి భాస్కరరావు దేవపాటి వెంకటేశ్వరరావు ధూనబోయిన ప్రదీప్ బయ్యే రాంబాబు మహమ్మద్ మీరాన్ షరీఫ్ కొప్పిశెట్టి సత్తిబాబు కొత్తపల్లి వెంకటరమణ దూనబోయిన నారాయణలు కోరారు





# ఎడిటర్ వాయిస్

## బాలికల హక్కులకు రక్షణ ఏది?

అంతర్జాతీయ బాలికా దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబరు 11న నిర్వహించ బడుతోంది. బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను, అనర్థాలను నివారించి, వారి హక్కులను తెలియజేసేందుకు ఐక్యరాజ్య సమితి ఈ దినోత్సవాన్ని ప్రకటించింది. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో కెనడా తన తీర్మానంతో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని అధికారికంగా ప్రతిపాదించింది. కెనడా మహిళామంత్రి రోనా అంబ్రోస్ ఈ తీర్మానాన్ని స్పాన్సర్ చేసింది. 2011, డిసెంబరు 19న జరిగిన ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో 2012, అక్టోబరు 11న తొలి అంతర్జాతీయ బాలికా దినోత్సవంగా ఆమోదించే తీర్మానానికి ఓట్లు వేయగా, అధికారికంగా బాలికా దినోత్సవం గుర్తించబడిందిని తీర్మానం పేర్కొంది. అమెరికన్ పౌరహక్కుల కార్యకర్త ఎలానార్ రూజ్‌వెల్ట్, 192 దేశాలు సంతకం చేసిన మానవ హక్కుల ప్రకటనలో స్త్రీ, పురుష సమానత్వాన్ని ప్రతిబింబించేలా మ్యాన్ అన్న పదాన్ని పీపుల్‌గా మార్చింది. మహిళల ఆత్మగౌరవం కాపాడడం కోసం పోరాటం చేసిన ఎలానార్ రూజ్‌వెల్ట్ పుట్టిన రోజైన అక్టోబరు 11ను అంతర్జాతీయ బాలికా దినోత్సవంగా ఐక్యరాజ్య సమితి గుర్తించింది. 2012, అక్టోబరు 11న తొలిసారిగా ఈ దినోత్సవం జరుపబడింది. బాలికలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలియ చేయడమే కాకుండా, ఆ సమస్యలు పరిష్కరించ బడినప్పుడు జరిగే పరిణామాల గురించి కూడా అవగాహన పెంచడానికి ఈ దినోత్సవం ఉపయోగ పడుతున్నది. సమాజంలో బాలికలు ఎదుర్కొన్న సమస్యలు గురించి ప్రజలలో అవగాహన పెంచడానికి జరుపు కుంటారు. బాలిక శిశువు గురించి అసమానత్వం, విద్య, పోషణ, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, రక్షణ, గౌరవం, బాల్య వివాహాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. వాషింగ్టన్‌లోని యునైటెడ్ స్టేట్స్ అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ 2014లో అందించిన వివరాల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 62 మిలియన్లకు పైగా బాలికలకు విద్య అందడంలేదు. ప్రపంచవ్యాప్తంగా 5 నుండి 14 సంవత్సరాల వయస్సు గల బాలికలు, అదే వయస్సు గల అబ్బాయిల కంటే 160 మిలియన్ గంటలకుపైగా ఇంటి పనుల కోసం తమ సమయాన్ని కేటాయిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా, నలుగురిలో బాలికల్లో ఒకరికి 18 ఏళ్ళకంటే ముందుగానే వివాహం జరుగుతోంది. 2016, అక్టోబరు 11న, ఐక్యరాజ్యసమితి వుమెన్ గుడ్‌విల్ అంబాసిడర్ ఎమ్మా వాట్సన్, బలవంతపు బాల్య వివాహాలను అంతం చేయాలని ప్రపంచ దేశాలను, కుటుంబాలను కోరింది. చైనా మొదలు అమెరికాతో సహా ఆధునికత వైపు అడుగులు వేస్తున్న భారత్‌లోనూ అమ్మాయిల పట్ల వివక్ష ఉంటుందని గ్లోబల్ ఎర్లీ అడల్సెంట్ స్టడీ పేరిట నిర్వహించిన ఒక అధ్యయనంలో భాగంగా... అమ్మాయిలు పదహారేళ్ల వయసుకు చేరుకున్నప్పటికీ మానసిక ఒత్తిడికి గురవు తున్నారని తేలింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ, జాన్‌హాఫ్‌కిన్స్ బ్లూమ్ బెర్గ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ కిడ్స్ సంయుక్తంగా 15 దేశాల్లో నిర్వహించిన సర్వేలో అమ్మాయిలు శారీరకంగా బలహీనులనే విషయం... చిన్న వయసులోనే ముద్ర పడేలా చేయడంలో తల్లిదండ్రులు, బంధువులు, మిత్రులు, టీచర్లు కీలకపాత్ర పోషిస్తున్నట్టు తేలింది. బాలికల కంటే అబ్బాయిలకే ఎక్కువ ప్రాధాన్యత అధికంగా ఇవ్వడం సర్వత్రా వ్యక్తమవు తున్నది. ఇటీవల కాలంలో ఆడపిల్లగా పుట్టడం, పుట్టినా సురక్షితంగా మనుగడ సాగించడమే దుర్భరమైన దురవస్థ ఉంది. ఆడపిల్ల అనగానే సమాజంలో చిన్నచూపు చూస్తున్నారు. అంతేకాకుండా కడుపులో బిడ్డ ఆడపిల్ల అని తెలియగానే భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారు. పుట్టిన తరువాత అనేక ఆంక్షలు విధిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా బాల్య వివాహాల్లో నలభై శాతంకి పైగా భారత్‌లోనే జరుగు తున్నాయన్న చేదు నిజాన్ని యునిసెఫ్ స్పష్టం చేసింది. బాలికల ఉన్నత విద్య మరో సమస్యగా మారింది, ఇప్పటికి అధిక రాష్ట్రాల్లో 40%నికి పైగా పదో తరగతి కంటే ముందే బడి మాని వేస్తున్నారు. ప్రభుత్వాలు ఎన్ని కార్యక్రమాలు చేసినా ఎన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా, ఉన్నత విద్యలో డ్రాపౌట్స్ తగ్గడంలేదు. బాల్య వివాహం కారణంగా రాష్ట్రంలోని 28 శాతం మంది బాలికలకు పద్దెనిమిది సంవత్సరంలోపే వివాహాలు చేస్తున్నారు. యునెస్కో వెలువరించిన ప్రపంచ విద్య నివేదిక ప్రకారం భారత దేశంలో వయోజన నిరక్షరాస్యులలో మహిళలు 68 శాతం వున్నారు. పంతొమ్మిది ఏళ్లు నిండక ముందే దాంపత్య జీవితంలో అడుగు పెడుతున్నారు. బాలికల సంఖ్య 41 శాతం అని జనగణనలో తేలింది. బాల్య వివాహాలు, పాఠశాలలు చేరువ, అందుబాటులో పూర్తి స్థాయిలో లేకపోవడం, బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్ల కొరత, లైంగిక విచక్షణ వంటి సమస్యలు భారతావనిలో బాలిక విద్యకు శాపంగా పరిణ మించింది. పోషకాహార లోపం కారణంగా రక్తహీనతతో బాధపడుతున్న బాలికల సంఖ్య దేశంలో దాదాపు డెబ్బై శాతం అన్న అంచనాలు తీవ్రంగా కలవర పరుస్తున్నాయి. మహిళా కార్మిక శక్తి, వారి ఆదాయం, అక్షరాస్యాత స్థాయి, జననాల విషయం, తదితర అంశాల్లో అధమస్థాయిలో వున్న 20 దేశాల్లో మన దేశం ఒకటి కావడం ఆందోళనకర అంశం. మహిళలు పురుషులకన్నా ఎందులోనూ తక్కువ కాదు. ఆడపిల్లలు ప్రతి రంగంలో, చదువులో మొదలుకుని ఆటల దాకా, రాణిస్తున్నారు. పురుషులతో పోటీ పడుతున్నారు. బాలికల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం 'నేషనల్ గర్ల్స్ డెవలప్‌మెంట్ మిషన్' పేరుతో ఓ కార్యక్రమం తెచ్చింది. బాలికల సంపూర్ణ ఎదుగుదల కోసం రకరకాల సదుపాయాలు కల్పిస్తోంది. 2008 నుంచీ దీన్ని ఏటా నిర్వహిస్తోంది. సమాజంలో బాలికల సంరక్షణ, వాళ్ల హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల అంశాలపై ఈ రోజున అవగాహన కల్పిస్తోంది. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రధాని అయ్యాక... "బేటీ బచావో బేటీ పడావో" స్కీం తెచ్చారు. తద్వారా బాలికల చదువు, పెంపకంపై మరిన్ని జాగ్రత్తలు తీసుకునేలా చేస్తున్నారు. నేడు మహిళా సంఘాలు, ప్రభుత్వ యంత్రాంగం నిత్యం ఎన్నో చర్యలు తీసుకుంటున్నా మైనర్లపై అత్యాచారాలు ఆగడంలేదు. సమాజంలో అమ్మాయిలు, మహిళలకు రక్షణ కరువ వుతున్నది. ఎంతోమంది ఆడ పిల్లలు ఈ లోకంలో అడుగుపెట్టక ముందే బలవంతపు మరణాలకు బలవు తున్నారు. ఆధునిక పరిజ్ఞానం ఎంత పెరిగినా మానవతా విలువలు మాత్రం పెరగడం లేదు. దానికి నిదర్శనం భ్రూణ హత్యలు. గర్భస్త శిశువుల లింగ నిర్ధారణను నిషేధించి తద్వారా ఆడపిల్లల భ్రూణ హత్యలు నివారణ కోసం 1994లోనే చట్టం తెచ్చినా అది ఏనాడూ పకడ్బందీగా అమలైన జాడలు లేవు. సమాజంలో చైతన్యం నింపాలంటే ముందు మహిళ జాగృతం కావాలి. స్త్రీ కళ్లు తెరిస్తే కుటుంబం, దానితో పాటు గ్రామం,



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# క్విట్ ఇండియా ఉద్యమ హీరో జెపి

జెపిగా సుప్రసిద్దులైన జయప్రకాశ్ నారాయణ్ (అక్టోబరు 11, 1902, అక్టోబరు 8, 1979) భారత స్వాతంత్ర్య సమరయోధుడు, రాజకీయ నాయకుడు. సిద్ధాంత కర్త, సోషలిస్ట్ నాయకుడు. ఆయనను "క్విట్ భారతదేశం ఉద్యమం హీరో" అని పిలుస్తారు. 1970 వ దశకంలో అప్పటి భారత ప్రధాని ఇందిరా గాంధీకి వ్యతిరేకంగా ప్రతిపక్షానికి నాయకత్వం వహించి సంపూర్ణ విప్లవానికి పిలుపు నివ్వటం ద్వారా జయప్రకాశ్ నారాయణ్ చిరస్మరణీయు డయ్యాడు. ఆయనను ప్రజలు "లోక్ నాయక్" అని సగౌరవంగా పిలుచు కుంటారు. గత భారత ప్రభుత్వం ఆయన జయంతిని "ప్రజాస్వామ్య పరిరక్షణ దినం"గా ప్రకటించింది. జయప్రకాశ్ నారాయణ్ బెంగాల్ ప్రెసిడెన్సీ లోని ఉత్తర ప్రదేశ్ లోని బలియా జిల్లాకు, బీహారు లోని సారన్ జిల్లాకు మధ్యన గల సీతాబ్ధి యారా గ్రామంలో 1902 అక్టోబర్ 11న జన్మించాడు. ఉన్నత పాఠశాల విద్యను, కళాశాల విద్యను పాట్నాలో అభ్యసించాడు. అటుపిమ్మట అమెరికాలో 8 సం.లు, వివిధ విశ్వ విద్యాలయాలలో ఉన్నత విద్యనభ్యసించాడు. అమెరికాలో ఉన్న సమయంలో మార్క్స్ సిద్ధాంతాలను అధ్యయనం చేశాడు. ఆ కాలంలోనే యం.యన్.రాయ్ రచనల ప్రభావానికి లోనయ్యాడు. భారత దేశానికి తిరిగి వచ్చిన తరువాత ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ (కాంగ్రెస్ పార్టీ) లో చేరాడు. 1920లో జయప్రకాశ్ నారాయణ్ స్వాతంత్ర్య సమర యోధురాలు, కస్తూరిబా గాంధీ అనుచరురాలు అయిన ప్రభావతీ దేవిని వివాహ మాడాడు. అమెరికా నుండి వచ్చిన వెంటనే జవహర్‌లాల్ నెహ్రూ ఆహ్వానం మేరకు ఇండియన్ నేషనల్ కాంగ్రెసులో చేరి త్వరలోనే మహాత్మా గాంధీకి ప్రియ శిష్యుడుగా మారాడు. 1932లో శాసనోల్లంఘన ఉద్య మంలో పాల్గొన్నందుకు భారత దేశంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నందుకు 1932 లో ఆయనకు ఒక సంవత్సరం జైలు శిక్ష విధించ బడింది. విడుదలైన తరువాత కాంగ్రెసులో అంతర్భాగంగా కాంగ్రెస్ పార్టీలోని వామపక్ష సమూహంలో, వామపక్ష భావాలతో స్థాపించ బడిన కాంగ్రెసు సోషలిష్టు పార్టీ స్థాపనకు కృషి చేసి, జనరల్ సెక్రటరీగా నియమించబడ్డాడు. ఈ పార్టీ భారత స్వాతంత్ర్య ప్రచారానికి నాయకత్వం వహించిన సంస్థ. 1942లో క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో సీనియర్ కాంగ్రెసు నేతలంతా అరెష్టు చేయబడిన సమయంలో జయప్రకాశ్ నారాయణ్... రాం మనోహర్ లోహియా, బాసవన్ సింగ్ వంటివారితో కలసి ఉద్యమాన్ని ముందుండి నడిపాడు. రెండవ ప్రపంచ యుద్ధంలో బ్రిటన్ వైపు పాల్గొనడాన్ని వ్యతిరేకించి నందుకు 1939 లో బ్రిటిష్ వారు



మళ్లీ జైలు పాలయ్యారు, కాని తరువాత అతను నాటకీయంగా తప్పించు కున్నాడు. కొంతకాలం ప్రభుత్వానికి వ్యతిరేకంగా, హింసాత్మక ప్రతిఘటనను, నిర్వహించడానికి ప్రయత్నించి, 1943లో అరెస్టయి, 1946 లో విడుదలైన తరువాత బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా మరింత ఉగ్రవాద విధానాన్ని అవలంబించాలని కాంగ్రెస్ నాయకులను ఒప్పించడానికి ప్రయత్నించారు. స్వాతంత్ర్యా నంతరం జె.పి. ఆచార్య నరేంద్ర దేవ్, బాసవన్ సింగ్ మొదలైన వారితో కలసి కాంగ్రెసు నుండి బయటకు వచ్చి తమ సోషలిస్టు పార్టీ ద్వారా ప్రతిపక్ష పాత్ర పోషించారు. 1948 లో ఆయన, చాలా మంది కాంగ్రెస్ సోషలిస్టులతో కలిసి కాంగ్రెస్ పార్టీని వీడారు. అలా 1952 లో ప్రజా సోషలిస్ట్ పార్టీని ఏర్పాటు చేశారు. అనంతరం బీహారు, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల రాజకీయాలలో ఈ పార్టీ ప్రముఖ పాత్ర పోషించింది. 1954 లో జె.పి. రాజకీయాల నుండి విరమించుకుని తన జీవితాన్ని ప్రముఖ గాంధేయవాది అయిన ఆచార్య వినోబా భావే యొక్క సర్వోదయ ఉద్యమానికి, దానిలో అంతర్భాగమైన భూదాన్ ఉద్యమా నికి అంకితం చేశాడు. తన భూమి నంతా పేద ప్రజలకు ఇచ్చివేసి హజారి బాగ్‌లో ఒక ఆశ్రమాన్ని నెలకొల్పాడు. జె.పి. త్వరితగతిన భారతదేశంలో మహాత్మా గాంధీ భావాలకు అనుగుణంగా ఆయన అడుగు జాడలలో నడుస్తున్న సర్వోదయ ఉద్యమ కారులలో కెల్లా ప్రముఖునిగా రూపొందాడు. 1960 వ దశకం చివరిలో జయప్రకాశ్ నారాయణ్ తిరిగి బీహారు రాష్ట్ర రాజకీయాలలో క్రియాశీలంగా వ్యవహరించ నారంభించాడు. 1974 లో నారాయణ్ అకస్మాత్తుగా భారత రాజకీయ రంగం లో ప్రధాని అవినీతి మరియు పెరుగుతున్న అప్రజాస్వామిక ప్రభుత్వంగా తీవ్రంగా విమర్శించారు. బీహారులో జె.పి.నాయకత్వం వహించిన ఒక విద్యార్థి ఉద్యమం ఆతర్వాత బీహారు ఉద్యమంగా ప్రసిద్ధి పొందిన ఒక ప్రజా ఉద్యమంగా మారినది. ఈ ఉద్యమ సమయం లోనే శాంతి యుతమైన సంపూర్ణ విప్లవానికి జె.పి. పిలుపునిచ్చాడు. ఎన్నికల నియమావళి ఉల్లంఘన ఆరోపణల క్రింద నాటి భారత ప్రధాని ఇందిరా గాంధీని దోషిగా పేర్కొంటూ అలహా బాదు హైకోర్టు తీర్పు వెలువడిన వెంటనే జె.పి. ఇందిర రాజీనామాకు డిమాండ్ చేసి, మిలిటరీకి, పోలీసు యంత్రాంగానికి చట్ట విరుద్ధమైన, అనైతికమైన ఆజ్ఞలను పాటించ నవసరం లేదని సూచించాడు. ఈ పరిణామాలు ఇలా జరుగు తుండగానే ఇందిరాగాంధీ 1975 జూన్ 25 అర్థరాత్రి నుండి దేశంలో అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) ని విధించింది. జె.పి.ని, ప్రతిపక్ష నేతలను ప్రభుత్వం అరెస్టు చేసింది. ఆఖరికి కాంగ్రెసు పార్టీ లోనే యంగ్ టర్క్‌లుగా పిలువబడుతున్న అసమ్మతి నేతలు కూడా అరెస్టు చేయబడ్డారు. జె.పి. ఛండీఘడ్లో డిటెన్యూగా ఉంచబడ్డాడు. బీహారు వరదల సమయంలో అచటి పునరావాస కార్యక్రమాన్ని పర్యవేక్షించుటకు పెరోల్ పై విడుదల కోరినా కూడా ప్రభుత్వం తిరస్కరించింది. ఆఖరికి జె.పి. ఆరోగ్యం క్షీణించడంతో నవంబరు 12 న విడుదల చేయబడ్డాడు. చివరికి ఇందిరా గాంధీ జనవరి 18, 1977న ఎమర్జెన్సీని తొలగించి ఎన్నికలను ప్రకటించడంతో ఆమెను ఎదుర్కోవటానికి కాంగ్రెసుకు వ్యతిరేకంగా జె.పి.మార్గదర్శకత్వంలో జనతా పార్టీ రూపుదిద్దుకున్నది. చివరికి జనతా పార్టీ ఎన్నికలలో కాంగ్రెసును ఓడించి, ఇందిరను గద్దె దింపి, కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పరచిన మొట్ట మొదటి కాంగ్రెసేతర పార్టీగా చరిత్రలో స్థానం సంపాదించింది. భారతదేశంలో ప్రజాస్వామ్య పునరుద్దరణకు పోరాడిన లోక్ నాయక్ జయప్రకాశ్ నారాయణ్ అక్టోబరు 8, 1979లో మరణించాడు. మరణానంతరం 1998లో భారత ప్రభుత్వం ఇతనికి దేశంలో అత్యున్నత పురస్కారమైన భారత రత్న ను ప్రకటించింది. ఇదిగాక జె.పి. చేసిన ప్రజాసేవకు గుర్తింపుగా 1965లో మెగసెసే అవార్డు ప్రకటించబడింది.

# ఇది గవాయ్‌పై దాడి కాదు.. భారత న్యాయ వ్యవస్థ గౌరవంపై దాడి!

భారతదేశంలో న్యాయ వ్యవస్థ స్వతంత్రత, నిష్పాక్షికత రాజ్యాంగ మౌలిక సూత్రాలలో ఒకటి. భారత అత్యున్నత న్యాయస్థానంలో కొన్ని రోజుల క్రితం చోటు చేసుకున్న అమానవీయ సంఘటన దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను కలచి వేసింది. అత్యున్నత న్యాయమూర్తిపై న్యాయవాది షూ విసిరేందుకు ప్రయత్నించడం కేవలం ఒక వ్యక్తిగత దుస్సాహసం మాత్రమే కాదు. ఇది భారత న్యాయ వ్యవస్థ సంస్థాగత అధికారంపై జరిగిన అత్యంత అసాధారణ దాడి. ఈ చర్య న్యాయపరమైన ధిక్కారం స్థాయిని దాటి, రాజ్యాంగ సమగ్ర స్ఫూర్తిని ధ్వంసం చేసే ప్రేరేపిత ప్రయత్నం గా కనిపిస్తుంది. దేశంలోని ప్రతి పౌరుడు, ఈ దారుణ చర్యను సీజేఐ గవాయిపై జరిగిన దాడిగా కాకుండా, భారత న్యాయ వ్యవస్థ సంస్థాగత సమగ్రతపై జరిగిన భయంకరమైన దాడిగా న్యాయ కోవిదులు భావిస్తున్నారు. గత భారత ప్రధాన న్యాయమూర్తి డీ.వై. చంద్రచూడ్ కోర్టులో క్రమశిక్షణ, గౌరవం విషయంలో ఎటువంటి రాజీ పడలేదు. కోర్టు పద్ధతులను ధిక్కరించే వారిపై ఆయన చూపిన ఆగ్రహం చాలాసార్లు వ్యక్తమైంది. 2023లో అప్పటి సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడి బెదిరింపు ధోరణిని తిప్పికొట్టారు. ప్రధాన న్యాయమూర్తిని బెదిరించొద్దు, నా కోర్టు నుంచి వెళ్లిపోండి అంటూ సీజేఐ గట్టిగా హెచ్చరించారు. పలు సందర్భాల్లో కోర్టును బెదిరించే ప్రయత్నం చేసిన వారిని బయటకు పంపేందుకు ఆదేశించారు. పూర్వ సీజేఐ చేసిన వ్యాఖ్యలు, తీసుకున్న చర్యలు అప్పుడు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం పొందలేదు కానీ ఇప్పటి సందర్భం, వాదన, ప్రధాన న్యాయమూర్తిపైనే దాడి ఘటన వేరు.

సుప్రీంకోర్టులోని ప్రధాన న్యాయస్థానం ప్రాంగణంలో, కోర్టు కార్యకలాపాలు జరుగుతున్న సమయంలో న్యాయమూర్తిని భౌతికంగా అవమానించడానికి ప్రయత్నించడం అనేది న్యాయ వ్యవస్థ పవిత్రతకు భంగం కలిగించే దారుణ చర్య. అత్యున్నత న్యాయమూర్తిని లక్ష్యంగా చేసుకుని, మతపరమైన నినాదం చేస్తూ దాడికి ప్రయత్నించడం, ఉద్దేశ పూర్వకంగా చేసినట్లు ఉంది. ఈ చర్యపై సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ తక్షణమే





స్పందించి, దీనిని న్యాయ స్వాతంత్ర్యంపై ప్రత్యక్ష దాడిగా తీవ్రంగా ఖండించింది. అయితే ఈ దాడి కేవలం సీజేఐ వ్యక్తిగత భద్రతకు సంబంధించిన విషయం కాదు. న్యాయ వ్యవస్థపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని తీవ్రంగా దెబ్బతీయడానికి, న్యాయమూర్తులు బెదిరింపులకు లోనవుతారనే సందేశాన్ని పంపడానికి ఈ చర్య ఉద్దేశించబడింది. న్యాయమూర్తులపై గౌరవం అనేది వారి వ్యక్తిగత అహంకారం కోసం కాదు. న్యాయ వ్యవస్థ నిష్పక్షపాతంగా, నిర్భయంగా పనిచేయడానికి అది ప్రాథమిక అవసరం. ఈ దాడి సంస్థాగత గౌరవాన్ని కూలదోయడం ద్వారా న్యాయ నిర్ణయ ప్రక్రియను ప్రభావితం చేయాలనే అపసవ్య ధోరణిని సూచిస్తుంది. మత రాజకీయాల ద్వారా రాజ్యాంగ సంస్థలను భయపెట్టాలని, న్యాయ వ్యవస్థను మెజారిటీ భావజాలానికి లొంగదీసుకోవాలని ప్రయత్నించే ఒక ప్రమాదకరమైన రాజకీయ ఎజెండాలో ఈ చర్య భాగం. ఈ చర్య రాజ్యాంగ నైతికత స్థానంలో 'మెజారిటీ నైతికత'ను ప్రతిక్షేపించడానికి చేసిన ప్రయత్నంగా నిపుణులు విశ్లేషిస్తున్నారు. సుప్రీంకోర్టు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కలలుగన్న సామాజిక విప్లవ పత్రంగా పరిగణించబడుతున్న నేపథ్యంలో, ఒక న్యాయమూర్తిని లక్ష్యంగా చేసుకోవడం అనేది, న్యాయ వ్యవస్థను సమాజంలోని అణగారిన వర్గాల రక్షణ బాధ్యత నుండి నిరోధించడానికి చేసే ప్రయత్నమని న్యాయ నిపుణుల వాదన. రాజ్యాంగ 'సమానత్వ సూత్రం' అలాగే 'సామాజిక, ఆర్థిక న్యాయం' అనే భావనలను దెబ్బతీయాలని చూసే ప్రమాదకర ధోరణి ఇది. న్యాయ స్వాతంత్ర్యం అనేది ప్రజాస్వామ్యానికి ఆధారం. ప్రతి పౌరునికి న్యాయమైన విచారణకు ప్రాథమిక హామీ. ఈ స్వాతంత్ర్యం రాజ్యాంగం ద్వారా హామీ ఇవ్వబడింది. భారత న్యాయ వ్యవస్థ అజేయతకు ప్రధాన ఆధారం మూల నిర్మాణం సిద్ధాంతం. ఈ సిద్ధాంతం కార్యనిర్వాహక, శాసన జోక్యం నుండి న్యాయ వ్యవస్థను కాపాడినప్పటికీ, ఈ దాడి, అంతర్గత లేదా సామాజిక-రాజకీయ శక్తుల నుండి వచ్చే భౌతిక బెదిరింపుల నుండి సంస్థాగత రక్షణ గోడలు ఎంత బలంగా ఉండాలో మరోసారి నిరూపించింది. సుప్రీంకోర్టు రాజ్యాంగపు అంతిమ సంరక్షణ కేంద్రం. ఇది ఆర్టికల్ 142 ద్వారా సంపూర్ణ న్యాయం అందించడానికి అపారమైన అధికారాన్ని కలిగి ఉంది. న్యాయమూర్తులను బెదిరించడం, దాడి చేయడం న్యాయవాద వృత్తి అత్యున్నత ప్రమాణాలకు విరుద్ధం. దాడికి పాల్పడిన వ్యక్తి న్యాయవాది కావడంతో, న్యాయవ్యవస్థ సమగ్రతను పరిరక్షించడంలో బార్ కౌన్సిల్ బాధ్యత మరింత పెరిగింది. ఈ తీవ్రమైన రెచ్చగొట్టే చర్యకు గురైనప్పటికీ, ప్రధాన న్యాయమూర్తి గవాయ్ ప్రదర్శించిన శాంతమైన సంయమనం, ఆదర్శప్రాయమైన నిగ్రహం వ్యవస్థాగత పరిపక్వతకు నిదర్శనం. తన విధులను గౌరవంగా కొనసాగించడం ద్వారా, వ్యవస్థ బలహీనపడలేదని, సంస్థాగత ధైర్యం చెక్కు చెదరలేదని ప్రపంచానికి చాటి చెప్పారు. ఈ దాడి భారత న్యాయ వ్యవస్థ ప్రతిఘటన శక్తిని పరీక్షించింది తప్ప, దాని స్ఫూర్తిని విచ్ఛిన్నం చేయలేకపోయింది. ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ విలువల పరిరక్షణకు న్యాయవ్యవస్థ ధైర్యం గా తన బాధ్యతలను నిర్వర్తించాలని దేశం కోరుకుంటుంది.

## హాథీరాం బావాజీ మఠాన్ని రక్షించండి!

తెలుగు రాష్ట్రాల్లోని లంబాడీ బంజారాలు తిరుపతి వెంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు తరుచుగా తిరుపతికి వెళుతుంటారు. 1990కి ముందు వరకు వీరు మారుమూల తండా ప్రాంతాల నుండి, గుంపులు గుంపులుగా కాలి నడకన, కలియుగ దైవమైన వెంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వెళ్లే వాళ్లు. అయితే తిరుపతి దాకా వెళ్లలేని వాళ్లు, నిరుపేద లంబాడీ బంజారాలు సైతం, వాళ్లకు తోచినంత, ఇవ్వగలిగినంత, ముడుపులు హాథీరాం బాలాజీతో పాటుగా వెంకటేశ్వర స్వామి పేరు మీద కూడా పంపేవారు. హాథీరాం బావాజీ జీవితం, కలియుగ దైవమైన వేంకటేశ్వర స్వామితో ముడిపడి ఉన్నది. ఈ భూమిపై ప్రజలున్నంత వరకు వేంకటేశ్వర స్వామి ఉంటాడు, ఆ స్వామి ఉన్నంత కాలం లంబాడీ బంజారాల ఆరాధ్య దైవం హాథీరాం బావాజీ ఉంటాడు. అందుకే ఆయన మఠాన్ని, ఆయన గుర్తులను నిర్మూలించుట మాని, పునరుద్దరించాలని, పునర్నిర్మాణం చెయ్యాలని 20 కోట్ల భారతీయ లంబాడీ బంజారాలు కోరుతున్నారు. 1990 తర్వాత కాలంలో అదే లంబాడీ బంజారాలు కాలినడకన కాకుండా కొంతమంది కలిసి కిరాయి బస్సుల్లో ప్రయాణించి, తిరుపతి వెంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వెళుతున్నారు. ఈ సమయంలో కూడా, తండా నుండి దాదాపుగా ప్రతి లంబాడీ బంజారా కుటుంబం నుండి కలియుగ దేవుడైన హాథీరాం బాలాజీ (బావాజీ)తో పాటు వెంకటేశ్వర స్వామికి కూడా ముడుపులు పంపుతారు. ఆ విధంగా లంబాడీ బంజారా భక్తులు నాటి నుండి నేటి వరకు సమర్పించిన, ముడుపులే హాథీరాం బాలాజీ (బావాజీ)కీ తరగని ఆస్తిగా మారాయి. తిరుమలలో ఆయన మఠం, తిరుపతిలో ఆయన ఆయన మఠంతో పాటూ, హాథీరాం బావాజీ పేరుమీద ఆస్తులు, భూములు, మామిడి తోటలు ఉండేవి, ఇప్పుడు కూడా ఉన్నాయి. ఆ మధ్య కాలంలో వార్తల్లో వినిపించిన వ్యక్తి పేరు 'డాలర్.,'. ఈ బ్రాహ్మణోత్తముడు హాథీరాం బాలాజీ(బావాజీ) ఆస్తులను బకాసురుడిలా మింగేశాడని, వార్తాపత్రికలు గగ్గోలు పెట్టాయి. ప్రస్తుతం తిరుమలలో వెంకటేశ్వర స్వామి ఆలయానికి దగ్గరలో ఉన్న లంబాడీల ఆరాధ్య దైవమైన హాథీరాం బాలాజీ (హాథీరాం బావాజీ) పేరు మీద ఒక మఠమున్నది. తిరుపతిలో విశాలమైన మఠంతో పాటూ, ఆశ్రమం కూడా ఉంది. ఐతే, ఆ కలియుగ దైవమైన వేంకటేశ్వర స్వామి వారి పరమ భక్తుడైన హాథీరాం బావాజీ 'మఠాన్ని తొలగిస్తాం,' అనే వార్త సోషల్ మీడియాలో, వార్తా పత్రికల్లో చక్కర్లు కొడుతోంది. అది విని లంబాడీ బంజారాలతో పాటు, 20 కోట్ల భారతీయ బంజారాల ఆత్మాభిమానాలు దెబ్బతింటున్నాయి.





## ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి : ఎస్పీ రాహుల్ మీనా



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్ కొత్తపేట మండలం పరిధిలోని బాణసంచా తయారు కేంద్రాలు మరియు అమ్మకపు కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాణసంచా కేంద్రాల వద్ద పాటించాల్సిన భద్రతా జాగ్రత్తలను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ తనిఖీలో ఎస్పీ రాహుల్ మీనా బాణాసంచా కేంద్రాల యజమానులకు పలు ముఖ్యమైన సలహాలు, సూచనలు మరియు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా, అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను గురించి ప్రత్యేకంగా నొక్కి చెప్పారు. ఎస్పీ జారీ చేసిన ప్రధాన భద్రతా ఆదేశాలు అగ్నిమాపక రక్షణ పరికరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి. ఇసుక మరియు నీటిని తగినంతగా అందుబాటులో ఉంచాలి. కేంద్రాల వద్ద నిఘా కోసం సీసీటీవీలను ఏర్పాటు చేయాలి.?ఏదైనా అనుకోని ప్రమాదం సంభవిస్తే ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. 18 సంవత్సరాల లోపు మైనర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ పనిలోకి తీసుకోరాదు. కేంద్రాల పరిసరాలలో సిగరెట్లు, ధూమపానాన్ని పూర్తిగా నిషేధించాలి. మండే గుణం కలిగిన వస్తువుల పట్ల అత్యంత జాగ్రత్త వహించాలి. ఈ సందర్భంగా ఎస్పీ ,యజమానులకు తగిన సూచనలు అందజేస్తూ, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ఈ తనిఖీలలో రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్ , ఎస్.బి. సీఐ పుల్లారావు మరియు కొత్తపేట ఎస్.ఐ.సురేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## నిరవధిక సమ్మె దిశగా విద్యుత్ ఉద్యోగులు

**ఈనెల 13న ఛలో విజయవాడ - 15న నిరవధిక సమ్మె...**

**రామచంద్రపురం డివిజన్ విద్యుత్ ఉద్యోగులు జెఏసి కన్వీనర్ వియు రాజ్ కుమార్**




**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** దీర్ఘకాలికంగా అసంతృప్తిగా ఉన్న విద్యుత్ కార్మికులు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ శాఖ ఉద్యోగులు ఈనెల 15 నుంచి సమ్మెకు దిగుతున్నామని రామచంద్రపురం డివిజన్ విద్యుత్ విద్యుత్ ఉద్యోగులు జెఏసి కన్వీనర్ వియు రాజ్ కుమార్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మండపేటలో ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ యాజమాన్యం జేఏసి ప్రతినిధులు తో చర్చకు ఆహ్వానించిందని అయితే ఉద్యోగుల సమస్యలపై అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో అవికాస్త విఫలం అయ్యాయని పేర్కొన్నారు. ఉద్యోగ సంఘ నాయకులు చర్చలు జయప్రదం కాకపోవడంతో ఈనెల 15 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు ప్రకటించారు. దశలవారీగా ఉద్యమాలు నిర్వహించామని పేర్కొన్నారు. గత కొద్దిగా రోజులుగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా 29 ప్రధాన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత నెల 30న సమ్మె నోటీసు అందజేశామన్నారు. 1999 నుంచి 2004 మధ్య విద్యుత్ సంస్థలో నియామకమైన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలన్నారు. ఒకే పనికి సమాన వేతనం కింద కాంటాక్ట్ సిబ్బందికి శాశ్వత సిబ్బందితో సమానంగా వేతనాలు చెల్లించాలన్నారు. ఈనెల 13న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జేఏసీలోని 24 యూనియన్లు అసోసియేషన్లు ఉన్నాయని అన్నారు. సుదీర్ఘకాలంగా వివిధ సమస్యలతో సతమతమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఉద్యోగులకు నాలుగు డీఏలు పెండింగ్లో ఉన్నాయన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. జె ఎల్ ఎం గ్రేడ్ 2 ఉద్యోగులకు ఏపీ ఎస్ బి సర్వీసెస్ రూల్ వర్తింప చేయాలన్నారు. ముఖ్యంగా కారుణ్య నియామకలను పూర్తి చేయాలని కోరారు. ప్రధాన డిమాండ్లను పరిష్కరించకపోతే 13న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామని 15వ తేదీ ఉదయం 6 గంటలకు సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.

## ఏఎస్ఏ హాస్పిటల్ ఆధ్వర్యంలో సాకుర్రు గున్నేపల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం, గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలు ఆరోగ్యవంతులుగా ఉన్నప్పుడే దేశం ఆరోగ్యంగా ఉంటుందని డాక్టర్ ఎం.శివ ఆశిష్ అన్నారు. దీనిలో భాగంగానే తమ వంతు సహాయంగా నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా ఏ.ఎస్.ఏ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం సాకుర్రు గున్నేపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ పెద్దిరెడ్డి రామచంద్రరావు (రాము )ఆధ్వర్యంలో ప్రారంభించారు .. ఈ కార్యక్రమాని కి చుట్టుపక్కల గ్రామాల నుండే కాక ఇతర ప్రాంతాల నుండి కూడా అధిక సంఖ్యలో రోగులు ఈ శిబిరంలో పాల్గొని, ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో ప్రముఖ ఎస్ ఏ ఎస్ ఏ హాస్పిటల్ చాతి, ఊపిరితిత్తుల వైద్యనిపుణులుతోపాటు డాక్టర్ సిహెచ్ సురేష్ బాబు ఎముకలు, కీళ్ళ వ్యాధి నిపుణులు డాక్టర్ గుండా బత్తుల అంజలి జనరల్ షుగర్ వ్యాధి నిపుణులు, డాక్టర్ మత్తె అనూష ప్రసూతి స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ నర్రా శ్రీనివాసులు శాస్త్ర చికిత్స నిపుణులు, డాక్టర్ పసుపులేటి సౌమ్య మానసిక వైద్య నిపుణులు లో పాల్గొని రోగులను పరీక్షలు నిర్వహించారు అనంతరం రక్తపోటు (బీపీ), డయాబెటిస్ (షుగర్), థైరాయిడ్, కాళ్ళు మరియు చేతుల తిమ్మిరి, గుండె, ఊపిరితిత్తుల సమస్యలు, విష జ్వరాలు (డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా), కిడ్నీ, లివర్ సంబంధిత సమస్యలు, కీళ్ళ నొప్పులు, అలాగే స్త్రీలకు సంబంధించిన ఆరోగ్య సమస్యలకు నిపుణులైన వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు జరిగిన ఈ శిబిరంలో వ్యాధి నిర్ధారణ అనంతరం రోగులకు ఉచితంగా మందులు ఏ ఎస్ ఎ హాస్పిటల్ సిబ్బంది అందించారు. అనంతరం సర్పంచ్ రాము మాట్లాడుతూ ఏ ఎస్ ఏ హాస్పిటల్ వైద్య సిబ్బంది సేవలు ఎన్నటికీ మరువలేమని తమ ప్రాంతానికి వచ్చి వేలాది రూపాయలు విలువచేసే మందులను ఉచితంగా పంపిణీ చేసి ఎంతో విలువైన వైద్యాన్ని తమ ప్రాంత ప్రజలకు అందించిన వైద్యులను వారి సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించారు. ఈ వైద్య శిబిరంలో ఏ.ఎస్.ఏ హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ రంకిరెడ్డి గణేష్, హాస్పిటల్ పి.ఆర్.ఓ. సుబ్రహ్మణ్యం, ధనలక్ష్మి, హాస్పిటల్ డి.ఎం.ఓ. డా. జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో సుమారు 500 మంది రోగులు వైద్య సేవలను వినియోగించుకున్నారని సిబ్బంది తెలిపారు. అనంతరం ఆపరేషన్ స్కానింగ్లు తదితర మెరుగైన వైద్యసేవలు అందించేందుకు పలు సలహాలు సూచనలు వైద్య సిబ్బంది చేశారు.అనంతరం గ్రామస్తులు వైద్యుల పనితీరును వారు ఈ సందర్భంగా అభినందించారు. . సమాజంలో ఆరోగ్య స్పృహ పెంపొందించే లక్ష్యంతో ఏ.ఎస్.ఏ హాస్పిటల్ ఈ శిబిరం ఏర్పాటు ద్వారా స్థానిక ప్రజలు తమ ఆరోగ్య సమస్యలను గుర్తించి, సకాలంలో చికిత్స పొందే అవకాశం కలిగింది. సమాజంలో ఆరోగ్య స్పృహను పెంపొందించడం, నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం అని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ శిబిరంలో పాల్గొన్న గ్రామస్థులు ఏ.ఎస్.ఏ హాస్పిటల్ చేపట్టిన ఈ సామాజిక కార్యక్రమాన్ని ఎంతగానో ప్రశంసించారు. అనేక మంది ప్రజలు తమ ఆరోగ్య సమస్యలకు సంబంధించిన పరీక్షలు, చికిత్సలను ఉచితంగా పొందడం ద్వారా సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సౌకర్యాలు అందుబాటులో లేని వారికి ఈ శిబిరం ఒక వరంగా నిలిచింది. ఈ శిబిరం విజయవంతంగా పూర్తవడంతో, భవిష్యత్తులో కూడా ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను మరిన్ని గ్రామాల్లో నిర్వహిస్తామని ఏ.ఎస్.ఏ హాస్పిటల్ వైద్యులు తెలిపారు.

# బాణాసంచా తయారీ కేంద్రాలపై ఉక్కుపాదం

**పటిష్ట భద్రతకు ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ ఆదేశాలు**





**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** రాయవరంలో ఇటీవల జరిగిన బాణాసంచా తయారీ కేంద్రం ప్రమాదం నేపథ్యంలో ఏలూరు రేంజ్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(ఐజి) జి.వి.జి. అశోక్ కుమార్ ఐ.పి.ఎస్. అప్రమత్తమయ్యారు. ప్రమాదాల నివారణలో భాగంగా, కొత్తపేటలోని బాణాసంచా తయారీ యూనిట్‌ను శుక్రవారం ఆయన అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనాతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తయారీ విధానం, యంత్రాల వినియోగం ,కార్మికుల భద్రత వంటి అంశాలపై ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, భద్రతా చర్యలను పటిష్టం చేయాలని, చట్ట నిబంధనలు పాటించని యూనిట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఐజీ వెల్లడించిన ముఖ్యాంశాలు ఉమ్మడి బృందాల (జాయింట్ టీం) తనిఖీలు రాయవరం ప్రమాదం నేపథ్యంలో, ఏలూరు రేంజ్ పరిధిలోని ఆరు జిల్లాలలో, అలాగే డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలలో కూడా అన్ని ఫైర్ క్రాకర్స్ తయారీ యూనిట్లలో ఉమ్మడి బృందాల ద్వారా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఐజీ తెలిపారు.ఐదు శాఖల సమన్వయం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ బృందాలను ఏర్పాటు చేశారు.ఈ తనిఖీల్లో ఫైర్, పోలీస్, రెవెన్యూ, లేబర్, ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్ లతో పాటు అవసరమైతే ఇతర శాఖల అధికారులు కూడా పాల్గొంటున్నారు. ప్రమాణాల పరిశీలన తయారీ యూనిట్లలో ముఖ్యంగా కింది అంశాలపై దృష్టి సారించారు. ఫైర్ సేఫ్టీ (అగ్ని భద్రత) ప్రమాణాలు. ఎమర్జెన్సీ రెస్పాన్స్ మెకానిజమ్స్(అత్యవసర ప్రతిస్పందన యంత్రాంగాలు) ఏర్పాటు. పేలుడు పదార్థాల నిల్వ పరిమాణం (ఎక్స్‌ప్లోజివ్స్ క్వాంటిటీ) మరియు నిల్వ కేంద్రాల భద్రత (స్టోరేజ్ పాయింట్) పని చేస్తున్న కార్మికులకు (లేబర్) తప్పనిసరిగా ఇన్సూరెన్స్ సౌకర్యం, వారికి ఇచ్చిన భద్రతా శిక్షణ (ట్రైనింగ్). కార్మికుల భద్రత కోసం తీసుకున్న ఇతర జాగ్రత్తలు (ప్రికాషన్స్). భద్రతా యంత్రాంగంపై సూచనలు ఇచ్చారు. ఒక కార్మికుడు మాత్రమే నిర్వహించేలా పటిష్టమైన ఫైర్ సేఫ్టీ వ్యవస్థ ఉండాలని, ప్రమాదం జరిగిన వెంటనే అతను ఆన్ చేసి నీళ్లు కొట్టగలిగేలా అత్యవసర యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఐజీ సూచించారు.

**భవిష్యత్ కార్యాచరణ**

ఈ అన్ని అంశాలు చట్టప్రకారం ఉన్నాయో లేదో తనిఖీ చేసి, సరైన నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని ఐజీ అశోక్ కుమార్ తెలిపారు. ప్రాణ నష్టం లేని విధంగా వెంటనే స్పందించేందుకు మరియు ఫైర్ ప్రమాదాలు జరగకుండా నివారించడానికి తగు చర్యలు తీసుకుని, పర్యవేక్షిస్తున్నామని ఆయన వెల్లడించారు.ఈ పరిశీలన కార్యక్రమంలో కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, రావులపాలెం రూరల్ సీఐ సి.హెచ్.విద్యాసాగర్, ఎస్.ఐ జి.సురేంద్రలు పాల్గొన్నారు.వీరితో పాటు ఫైర్ సిబ్బంది, పోలీస్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో పురోభివృద్ధి దిశగా విద్యావ్యవస్థ..

**రూ.17లక్షలతో రావులపాలెం బాలికల వసతి గృహంలో మరమ్మతులు, నిర్మాణాలను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సారధ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కల్పన, పనితీరు మెరుగుపడిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. శుక్రవారం ఆయన రావులపాలెం ప్రభుత్వబాలికల పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం ఏ విధంగా ఉందో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనం గతంలో ఎలా ఉండేది? ఇప్పుడు బాగుంటుందా? గుడ్డు వారానికి ఎన్నిసార్లు ఇస్తున్నారు అని అడిగారు. గత ప్రభుత్వ హయాంలో భోజనంలో పురుగులు వచ్చిన సందర్భాలు ఉన్నాయని, ఈ ప్రభుత్వం వచ్చాక సన్న బియ్యంతో భోజనం వడ్డిస్తున్నారని, ప్రతిరోజు రుచికరమైన భోజనం అందిస్తున్నారని, వారానికి ఆరు రోజులు గుడ్డు ఇస్తున్నారని విద్యార్థినులు ఎమ్మెల్యేకు తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషితో ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపడ్డాయని, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం మెరుగ్గా సాగుతుందని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి కిట్లను గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చాలా బాగున్నాయని తెలపడంతో ఎమ్మెల్యే బండారు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన ప్రభుత్వ బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. సాంఘిక సంక్షేమ శాఖ నిధులు రూ.17.3లక్షలతో వసతి మరమ్మతుల ప్రారంభానికి కొబ్బరికాయ కొట్టారు. వసతి గృహంలో గదులు, బాత్ రూమ్స్ తదితరాలను పరిశీలించారు. పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కొప్పిశెట్టి ప్రసాద్, జక్కంపూడి బాలాజీ, కోట సోమేశ్,నందం సత్యనారాయణ,చిన్న కె వి,పసుపులేటి రాధాకృష్ణ, సరిపెల్ల శ్రీనివాసరాజు, బొంతు రాంబాబు, సాధనాల శ్రీను, సిద్ధంశెట్టి సురేష్,అనే సుబ్బారావు, సాధనాల బాబి, జక్కంపూడి నాగేశ్వరరావు మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెవిన్యూ డివిజన్‌లో ఎన్నికలు

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అమలాపురం, రామచంద్రపురం డివిజన్ యూనిట్లకు సంబంధించి దీవి 11. 10. 2025 వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ పక్షాన రెవెన్యూ డివిజన్లో ఎన్నికలు నిర్వహించుటకు గాను జిల్లా శాఖ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. ఇందులో భాగంగా అమలాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఆసక్తి ఉన్నరెవెన్యూ ఉద్యోగులందరూ దీవి. 11.10.2025వ తేదీన రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయం మీటింగ్ హాల్ నందు ఎన్నికలు నిర్వహించటకు గాను ఉత్తర్వులు డి.శ్రీనివాస్ డిప్యూటీ తాసిల్దార్ అయినవిల్లి,ఏపీ ఆర్ ఎస్ ఏ జిల్లా చైర్మన్ చే ఉత్తర్వులు మంజూరు చేయడమైనది సదరు ఉత్తర్వుల్లో ఎన్నికల అధికారిగా ఎంవి రమణ డిప్యూటీ తాసిల్దార్ జాయింట్ కలెక్టర్ ఫేసు వారిని, సహాయ ఎన్నికల అధికారిగా ఎం.బి ఆలీ ఆర్ఎస్‌డిటి అంబాజీపేట వారిని ఎన్నికల పరిశీలకులుగా డి.శ్రీనివాస్ డిప్యూటీ తాసిల్దార్ అయినవిల్లి వారూ ఉంటారని అదే రోజు ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు ప్రెసిడెంట్ కేటగిరీలో-1, అసోసియేట్ ప్రెసిడెంట్ అసోసియేట్ ప్రెసిడెంట్ కేటగిరీలో -1, వైస్ ప్రెసిడెంట్ క్యాటగిరిలో-3:(వన్ రిజర్వ్ ఫర్ ఉమెన్) సెక్రెటరీ -1, జాయింట్ సెక్రెటరీ-3 (ఒక పోస్టు రిజర్వ్ ఫర్ ఉమెన్ అండ్ వన్ పోస్ట్ రిజల్ట్ ఫర్ డ్రైవర్ లేక ఆఫీసు సపోడినేట్ )ట్రెజరర్ -1, ఈసీ మెంబర్లు-2, మొత్తంగా 12 పోస్టులకు గానునామినేషన్ తీసుకోవడం జరుగుతుంది అదేవిధంగా నామినేషన్లు స్క్రూట్ ని 11 గంటల నుండి 12 గంటల వరకు జరుగుతుంది. నామినేషన్ల ఉపసంహరణ 12 గంటల నుండి 12:30 వరకు జరుగుతుందని. పోలింగ్ అదే రోజు 12:30 నుంచి 1:30 వరకు జరుగుతుందని. ఒంటి గంట నర నుండి రెండు గంటల వరకు రిజల్ట్ వెలుపడతాయని తెలియజేసినారు. అదే విధంగా రామచంద్రపురానికి సంబంధించి పై విధంగానే రెండు గంటల నుండి 5 గంటల వరకు ఎలక్షన్ ప్రాసెసర్ పైన చెప్పిన విధంగానే 12 పోస్టులకు గాను మధ్యాహ్నం రెండు నుండి రెండున్నర వరకు నామినేషన్లు తీసు తీసుకోవడం జరుగుతుందని దరిముల రెండున్నర నుండి మూడు గంటల వరకు స్క్రూట్ ని తదుపరి మూడు గంటల నుండి మూడున్నర గంటల వరకు నామినేషన్లు ఉపసంహరణ, పరిశీలన తదుపరి మూడున్నర నుండి నాలుగున్నర వరకు ఎలక్షన్ నిర్వహిస్తారని ఎన్నికల అధికారిగా కె మురళీకృష్ణ డిటి కే.గంగవరం వారిని ఎన్నికల సహాయ అధికారిగా కే. మహాలక్ష్మి నాయుడు ఆర్ ఎస్ డి టి. ఐ .పోలవరం వారిని ఎన్నికల పరిశీలకులుగా డి.శ్రీనివాస్ డిప్యూటీ తాసిల్దార్ అయినవిల్లి వారిని నియమించడం జరిగిందని ఆసక్తి ఉన్న రెవెన్యూ ఉద్యోగులందరూ రెండు డివిజన్లోనూ ఎన్నికలలో పాల్గొని, ఎన్నికలను సజావుగా నిష్పక్షపాతంగా, విజయవంతం చేయాలని అందరూ వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరియన్నారు.

## పోస్టల్ శాఖ అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలి : ఎస్పీ నవీన్ కుమార్

**ఘనంగా ముగిసిన జాతీయ తపాలా వారోత్సవాలు..**




**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** "ఫర్ పీపుల్ లోకల్ సర్వీస్ గ్లోబల్ రీచ్" అనే నినాదంతో అక్టోబర్ 6 నుంచి 10వ తేదీ వరకు అమలాపురం పోస్టల్ డివిజన్ వ్యాప్తంగా జాతీయ తపాలా వారోత్సవాలు ఘనంగా నిర్వహించినట్లు అమలాపురం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్.నవీన్ కుమార్ తెలిపారు. ఈ వారోత్సవాలలో అయిదు రోజుల పాటు వివిధ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు. ఇందులో భాగంగా వారోత్సవాల్లో మొదటి రోజైన అక్టోబర్ 6వ తేదీన టెక్నాలజీ దినోత్సవం క్రింద పోస్టల్ శాఖ ఉద్యోగులకు క్విజ్ కాంపిటీషన్ నిర్వహించడం జరిగిందని, ఏడో తేదీన ఫైనాన్షియల్ ఇంక్లూజన్ డే సందర్భంగా డిసిడిపి కార్యక్రమాలను డివిజన్ పరిదిలో అమలాపురం, రాజోలు, కొత్తపేట, రావులపాలెం లో నిర్వహించి సుమారు 2000 కొత్త తపాలా ఖాతాలను తెరిచినట్లు ఎస్పీ నవీన్ కుమార్ చెప్పారు. అక్టోబర్ 8న ఫిలాటెలీ, సిటిజెన్ సెంట్రిక్ సర్వీస్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు లెటర్ రైటింగ్ కాంపిటీషన్ లెటర్ టు మై రోల్ మోడ్ అనే థీమ్ తో నిర్వహించడం జరిగిందన్నారు. డివిజన్ లో అందరికీ ఉపయోగపడేలా ఆధార్ మొబైల్ క్యాంపులను రోజుకు 3 చోట్ల గా 10 కి పైగా నిర్వహించి 300 పైగా ఉచిత ఆధార్ అప్ డేట్స్ చేయడం జరిగినట్లు నవీన్ కుమార్ తెలిపారు. ప్రపంచ తపాలా దినోత్సవం సందర్భంగా అక్టోబర్ తొమ్మిదో తేదీన అమలాపురం డివిజన్ పరిదిలో పోస్టల్ పథకాలపై ర్యాలి లు నిర్వహించామని, చివరి రోజైన 10 వ తేదీన కస్టమర్ దినోత్సవం సందర్భంగా తపాలా సేవింగ్స్ బ్యాంకు, ఇండియాపోస్ట్ పేమెంట్స్ బ్యాంకు అందించే సేవల గురించి ఖాతాదారులకు అవగాహన సదస్సులు డివిజన్ పరిదిలో నిర్వహించినట్లు పోస్టల్ ఎస్పీ నవీన్ కుమార్ వెల్లడించారు. పోస్టల్ శాఖ అందించే అన్ని రకాల సేవలను వినియోగదారులు తప్పక తెలుసుకొని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. పోస్టల్ వారోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సహకరించిన ఉద్యోగులు, వినియోగదారులకు ఎస్పీ నవీన్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్ నవీన్ కుమార్, అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ కె. శ్రీధరం, తపాలా ఉద్యోగులు పాల్గొన్నారు.

### కేంద్ర ప్రభుత్వ పథకాలపై

# విస్తృత అవగాహన కల్పించాలి

## కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై విస్తృత అవగాహన కల్పించి మరింత మందికి లబ్ధి చేకూరే విధంగా అధికారులు కృషి చేయాలని కాకినాడ పార్లమెంటు సభ్యులు, దిశ (జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ) చైర్ పర్సన్ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ కోరారు. కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో దిశ సమావేశం చైర్పర్సన్ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల అమలు తీరు, సమన్వయం, పర్యవేక్షణకు దిశ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సభకు వివరించారు. అనంతరం నిర్దేశించిన ఎజెండాలోని ప్రధానాంశాలైన బ్యాంకింగ్ కి సంబంధించి పీఎంఈజీపీ, పీఎంఎంవై, ముద్రా వంటి పథకాలు, వైద్యారోగ్యం శాఖ కింద జాతీయ ఆరోగ్య పథకం, జనని సురక్ష యోజన, ప్రధానమంత్రి మాతృ వందన, సార్వత్రిక ఆరోగ్య పరీక్షలు, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం, రక్తహీనత నిర్మూలన, జాతీయ పట్టణ ఆరోగ్య పథకం, శిశు సంరక్షణ కేంద్రాలు, జిల్లా గ్రామీణ అభివృద్ధి ద్వారా దీన దయాల్ ఉపాధ్యాయ - గ్రామీణ కౌశల్ యోజన, పింఛన్లు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కింద అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందిస్తున్న సేవలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన, సమగ్ర బాలల పరిరక్షణ పథకం, మిషన్ శక్తి, బేటీ బచావో బేటి పడావో, పశుసంవర్ధక శాఖ ద్వారా నేషనల్ లైవ్ స్టాక్ మిషన్, పశు కిసాన్ క్రెడిట్ కార్డులు, రాష్ట్రీయ గోకుల్ మిషన్, పాఠశాల విద్యాశాఖ కింద అటల్ టింకరింగ్ ల్యాబ్స్, వ్యవసాయం, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ కింద అమలవుతున్న ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, పీఎం కిసాన్ కార్డులు, భూసార పరీక్ష కేంద్రాలు, పరిశ్రమలు శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పీఎం విశ్వకర్మ యోజన, స్కిల్ డెవలప్మెంట్ కింద జిల్లాలో చేపట్టిన వివిధ శిక్షణలపై, కాకినాడ స్మార్ట్ సిటీ పనులు, పీఎం సూర్య ఘర్ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలు కనుగుణంగా ప్రస్తుత ప్రగతిని ఈ సందర్భంగా సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న వివిధ పరిశ్రమల నుండి అందులో పని చేయడానికి ఏ ఏ స్కిల్స్ ఉన్నవారు ఎంతమంది అవసరమో వివరాల సేకరించి 15 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని స్కిల్ డెవలప్మెంట్ అధికారిని ఎంపీ ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఏ స్కీములు మన జిల్లాకు ఉపయోగ పడతాయో వాటి ప్రతిపాదనలను 15 రోజుల్లోగా అందించాలని అధికారులకు సూచించారు. ఈ దిశ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వివరాలు, క్షేత్రస్థాయిలో సమస్యలు, ప్రస్తుతం జరుగుతున్న కార్యకలాపాలు భవిష్యత్తులో చేపట్టబోయే అంశాలపైన ఫలవంతమైన చర్చ జరిగిందన్నారు. సభ్యులు అడిగిన అంశాలపై అధికారులు సక్రమమైన రీతిలో వివరణలు ఇచ్చారని ఆయన వివరించారు. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం వివిధ శాఖలలో అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల వివరాలు, లబ్ధిపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఆయన కోరారు. అదేవిధంగా అధికారులు సమన్వయంతో వ్యవహరించి కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న పథకాల వివరాలను ప్రజాప్రతినిధులకు కూడా తెలపాలి అన్నారు. మన జిల్లాలో వివిధ పరిశ్రమల్లో ఏ విధమైనటువంటి స్కిల్ ఉన్న ఉద్యోగులు అవసరమో తెలుసుకొని ఆ స్కేల్ ట్రైనింగ్ ను ప్రోత్సహించాలని , అందుకు అవసరమైన ఎక్విప్మెంట్ , నిధులు తదితర వాటిని మంజూరు చేయించడం జరుగుతుందని ఎంపీ తెలిపారు. కాకినాడ పార్లమెంటు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో మొదటి స్థానంలో ఉంచేందుకు తన వంతు కృషి చేస్తామని ఎంపీ తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రధాన అంశాలపై రానున్న పార్లమెంటు సమావేశంలో ఆయా శాఖల కేంద్ర మంత్రులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు జిల్లాలో సక్రమంగా అమలు చేయడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలి అన్నారు. జిల్లాలోని సమస్యలపై కాకినాడ పార్లమెంటు సభ్యులు ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పథకాలు అమలులో ఏమైనా లోటుపాట్లు ఉంటే తెలుసుకొని వాటిని సరిదిద్దుకొని సక్రమంగా వినియోగించు కోవాలని ఆమె సూచించారు. ఎమ్మెల్సీ వీరభద్ర రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర పథకాలే కాకుండా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు కూడా వినియోగించుకోవాలని, ఎక్కువ యువతకు స్కిల్స్ డెవలప్మెంట్ లో శిక్షణ ఇచ్చి వారిని ప్రోత్సహించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా దిశ కమిటీ సమావేశం ద్వారా కాకినాడ జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని దిశ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సూచించారు. కమిటీ చైర్ పర్సన్, సభ్యులు సూచించిన అంశాలపై అధికారులు మరింత దృష్టి పెట్టి, మెరుగు పరిచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి ఒక ప్రత్యేకమైన ప్రణాళికను రూపొందించి ప్రతిపాదనలు ప్రభుత్వం కు పంపించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్షణ్మోహన్ సగిలి ఎంపీకి వివరించారు. ఈ సమావేశంలో వివిధ మండలాల ఎంపీపీలు, దిశ కమిటీ సభ్యులు, గ్రామ సర్పంచులు, దిశా కమిటీ సభ్యులు, వివిధ మండలాలు ఎంపీపీలు, గ్రామ సర్పంచులు తన మండలాల్లోని, గ్రామాల్లోని సమస్యలను సభ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో ట్రైని కలెక్టర్ మనీషా, జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి వీవీవీఎస్.లక్ష్మణరావు, ఏవో ఎం.బుజ్జిబాబు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# బాలికల అభివృద్ధి, భద్రతే ప్రభుత్వ ముఖ్య ధ్యేయం : కలెక్టర్





**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలోని ప్రతీ ఆడపిల్ల సమగ్ర అభివృద్ధి, భద్రతకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని కాకినాడ జిల్లా కలెక్టర్ షన్ మోహన్ సగిలి పేర్కొన్నారు. ప్రభుత్వంలోని వివిధ శాఖల ద్వారా బాలికలకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని, ప్రతీ ఒక్కరూ వాటిని వినియోగించుకుని ఎంతగానో అభివృద్ధి చెందాలని కలెక్టర్ పిలుపును ఇచ్చారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ, విద్యాశాఖ, ఆరోగ్యశాఖ సంయుక్త ఆద్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం 2025 ను జిల్లా కేంద్రం కాకినాడలో శుక్రవారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ సభికులను ఉద్దేశించి ప్రసంగించారు. బాలికలకు ప్రభుత్వంలోని వివిధ శాఖల అధికారులు పలు కార్యక్రమాలను నిర్వహిస్తోందని, ప్రతీ ఒక్కరూ వాటిని వినియోగించుకుని ఎంతగానో అభివృద్ధి చెందాలని కలెక్టర్ పిలుపును ఇచ్చారు. బాల బాలికలతో మమేకమై వారి హక్కుల రక్షణ, భద్రతపై తీసుకో వలసిన అన్ని జాగ్రత్తలూ కలెక్టర్ తెలిపారు. అనంతరం జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ పథకం సంచాలకురాలు లక్ష్మి మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో ప్రతీ సచివాలయం పరిధిలో ఉన్న కిశోరి బాల బాలికలకు కిశోరి వికాసం పథకంలో అవగాహన కల్పించిన వివిధ అంశాలైన జెండర్ ఈక్వాలిటీ, పిల్లలపై లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, ఆర్థిక అంశాలపై అవగాహన, నాయకత్వ లక్షణాలు, శారీరక వ్యాయామం వంటి అంశాలపై వ్యాసరచన, వకృత్వ పోటీలను నిర్వహిస్తా మన్నారు. వారిలో ఒక్కో సచివాలయం నుండి ఇద్దరు బాల, బాలికలను ఎంపిక చేసి మండల స్థాయిలో 11 నుంచి 18 వ తేదీ వరకు మండల స్థాయిల్లో కూడా ఈ పోటీలను నిర్వహిస్తామనిని మరియు కిశోరి బాల బాలికలకు వారికి ఉన్న అనుమానాలు, సందేశాలను నివృత్తి చేయడానికి సందేహాలు నివృత్తి బాక్స్ లు ఏర్పాటు చేసి వారి యొక్క అనుమానాలను నివృత్తి చేస్తామని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ పథకం సంచాలకురాలు లక్ష్మి పేర్కొన్నారు. బాలికా సంరక్షణ అంశాలపై జిల్లా వ్యాప్తంగా వ్యాస రచన, వకృత్వ పోటీలను నిర్వహించి 12 మంది బాల బాలికలను ఎంపిక చేసారు. ఈ విజేతలకు నగదు బహుమతులు, వ్యక్తిత్వ వికాస పుస్తకాలు, జ్ఞాపికలు, బహుమతులను కలెక్టర్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మి, మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నరసింహ నాయక్, జిల్లా ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పిల్లి రమేష్, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరిండెంట్ లావణ్య, గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ ఉమ, కాకినాడ అర్బన్ ఐసిడిఎస్ సిడిపీఓ జ్యోతి, జిల్లా బాలల హక్కుల పరిరక్షణ విభాగం సిబ్బంది, వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆరు గ్రామాలకు ఎన్నికలు జరిపించాలని ప్రజా దర్బార్లో కోరిన రాయుడు అనిల్

**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ :** కాకినాడ రూరల్ మండలంలో గత 15 ఏళ్ల బట్టి ఆరు గ్రామాల్లో ఎన్నికలు జరగక అభివృద్ధితోపాటు ప్రజల రాజకీయ భవిష్యత్తు కూడా కుంటుపడిందని మాజీ ఎంపీటీసీ తెలుగుదేశం నాయకులు రాయుడు అనిల్ శుక్రవారం రాజ్యసభ సభ్యులు సాన సతీష్ నేతృత్వంలో జరిగే ప్రజాదర్బార్లో ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15 సంవత్సరాల క్రితం అభివృద్ధి చెందిన గ్రామాలంటూ వ్యవసాయకంగా ఎటువంటి పొలాలు లేవని ఆరు గ్రామాలైన రమణయ్యపేట వలస పాకల వాకలపూడి ఇంద్ర పాలెం చీడిగా తూరంగి స్వామి నగర్ గ్రామాలను కాకినాడ మున్సిపాలిటీ పరిధిలో కలిపి ఎన్నికలు నిర్వహించాలని చెప్పడం జరిగిందన్నారు. అప్పటినుంచి ఇప్పటివరకు అటు మున్సిపాలిటీలోనూ కలపకుండా ఇటు గ్రామీణంలోనూ ఉంచకుండా ప్రత్యేక గ్రామాలుగా నిర్ణయిస్తూ అధికారులే పాలిస్తున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 15 ఏళ్ల బట్టి ఆరు గ్రామాలలో ఉన్న యువత రాజకీయ భవిష్యత్తును కోల్పోయింది అన్నారు. ఇప్పటికైనా పారదర్శకంగా పాలన కొనసాగిస్తామన్న ఎన్డీఏ ప్రభుత్వం ఆరు గ్రామాలకు ఎన్నికలు నిర్వహించి ప్రజాపాలన కొనసాగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# 'కత్తిపూడి ఆర్టీసీ మరుగుదొడ్లు 24 గంటలూ తెరవాలి'



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజవర్గం శంఖవరం మండలం కత్తిపూడి ఆర్టీసీ బస్టాండ్ కాంప్లెక్స్‌లో వేచి ఉండే ప్రయాణికులకు సరైన సౌకర్యాలు కల్పించడం లేదని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ ఉదయ్ శ్రీనివాస్‌కు కొందరు ప్రయాణికులు ఫిర్యాదు చేశారు. మండలంలోని కొంతంగి కొత్తూరు జనసేన పార్టీ నాయకుడు, విజయవాడ రైల్వే డివిజనల్ అడ్వయిజరీ కమిటీ మెంబర్ గొర్లి నాగేశ్వరరావు నేతృత్వంలో కాకినాడలోని ఎంపీ స్వగృహానికి శుక్రవారం కొందరు ఆర్టీసీ ప్రయాణీకులు చేరుకుని ఫిర్యాదు చేశారు. మరుగుదొడ్ల సౌకర్యాలు ఏమాత్రం బాగోలేదని, అందులోనూ వీటిని ఉదయం 6 గంటలకు తెరచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే తెరిచి ఉంచి ఆ తర్వాత మూసి వేస్తున్నారు. దీని వల్ల పురుష ప్రయాణీకులే గాక మహిళా ప్రయాణీకులకు చాలా ఇబ్బందికరంగా ఉంటోంది. అందువలన ఈ మరుగు దొడ్లను 24 గంటలు తెరచి ఉంచాలని ఎన్ని సార్లు చెప్పినా ఆర్టీసీ అధికారులు పట్టించుకోలేదని చివరకు ఎంపీగా తమకు ఫిర్యాదు చేస్తున్నామని తమ గోడును వెళ్ళబోసు కున్నారు. మా ప్రజలు అందరి తరపున ఆర్టిసి సిబ్బందితో తమరు మాట్లాడి మా ప్రయాణికులకు న్యాయం చేయాలని ఎంపీకి విజ్ఞప్తి చేశారు. ఆర్టిసి. ఆర్.ఎం.తో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ వారికి హామీ ఇచ్చారు.

# సారా సమూల నిర్మూలనకు సమన్వయంతో కృషి

## జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** సారాను సమూలంగా నిర్మూలించడానికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి ఆదేశించారు. కాకినాడ కలెక్టర్ కార్యాలయంలోని వివేకానంద హాలులో జిల్లా ఎస్పీ బిందు మాధవ్, కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగేళ్ల ఉదయ శ్రీనివాస్, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరా బత్తుల రాజశేఖరం, ట్రైనీ కలెక్టర్ మనీషా, ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రేణుక తో కలిసి జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి నవోదయం (సారా నిర్మూలన) పై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షన్మోహన్ సగిలి మాట్లాడుతూ రాష్ట్రాన్ని సారా రహితంగా మార్చాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది అన్నారు. సారా తయారీ, విక్రయాలతో జీవనం సాగించేవారు ఇకపై ఆ పనులు మానుకోవాలని సూచించారు. నవోదయం 2.0 కార్యక్రమం ద్వారా అర్హులైన వారికి ప్రత్యామ్నాయంగా ఉపాధి పొందేలా చర్యలు చేపడతా మన్నారు. సారా తయారీ, రవాణా, విక్రయాలు కొనసాగించే వారిపై ఇకపై కఠిన చర్యలు తీసుకుంటామనితెలిపారు. ఎక్కడైనా సారా తయారు చేసినా, రవాణా చేసినా, నిల్వ చేసినా, అమ్మినా 14405 టోల్ ఫ్రీ నెంబరుకు కాల్ చేయవచ్చని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతా మన్నారు. సారా తయారు చేసినా, విక్రయించినా చట్టరీత్యా నేరమన్నారు. సారాయి తయారీకి ఉపయోగించే ముడి పదార్థాలు విక్రయించే వారిపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్ శాఖల అధికారుల సమన్వయంతో జిల్లాలో గుర్తించిన 136 గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అధికారులు గ్రామాలకు వెళ్ళేటప్పుడు వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆయన సూచించారు. ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రేణుక మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో ఏడు ఎక్సైజ్ స్టేషన్లో పరిధిలోని 136 సారా తయారీ కేటగిరి గ్రామాలను గుర్తించామని, ఆ గ్రామాల్లో సారా తయారీ చేసే కుటుంబాలను గుర్తించి వారికి పూర్తి అవగాహన కల్పించడంతోపాటు వారికి స్వయం ఉపాధి మార్గాలను కల్పించామని ఆమె తెలిపారు. సారా తయారు చేసేందుకు ఉపయోగించే నల్ల బెల్లం అమ్మే వ్యాపారులను వాటిని అమ్మకుండా చర్యలు తీసుకున్నామని, ఎవరైనా నల్ల బెల్లం అమ్మినట్లయితే ఆ వ్యాపారస్తుల లైసెన్సు క్యాన్సిల్ చేస్తామని వారికి తెలిపామని ఆమె తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో జేడ్పీ సీఈవో లక్ష్మణరావు, జిలా ఎక్సైజ్ సూపరిండెంట్ ఎం.కృష్ణకుమారి, పోలీస్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో

# గర్భిణీ స్త్రీలకు పళ్ళు, డ్రై ఫ్రూట్స్, ప్యాకెట్లు, బ్రెడ్, పంపిణీ

## కీ.శే పాస్టర్ మోహన్‌రావు మనవరాలు ఫ్లోరా



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ కరప మండలం కరప గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 9వ తారీఖున ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ నెలలో గర్భిణీ స్త్రీలకు తనవంతుగా కీర్తిశేషులు పాస్టర్ మోహనరావు మనవరాలు ఫ్లోరా10వ పుట్టినరోజు సందర్భంగా ఫ్రూట్స్, బ్రెడ్, డ్రై ఫ్రూట్స్, బిస్కెట్స్, చాక్లెట్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంచడం జరిగింది. ఈ సంవత్సరం ఫ్లోరా పుట్టిన రోజు వేడుకలు గర్భిణీ స్త్రీల సమక్షంలో జరుపుకోవడం తమకు ఎంతో ఆనందంగా ఉందని ఫ్లోరా కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి నెల గర్భిణీ స్త్రీలకు అండగా ఒక అన్నగా నిలబడి ముందుంటున్న కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ ఏలీనా ఎస్. పనిగ్రీహి, ఏసురత్నం, సత్యనారాయణ, సీత, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, మరియు కరప మండల కూటమి పార్టీ ప్రెసిడెంట్ దేవు వెంకటేశ్వర్లు, కరప సొసైటీ మాజీ ప్రెసిడెంట్ నక్కా వీరభద్రరావు, మంగా పరమేశు, మంచాల శ్రీనివాస్, పేపకాయల తణుకుల రాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సహకారం అందించిన కీర్తిసులు పాస్టర్ మోహన్ రావు కుటుంబ సభ్యులకు గర్భిణీ స్త్రీలు పోలిశెట్టి తాతీలు ధన్యవాదాలు తెలియజేశారు.



### బాణాసంచా తయారీ విక్రయాల వద్ద
# జాగ్రత్తలు పాటించండి
### అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు



**కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు జిల్లాలోని బాణాసంచా తయారీ విక్రయ కేంద్రాల వద్ద ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలలో భాగంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని రాజమహేంద్రవరం శాంతి భద్రతల అడిషనల్ ఎస్పీ ఏవి సుబ్బరాజు తెలిపారు. శుక్రవారం కోరుకొండలోని ముత్యం శ్రీనివాస్ బాణాసంచా తయారీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి సందర్భంగా జిల్లాలో అసంఘటనలు జరగకుండా బాణాసంచి తయారీ కేంద్రాలపై దృష్టి సారించి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు తనిఖీలు ముమ్మరం చేస్తున్నామన్నారు. ఈరోజు జిల్లాలో కడియం, బుర్రిలంక, రాజమహేంద్రవరం త్రీ టౌన్, రాజానగరం, కోరుకొండ తదితర ప్రాంతాల్లో బాణాసంచా తయారీ కేంద్రాలు, విక్రయాల వద్ద తనిఖీలు నిర్వహించమన్నారు. బాణాసంచా తయారీదారులు, విక్రయదారులు ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాలకు దూరంగా విక్రయాలు జరపాలని, దీపావళి సందర్భంగా ఎటువంటి అసంఘటన చర్యలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలు కూడా బాణసంచా కొనుగోలు చేసేటప్పుడు రద్దీగా కాకుండా, ముందుగానే కొనుగోలు చేసుకోవాలన్నారు. బాణాసంచా కాల్చేటప్పుడు పిల్లలు, వృద్దుల పట్ల తగు జాగ్రత్తలు పాటిస్తూ దీపావళి సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్య కిషోర్, ఎస్సై నాగార్జున, ట్రైన్ ఎస్సై అలెగ్జాండర్ తదితరులు పాల్గొన్నారు.

### సీతానగరం మండలంలో ఒక వ్యక్తి మృతికి కారణమైన
# ఇద్దరు వ్యక్తులు అరెస్ట్



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం, మునికూడలి గ్రామానికి చెందిన మురాల అనిల్ దేవా అనే అబ్బాయి ఉరి వేసుకొని చనిపోగా, సదరు అనిల్ యొక్క అమ్మమ్మ అయిన సుభద్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు పై, సీతానగరం ఎస్ ఐ రామ్ కుమార్ ది. 29/09/2025 వ తేదీన కేసు నమోదు చేసి, సదరు మృతుడు అయిన మురాల అనిల్ దేవా యొక్క మృతదేహానికి ది. 03/10/2025 వ తేది న వారి కుటుంబ సభ్యుల సమక్షంలో శవ పరీక్ష చేయించి, సదరు కేసు నందు విచారణ చేసిన అనంతరం 108 %తీ/ష3(5)దీచీూ% గా మార్పు చేసి, సదరు కేసు నందు ముద్దాయి లయిన బొబ్బిలిలంక కు చెందిన కప్పల సతీష్, మరియు రాజమండ్రి కి చెందిన కాలుకురాస వరుణ్ చిన్న అను వారిని అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపిస్తు, ఈ కేసు విచారణ కొనసాగుతున్నదని, ఇంకా ఎవరైనా వ్యక్తులు ఈ కేసులో ఉన్నట్లు నిర్ధారణ అయితే వారిని కూడా అరెస్ట్ చేస్తామని, సీతానగరం ఎస్. ఐ రామ్ కుమార్ తెలియజేసారు.

### 2026-27 ఆర్థిక సంవత్సరానికి
# ఉపాధి గ్రామ సభల నిర్వహణకు షెడ్యూల్ విడుదల



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2026-27 సంవత్సరానికి సంబంధించిన కార్మిక బడ్జెట్ మరియు పనులు అంచనాలను ఖరారు చేయడానికి గ్రామ సభల నిర్వహణకు తేదీలు ఖరారయ్యాయి. ఎం.పి.డి.ఓ. కార్యాలయం సీతానగరం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. మండలంలో మొత్తం 21 గ్రామ పంచాయతీలలో ఈ గ్రామ సభలను నిర్వహించడానికి షెడ్యూల్ ఖరారైంది. ఈ ప్రక్రియ రెండు దశల్లో జరగనుంది. మొదటి దశ అక్టోబరు 2 నుండి ప్రారంభమై, అన్ని గ్రామ పంచాయతీలలో అక్టోబరు 3 లోపు మొదటి దశ గ్రామ సభలు పూర్తవుతాయి. రెండవ దశ ఇది అక్టోబరు 10 నుండి మొదలై, నవంబరు 15 వరకు కొనసాగుతుంది. అన్ని గ్రామ సభలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ప్రారంభమవు తాయి. 10వ తారీకు బొబ్బిల్లంక గ్రామ పంచాయతీ వద్ద ఉదయం 11 గంటల నుండి గ్రామ సభలు ప్రారంభమయ్యాయి. జాలిముడి గ్రామ పంచాయతీలో మాత్రం రెండవ దశ గ్రామ సభ అక్టోబరు 16న సాయంత్రం 3 గంటలకు జరగనుంది. ప్రధానంగా 2026-27 ఆర్థిక సంవత్సరానికి అవసరమైన కార్మిక బడ్జెట్‌ను సుమారు 35 లక్షల పనిదినాలుగా అంచనా వేయడానికి ఈ గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. దీని ద్వారా గ్రామ స్థాయిలో ప్రజల ఆమోదంతో పనుల ప్రతిపాదనలు తయారుచేయడం, వాటిని ప్లానింగ్ సాఫ్ట్‌వేర్‌లో పొందుపరచడం, గతంలో చేపట్టిన పనుల గురించి చర్చించడం, గ్రామస్తుల భాగస్వామ్యంతో పనులకు సంబంధించిన అంచనాలు తయారుచేయడం ఈ సభల లక్ష్యం. ఈ గ్రామ సభల నిర్వహణ కోసం రెండు బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతి బృందంలో అదనపు కార్యక్రమ అధికారి, ఇంజనీరింగ్ కన్సల్టెంట్, ఇద్దరు సాంకేతిక సహాయకులు, సచివాలయ సిబ్బంది, వెలుగు సిబ్బంది, గ్రామ సచివాలయం సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉంటారు. ఈ బృందాలు నిర్దేశించిన తేదీల్లో గ్రామ పంచాయతీ కార్యాలయానికి హాజరై గ్రామ సభలను పర్యవేక్షిస్తాయి. ఈ ముఖ్యమైన గ్రామ సభల్లో గ్రామ పెద్దలు, ప్రజలు, ఉపాధి హామీ కార్మికులు పాల్గొని, పనుల ప్రతిపాదనలు, బడ్జెట్ అంచనాలలో తమ అభిప్రాయాలు తెలియజేయాలని ఎం.పి.డి.ఓ. ఒక ప్రకటనలో కోరారు.

# వైద్య ఖర్చులు భారమైన పేదవారికి భరోసాగా సీఎం సహాయనిధి
### రూరల్లో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గోరంట్ల..



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** వైద్య ఖర్చులు భారమైన పేదవారికి కొండంత భరోసాగా సీ.ఎం సహాయ నిది అందుతుందని, రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్యచౌదరి పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం ధవలేశ్వరం గ్రామంలో అదే గ్రామానికి చెందిన సొంది ఇందిరాకు 33147/-, నీలాపు మంజులాకు 51,310/-, మానేపల్లి రాఘవేంద్రకు 25,773/-, కామిడీ లక్ష్మికి 35,000/-, బొమ్మూరు గ్రామానికి చెందిన వాసంశెట్టి మారయ్యకు 36,300/-, చింతలపూడి వెంకటలక్ష్మికు 25,166/-, ఓలి శ్రీనివాస్ కు 36,084/-, హుకుంపేట గ్రామానికి చెందిన వెంచలపు గంగకు 61,700/-, కాతేరు గ్రామానికి చెందిన దొండపాటి రాజ్యలక్ష్మికి 36,192/-, దుక్కిపాటి వరప్రసాద్ కు 26,500/-, సంపత్ స్వామినాథకు 48,184/-, నడిపల్లి ధనలక్ష్మి అంజలికి 28,400/-, చింతా లక్ష్మికి 25,000/-, పెదపూడి తాతారావుకు 1,16,274/-, కొంతమూరు గ్రామానికి చెందిన సుంకర చందు బాబుకు 1,70,089/-, కొవ్వాడ సత్యనారాయణ కు 60,524/-, నెక్కంటి రంగారావుకు 1,40,171/-, పిడుంగోయ్యి గ్రామానికి చెందిన గోదాడ రాంబాబు కు 37,205/-, ప్రగడ నవీన్ కు 51,084/-, సాటిలైట్ సిటీ గ్రామానికి చెందిన ఎం.ఝాన్సీ భవానికి 44, 729/-, తొర్రేడు గ్రామానికి చెందిన గోశాల శ్రీనివాస్ కు 38,727/- ,దండమూడి వీరావతికి 45,437/- మల్లిన గంగాభవానికి 1,30,000/- మొత్తం రూరల్ మండలంలో 23 మంది లబ్ధిదారులకు 13,02,996/- లక్షల రూపాయల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూ, రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తూ, విద్య,వైద్యానికి పెద్దపీట వేస్తూ, ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా ముందుకు వెళుతుందని గోరంట్ల అన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీలో వర్తించని అనేక రకాల చికిత్సలకు లక్షల రూపాయలు ఖర్చు చేసి ఆర్థిక ఒడిదుడుకులతో ఇబ్బంది పడుతున్న, పేద, మధ్యతరగతి కుటుంబాల కు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో భరోసా కల్పిస్తుందని, రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాదిమందికి కోట్లాది రూపాయలు వెచ్చించి, మన సీఎం చంద్రబాబు నాయుడు ఉదారంగా సీఎం సహాయనిధి ద్వారా అనేక కుటుంబాలను ఆదుకుంటున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలో రూరల్ నియోజకవర్గంలో 212 మంది లబ్ధిదారులకు 2.5 కోట్ల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హెల్త్ వింగ్ ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవి రామ్ కిరణ్, మండల తెదేపా అధ్యక్షులు మచ్చేటి ప్రసాద్, రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పందురి అప్పారావు, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, తలారి మూర్తి, పుక్కళ్ళ రాజు, సావాడ శ్రీనివాసరెడ్డి, ఆళ్ల ఆనందరావు, వర్రె రాజేష్, గుర్రాల వెంకట్రావు, ఒంటెద్దు స్వామి, ఎస్.శివాజీ, ఉండవెల్లి బంగార్రాజు, షేక్ కాసిం, బొప్పన నాగేశ్వరరావు, భీమరశెట్టి రమేష్, మార్ని దొరబ్బాయి, ఎంపీడీవో సునీల్ ఆర్మ్ స్ట్రాంగ్, పంచాయతీ కార్యదర్శి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించాలి
### ఇంజనీరింగ్ విద్యార్థికి లాప్ టాప్ బహుకరణ : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దాతలు ముందుకొచ్చి ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) సూచించారు. శశి ఇంజనీరింగ్ కాలేజీలో థర్డ్ ఇయర్ చదువుతున్న వి శివప్రియకు ఆదిరెడ్డి కుటుంబం, అలాగే తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుల సహకారంతో లాప్ టాప్ ను ఎమ్మెల్యే వాసు తన కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావుతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివప్రియకు లాప్ టాప్ అవసరమని చెప్పడంతో టిడిపి కుటుంబ సభ్యులు స్పందించి అందజేశారని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు తాము చేస్తున్నప్పటికీ, వనరుల సర్దుబాటు కారణంగా అందరికీ సేవలు అందించలేకపోతున్నామని అన్నారు. అయితే టిడిపి కుటుంబ సభ్యులు కూడా ముందుకొచ్చి ఇలాంటి వారికి సాయం అందించడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకొచ్చిన పి4 ఉద్దేశ్యం కూడా ఇదేనని ఎమ్మెల్యే వాసు అన్నారు. ముఖ్యమంత్రి పిలుపుని అందుకుని ప్రతిభగల విద్యార్థులను ఆదుకోడానికి దాతలు ముందుకు వస్తున్నారని ఆయన అన్నారు. అయితే ఈవిధంగా సాయం పొందినవాళ్లు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు వెళ్లిన తర్వాత పదిమందిని ఆదుకునే విధంగా తయ్యారవ్వాలని ఎమ్మెల్యే వాసు సూచించారు. ఆవిధంగా ఉన్నత స్థానానికి వెళ్తే అందరికీ ఆనందమేనని అన్నారు. తెలుగుదేశం పార్టీ సామాజిక బాధ్యత గల పార్టీ అని ఎమ్మెల్యే వాసు స్పష్టంచేసారు. చేసే ప్రతి కార్యక్రమంలో కూడా ఒక అర్థం ఉంటుందని అన్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు స్ఫూర్తితో పి4 పిలుపును అందుకుని రాజమండ్రిలో ఒక విద్యార్థినికి లాప్ టాప్ టీడీపీ కుటుంబ సభ్యులు అందించారని ఆయన పేర్కొంటూ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో పార్టీ తరపున కూటమి తరపున చేయనున్నట్లు ఆయన చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ తమ భవానీ చారిటబుల్ ట్రస్ట్ తరఫున ప్రతిఏటా పేద విద్యార్థులకు ఫీజులు చెల్లించడంతో పాటు క్రీడాకారులకు అవసరమైన క్రీడా పరికరాలు కూడా అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే పేద ప్రజలకు వైద్య సహాయం నిమిత్తం ఆర్థిక సహాయం చేయడం జరుగుతొందన్నారు. భవిష్యత్తులో కూడా తమ ట్రస్ట్ కార్యకలాపాలను మరింత విస్తరించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కాశీ నవీన్ కుమార్, మజ్జి రాంబాబు, బుడ్డిగ రాధా, ఉప్పులూరి జానకి రామయ్య, ద్వారా పార్వతి సుందరి, శివా రెడ్డి, కనకాల రాజా, దుత్తరపు గంగాధర్, అగురు ధన్ రాజ్, కప్పల వెలుగు కుమారి, చాపల చిన్నరాజు, బంగారు నాగేశ్వరరావు, కందికొండ అనంత్, మండల రవి, మండల నాయుడు, మదినా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్టీ సూపర్ సేవింగ్స్..
### వ్యాపార సముదాయాల్లో అవగాహన



**బిక్కవోలు, విశ్వం వాయిస్ న్యూస్:** శుక్రవారం ఉదయం సూపర్ జీ ఎస్ టీ సూపర్ సేవింగ్స్ పై బిక్కవోలు గ్రామంలో కరణం మేడ వద్ద ఎగ్జిబిషన్ సేల్స్, ఎలక్ట్రానిక్స్ కార్యక్రమాన్ని అండ్ హెూమ్ అప్లయిన్సేస్ ఏర్పాటు చేసి షాపుల వద్ద అవగాహన కల్పించడమైనది. ఈ కార్యాక్రమంలో డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ మరియు బిక్కవోలు జిఎస్‌టి స్పెషల్ ఆఫీసర్ ఏం.కుమారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, వి.శ్రీనివాస్, డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎన్.జాన్ మిల్టన్, బిక్కవోలు గౌరవ సర్పంచ్ సరేళ్ళ సుమలత, ఎన్‌డిఎ నాయకులు వాసు,చౌదరి, త్రిమూర్తులు, వెంకన్న బాబు,పవన్, పంచాయితీ కార్యదర్శిలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# సూపర్ జీఎస్టీతో ప్రజలకు కొనుగోలు శక్తి పెరిగింది : బత్తుల
### వాణిజ్య పన్నులశాఖ ఆధ్వర్యంలో అవగాహన




**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కేంద్ర రాష్ట్రాలలో ఎన్డీఏ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్ 2.0తో పేద మధ్యతరగతి ప్రజలలో కొనుగోలు శక్తి పెరిగిందని రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ తెలిపారు. శుక్రవారం పశ్చిమ గోనగూడెం అపర్ణ ఏజెన్సీస్ లో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్ 2.0 పై ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు టీవీలు, ఫ్రిజ్లు, కూలర్లు, కుక్కర్లు, ఎయిర్ కండిషన్స్, వంటి వస్తువుల రేట్లు తగ్గింపు పై వాణిజ్య పన్నులశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసి మేళాలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు బత్తుల మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్ తో ప్రజల జీవితాల్లో నూతన వెలుగుతో కొనుగోలు శక్తి పెరిగిందన్నారు. నిత్యవసర వస్తువులతో పాటు గృహపకరణ, వైద్య, విద్య, బీమా రంగాల్లో ప్రజలకు వెసులుబాటు కలిగిందన్నారు. దీంతో ప్రతి కుటుంబానికి ఎంతగానో ఆదా అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య పన్నులశాఖ అధికారులు శ్రీనివాసబాబు, వెంకటరమణ, ఈవోపీఆర్డి మహేశ్వర ప్రతాప్, సర్పంచ్ రొంగల దేవిక శ్రీనివాస్, సెక్రెటరీ నదీషా, అపర్ణ ఏజెన్సీస్ అధినేత కిషోర్, ఎకౌంట్స్ ఆడిటర్ బొండాడ మధు, ముమ్మడివరపు బాల, పలువురు ఎన్డిఏ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బాణాసంచా తయారీ కేంద్రాలపై జాయింట్ యాక్షన్ ఇన్స్పెక్షన్

## రెవిన్యూ పోలీస్ ఫైర్ అధికారులతో కూడిన ప్రత్యేక బృందం తనిఖీలు
## అన్ నౌన్ పర్సన్ ఇన్సూరెన్స్‌పై అవగాహన అవసరం



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జిల్లా మండల కేంద్రమైన రాయవరం శివా రులో బుధవారం జరిగిన భారీ అగ్నిప్రమాదంతో అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అనుమతులు పొందిన, అనుమతి లేకుండా అక్రమంగా బాణాసంచా తయారు చేస్తున్న కర్మాగారాల పై తనిఖీలు నిర్వహించడానికి రెవెన్యూ,పోలీస్,ఫైర్ శాఖలతో కూడిన జాయింట్ యాక్షన్ ఇన్స్పెక్షన్ ద్వారా చేపట్టిన తనిఖీల్లో భాగంగా, శుక్రవారం రాయవరం మండలం వి.సావరం గ్రామ పరిధిలో గల శ్రీ భవాని గ్రాండ్ ఫైర్ వర్క్స్ బాణాసంచా తయారీ కేంద్రంలో రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల, రామచంద్రపురం డిఎస్పీ రఘువీర్, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ ఎన్. పార్థసారథి, అమలాపురం లేబర్ అసిస్టెంట్ కమిషనర్ టి.నాగలక్ష్మి లతో కూడిన ప్రత్యేక బృందం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల లో భాగంగా డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ ఎన్. పార్థసారథి బాణాసంచా కర్మాగారంలో గల కార్మికులకు అగ్నిమాపక చర్యల పై, అవగాహన సామర్ధ్యాన్ని పరీక్షించారు. అనంతరం కార్మికుల వివరాలు, ఇన్సూరెన్స్ సంబంధిత పత్రాలను పరిశీలించిన అసిస్టెంట్ లేబర్ కమిషనర్ నాగలక్ష్మి నిర్వాహకులకు పలు సూచనలు చేస్తూ నిరంతరం పనిచేసే కార్మికుల ఇన్సూరెన్స్ తో పాటు, దీపావళి సమయంలో రెండు నెలలకు ప్రత్యేకంగా అన్ నౌన్ పర్సన్ ఇన్సూరెన్స్ ఎంతమంది ఉంటే అంత మందికి తీసుకోవాలని సూచించారు. దీనిద్వారా కార్మికులు మారినా ఆ ఇన్సూరెన్స్ వర్తిస్తుందని వివరించారు. తయారీ కేంద్రాన్ని పరిశీలించిన ఆర్డీవో అఖిల సామాగ్రి కొనుగోలు చేసిన వివరాలను సమర్పించాలని కోరి ఆ వివరాలను పరిశీలించారు. ప్రమాదాలకు తావివ్వకుండా, భద్రతా నియమాలను పాటించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ తనిఖీలలో వారి వెంట మండపేట రూరల్ సీఐ పి.దొర రాజు, ఇన్చార్జి తహశీల్దార్ భాస్కర్, ఎస్సై డి సురేష్ బాబు, రామచంద్రపురం ఫైర్ ఆఫీసర్ కె.వెంకటరెడ్డి, ఎ.ఎస్.ఒ సుబ్రహ్మణ్యం,రెవెన్యూ, పోలీస్,ఫైర్ సిబ్బంది ఉన్నారు.

### మూడవ దశ భూముల రీ సర్వే ప్రక్రియ

# నిర్దేశిత కాలవ్యవధిలో పూర్తి చేయాలి

## రెవెన్యూ సర్వే సిబ్బందికి ఆదేశించిన జాయింట్ కలెక్టర్ నిషాంతి



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందు కొత్తపేట, రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ల పరిధి లోని తాసిల్దార్లు మండల సర్వేయర్లు తో సమావేశం నిర్వహించి రీ సర్వే ప్రక్రియ జాయింట్ ఎల్పిఎం ల పరి ష్కార పురోగతులపై సమీ క్షించారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడో దశ రీ సర్వే ను రైతులు సద్వినియోగం చేసుకోవాల న్నారు మూడో దశ రీ సర్వే కార్యకలాపాలు ఈనెల 3న ప్రారంభమ య్యాయని, రైతులు సద్వినియోగం చేసుకొని భావితరాలకు వివాద రహిత భూములను అందించాలని సూచించారు రైతులు షెడ్యూల్ ప్రకారం రీ సర్వేకు హాజరై తమ సొంత పొలం హద్దులు చూపి సర్వే చేయించుకొనేలా ప్రోత్స హించాలన్నారు జిల్లాలో అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో రీ సర్వే ప్రక్రియను దశల వారీగా ప్రభుత్వ మార్గదర్శ కాల ప్రకారం నిర్వ హిస్తున్న ట్లు తెలిపారు..భూ పరి పాలన ప్రక్రియలో సం బంధి త భూములు సంయుక్త ఉన్న సందర్భంలో వాటిని సబ్ డివిజన్ లేదా వ్యక్తిగత హక్కుల ప్రక్రియ భూ యజమానుల దరఖాస్తు అభీష్టానికి అనుగు ణంగా ప్రకారం విభజించి పెండింగ్ కు ఆస్కారం లేకుండా చర్యలు గైకొనాలన్నారు. కుటుంబం లేదా భూమి పట్ల హక్కులు కలిగి ఉన్న పలువురు భూమి యజ మానులు లేదా వారసుల స్థలాన్ని విభజిస్తూ వ్యక్తిగత హక్కులు సంక్రమింప చేయాలన్నారు దీని ద్వారా ప్రతి యజమాని తనకి సంబంధించిన భాగం పత్రాలతో పాటుగా స్పష్టం గా తెలిసే అవకాశం ఏర్పడుతుందన్నారు ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు దేవరకొండ అఖిల పి శ్రీకర్ తాసిల్దారులు మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

# రిలయన్స్ ధీరుభాయ్ అంబానీ క్విజ్ పోటీల సన్నాహక ఏర్పాట్లు



### రిలయన్స్ సిఎస్ఆర్‌హెడ్ పి సుబ్రహ్మణ్యం

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థినీ విద్యార్థులలో నిబిడీకృతమై ఉన్న ప్రతిభ, నైపుణ్యాలను ప్రదర్శించు కునేందుకు రిలయన్స్ ధీరు బాయ్ అంబానీ క్విజ్ పోటీల ద్వారా ఒక చక్కని వేదికను కల్పిస్తున్నట్లు రిలయన్స్ సి ఎస్ ఆర్ హెడ్ పి సుబ్రహ్మణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం కోనసీమ, కాకినాడ జిల్లాల్లో క్విజ్జులు నిర్వహిస్తారన్నా రు.డిసెంబర్ మూడో తేదీ బుధవారం స్థానిక అంబే ద్కర్ భవన్ నందు ధీరు భాయ్ అంబానీ క్విజ్ 2025 పోటీలు నిర్వ హించేందుకు సన్నాహ ఏర్పాట్లు చేస్తున్న ట్లు తెలిపారు. ఈ పోటీలు ప్రభుత్వ ప్రైవేటు పాఠ శాలల్లో 8, 9, 10 తరగతిలో విద్యార్థినీ విద్యార్థులతో నిర్వహించడం జరుగు తుందన్నారు. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి క్విజ్లు విడివి డిగా నిర్వహిస్తారని, ఆకర్ష ణీయమైన ఆధునిక లాప్టా ప్లు వంటి బహుమతులను అందించడం జరుగుతుంద న్నారు. ఇద్దరు విద్యార్థుల తో ఒక బృందాన్ని ఏర్పాటు చేస్తారని, ప్రతి పాఠశాల నుండి రెండు టీములు ఎంపిక చేసేందుకు అవ కాశం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులకు క్విజ్ కేంద్రానికి రాను పోను ప్రయాణ చార్జీలను చెల్లించ డం జరుగుతుందన్నారు. క్విజ్ పోటీల పట్ల ఆసక్తి ఉండి పాల్గొనదలచిన వారు నవంబర్ 30 లోగా కార్యాలయ పని దినాలలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల మ ధ్య తమ తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నా రు. పేర్ల నమోదు కొరకు 0884 3577222, 63022 23156, లలో సంప్రదించాల న్నారు. జనరల్ నాలెడ్జ్ ప్రపంచ, భారత దేశ చరిత్ర కరెంట్ అఫైర్స్ క్లాస్ రూమ్ కరికులం (తరగతి పరిజ్ఞా నం) అంశాలపై క్విజ్ ప్రశ్నా వళి ఉంటుందన్నారు. ధీరు భాయి అంబానీ జన్మ దిన పురస్కరించుకుని ఈ వేడుకలు సుమారుగాగత 10 సంవత్సరాల నుండి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజా దర్బర్‌కు విశేష స్పందన

**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** సామర్లకోట మండలం కొప్పవరం గ్రామంలోని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కార్యాలయంలో శుక్రవారం 25వ వారం ప్రజాదర్బర్ కార్యక్రమం జరిగింది. మేకా లక్ష్మణమూర్తి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలజ కార్పొరేషన్ డైరెక్టర్ డా. చప్పిడి వెంకటేశ్వరరావు, నాయకులు ఆనంద్ న్యూటన్, గింజాల శ్రీనివాస్, జిన్నూరి బాజ్జీ, అవసరాల హరిల్లు, డిఆర్యూసిసి సభ్యులు ముత్యాల అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ప్రజాదర్బర్‌కు హాజరైన అర్జీదారుల నుండి మొత్తం 24 అర్జీలు స్వీకరించగా, వాటిలో 14 అర్జీలను తక్షణమే సంబంధిత శాఖాధికారులతో మాట్లాడి పరిష్కరించారు. పింఛన్, ఉపాధి, సిఎం రిలీఫ్ ఫండ్, రేషన్ కార్డు, డ్రైనేజీ నిర్మించాలని, తదితర అంశాలపై ఎక్కువగా అర్జీలు అందాయి. ఈ సందర్భంగా కార్యాలయ ఇన్‌ఛార్జీ మేకా లక్ష్మణమూర్తి, నాయకులు ఆనంద్ న్యూటన్ మాట్లాడుతూ 'ప్రజాదర్బర్‌లో వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. కాకినాడ జిల్లా నలుమూలల నుండి ప్రజలు విశ్వాసంతో ప్రజాదర్బర్‌కు వస్తున్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది కొండబాబు, రాజేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### దీపావళి జీవితాలలో

# వెలుగులు నింపాలి... విషాద ఛాయలు కాదు..

## ఏలూరు రేంజ్ ఐజి జీ.వి.జి.అశోక్ కుమార్



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మానవ జీవితాలలో దీపావళి వెలుగులు నింపాలి కానీ విషాదఛాయలు నింపకూడదని ఏలూరు రేంజ్ ఐజి జి.వి.జి అశోక్ కుమార్ పేర్కొన్నారు. మండలంలో ఇటీవల బాణాసంచా తయారీ కేంద్రంలో జరిగిన ప్రమాద నేపథ్యంలో ఏలూరు రేంజ్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ జి.వి.జి అశోక్ కుమార్ అగ్ని ప్రమాదంపై, శుక్రవారం బాణాసంచా కర్మాగార నిర్వాహకులైన సత్యనారాయణ మూర్తి (సత్తిబాబు) కుటుంబ సభ్యులను, కార్మికులను ఆరా తీశారు. ఈ సందర్భంగా స్థానిక విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భద్రతా చర్యలను పటిష్టం చేయాలనే ప్రభుత్వ సూచనలు మేరకు, నిబం ధనలను పాటించని బాణాసంచా తయారీ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రాయవరం ప్రమాదం నేపథ్యంలో, ఏలూరు రేంజ్ పరిధిలోని ఆరు జిల్లాలతో పాటు, డాక్టర్ బిఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలలో కూడా అన్ని బాణాసంచా తయారీ యూనిట్లలో ఉమ్మడి బృందాల ద్వారా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఐదు శాఖల సమన్వయంతో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ బృందాలను ఏర్పాటు చేయగా ఈ తనిఖీల్లో ఫైర్, పోలీస్, రెవెన్యూ, లేబర్, ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్ లతో పాటు అవసరమైతే ఇతర శాఖల అధికారులు కూడా పాల్గొంటారని తెలిపారు.

**ప్రమాణాల పరిశీలన**

బాణాసంచా తయారీ యూనిట్లలో పలు అంశాలపై దృష్టి సారించాలని వివరించారు. ముఖ్యంగా ఫైర్ సేఫ్టీ (అగ్ని భద్రత) ప్రమాణాలు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ మెకా నిజమ్స్ (అత్యవసర ప్రతిస్పందన యంత్రాంగాలు) ఏర్పాటు, పేలుడు పదార్థాల నిల్వ పరిమాణం (ఎక్స్‌ప్లోజివ్స్ క్వాంటిటీ), నిల్వ కేంద్రాల భద్రత (స్టోరేజ్ పాయింట్), పని చేస్తున్న కార్మికులకు తప్పనిసరిగా (లేబర్) ఇన్సూరెన్స్ ఏర్పాటు, వారికి ఇచ్చిన భద్రతా శిక్షణ (ట్రైనింగ్),కార్మికుల భద్రత కోసం తీసుకున్న ఇతర జాగ్రత్తలు (ప్రికాషన్స్) వంటివి తప్పనిసరిగా పాటించాలని సూచంచారు. ఈ అంశాలు చట్టప్రకారం ఉన్నాయో లేదో తనిఖీ చేసి, సరైన నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని ఐజీ అశోక్ కుమార్ తెలిపారు. ప్రమాదాలలో ప్రాణ నష్టం లేని విధంగా వెంటనే స్పందించేందుకు, ప్రమాదాలు జరగకుండా నివారించడానికి తగు చర్యలు తీసుకుని, పర్యవేక్షిస్తున్నామని ఆయన వెల్లడించారు. ఈ తనిఖీల్లో ఆయన వెంట డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, స్పెషల్ బ్రాంచ్ ఆఫీసర్ పుల్లారావు, రామచంద్రపురం డిఎస్పీ రఘువీర్, మండపేట రూరల్ సిఐ పి.దొరరాజు, రాయవరం ఎస్సై డి.సురేష్ బాబులు ఉన్నారు.

# పదిహేను సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఘనత చంద్రబాబుదే.. : ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశానికే ఆదర్శవం తమైన పాలకుడు చంద్రబాబు నాయుడని కొనియాడారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కీర్తించారు. శుక్రవారానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా 15 సంవత్సరాల పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా వాడపాలెం కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. తెలుగువారి చరిత్రలో అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన ఏకైక తెలుగు రాజకీయ నాయకుడు చంద్రబాబని కొనియాడారు. దక్షిణాది రాష్ట్రాల్లో ముగ్గురు నాయకులకు మాత్రమే పదిహేను సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఘనత ఉంటే అందులో ఒకరు చంద్రబాబు నాయుడని కీర్తించారు. ముప్పై సంవత్సరాల క్రితం ఆయన చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు,సంస్కరణలు సత్ఫలితాలను ఇచ్చాయన్నారు. ప్రజల వద్దకు పాలన,జన్మభూమి, విద్యుత్ సంస్కరణలు, ఇంజనీరింగ్ కాలేజీలు, దీపం పథకం, ఇంటింటికీ మరుగుదొడ్ల నిర్మాణం, గ్రామగ్రామాన సిమెంటు రోడ్లు, ఎల్ఈడీ లైట్లు ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఇజ్రాయిల్ టెక్నాలజీని తీసుకువచ్చి డ్రిప్ ఇరిగేషన్ కు రాష్ట్రంలో అంకురార్పణ చేయడం ద్వారా మెట్ట ప్రాంతాలను సైతం సస్యశ్యామలం చేశారన్నారు. పట్టిసీమతో కృష్ణా,గోదావరి నదులను అనుసంధానం చేసిన ఘనత ఆయనదేనన్నారు. సంస్కరణలకు ఆద్యుడు చంద్రబాబు నాయుడన్నారు.దేశానికే మార్గదర్శనం చేసిన విజనరీ లీడర్ అని కొనియాడారు. నాటి ప్రధాని వాజ్పేయి నేటి ప్రధాని మోడీ సహకారంతో రాష్ట్రాన్ని అన్ని విధాల ఆయన అభివృద్ధి చేశారని, చేస్తున్నారని తెలిపారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేస్తూ అంతర్జాతీయ స్థాయిలో కీర్తి సాధించిన ఘనత ఒక్క చంద్రబాబుకే దక్కుతుందన్నారు. నేడు చంద్రబాబు ఆలోచనలు రేపటి దేశం ఆలోచనలుగా మారి ఎన్నో మార్లు రాజకీయాల్లో రోల్ మోడల్ గా ఆయనను నిలబెట్టాయన్నారు.డ్వాక్రా సంఘాల ద్వారా మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధి సాధ్యమైనదంటే అది చంద్రబాబు ఘనతేనని ఎమ్మెల్యే బండారు అన్నారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూపులు, సాగునీటి వినియోగదారుల సంఘాలు, స్కూల్ కమిటీలు, వనసంరక్షణ సమితులు ఏర్పాటుచేసి అభివృద్ధికి మార్గం చూపారన్నారు. 94లో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఆయన 2020 విజన్ గురించి చెప్పేవారని, ఆ విజన్ నిజమై నేడు హైదరాబాద్ను చూస్తే విదేశాల్లో ఉన్నట్లు ఉంటుందన్నారు. విభజన తర్వాత నేడు అమరావతి అభివృద్ధి కోసం పాటుపడుతున్నారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం, తెలుగు ప్రజల అభ్యుదయం కోసం నిరంతరం పాటుపడడమే చంద్రబాబునాయుడి యొక్క దీక్షా దక్షతకు నిదర్శనమని కొనియాడారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్థిల్లుతూ తెలుగు ప్రజల సేవలో మరింత ముందుకు వెళ్లాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

### సమాజంలో ఐక్యత, దేశభక్తి, క్రమశిక్షణ, విలువలను పెంపొందించడమే

# ఆర్‌ఎస్ఎస్ ప్రధాన ఉద్దేశ్యం

## రాయవరం వెంకటేశ్వర స్వామి ఆలయంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ విజయదశమి ఉత్సవం
## ఆర్.ఎస్.ఎస్ ఆవిర్భావ కొనసాగింపుపై అవగాహన - ముఖ్య వక్తగా పాల్గొన్న కాకినాడ జిల్లా,కళాశాల ప్రముఖ్ లీలా శంకర్



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్) స్థాపించి శతాబ్ది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జిల్లా, మండల కేంద్రమైన రాయవరంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గల సమావేశ మందిరంలో రాయవరం శాఖ ముఖ్య శిక్షక్ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నిర్వహణలో, రామచంద్రపురం ఖండ కార్యవాహ ఎ.వి హనుమంతరావు పర్యవేక్షణలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్) విజయదశమి ఉత్సవం వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. లొల్ల గ్రామ సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి, గీతా జ్ఞాన మందిరం ట్రస్ట్ చైర్మన్ సత్తి రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గొలుగూరి వీరాంజనేయ రెడ్డి,ముఖ్య వక్తగా కాకినాడ జిల్లా,కళాశాల ప్రముఖ్ ఎస్.లీలా శంకర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో తొలుత నల్లమిల్లి వెంకటరెడ్డి ధ్వజారహణ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి కొనసాగించగా అనంతరం ముఖ్య వక్త లీలా శంకర్ మాట్లాడుతూ ఆర్.ఎస్.ఎస్ అనే సంస్థను ఎవరు స్థాపించారు, ఎందుకు స్థాపించారు అనే విషయాలు వివరించారు, వంద సంవత్సరాలు పూర్తి చేసుకోవడం సామాన్య విషయం కాదని తెలియజేసారు. ఏడు లక్ష్యాలు పెట్టుకున్నట్టుగా ఆయన తెలియజేశారు అవి విజయదశమి ఉత్సవం, విస్తృత గృహ సంపర్కం, హిందూ సమ్మేళనాలు, సద్భావన బైటక్, ప్రతిష్ట వ్యక్తుల సమావేశం, యువతకు శిక్షణ కార్యక్రమం, శాఖ శాప్తాహంగా నామకరణం చేసినట్టు, వాటి యొక్క ముఖ్య ఉద్దేశాలు ఏమోటి,అవి ఎలా ఆచరించాలి దాని అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరిలోనూ పంచ పరివర్తన తీసుకురావాలని సామాజిక సామరస్యం, పర్యావరణ పరిరక్షణ, స్వదేశీ స్వావలంబన,పౌర విధులు, కుటుంబ ప్రబోధయం గురించి వివరించారు. హిందూసమాజంలో ఐక్యతను దేశభక్తి క్రమశిక్షణ వంటి విలువలను పెంపొందించడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశం అని హిందూ సమాజం ఐక్యంగా ముందుకు సాగాలని యోధులు వంటి ధైర్య సాహసాలతో దేశ రక్షణలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు చివరిగా సంఘ్ ప్రార్థన చేశారు ఈ కార్యక్రమంలో చెక్క మూర్తి, వై విశ్వేశ్వరరావు, గుత్తుల వెంకటరమణ, గణేష్ రెడ్డి,నరాల రాంబాబు, చిరట్లసుబ్బారావు , వెదురుపాక,లొల్ల ,వీ సావారం గ్రామ పెద్దలు గణావేష్ ధరించిన 20 మంది యువకులు, హిందూ బంధువులు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు యువతీ, యువకులు పాల్గొన్నారు.



# దేశంలో రాజ్యాంగం అమలులో ఉందా.?

## ఎ.పి.సి.ఆర్ రాష్ట్ర కోఆర్డినేటర్ షేక్ అన్సారీ

**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** భారత అత్యున్నత న్యాయస్థానం చీఫ్ జస్టిస్ గవాయిపై బూటు విసరడం, దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపతి ముర్ముకు పార్లమెంట్ భవన ప్రారంభోత్సవానికి ఆహ్వానం లేకపోవడం, ఉపరాష్ట్రపతి జగదీప్ ధనకర్ రాజీనామా తో పాటు ఈ విషయమై ఆయన ఇప్పటి వరకు మీడియా ముందు రాకపోవడం వంటి అంశాలను పరిశీలిస్తే దేశంలో రాజ్యాంగం అమలవుతుందా? అనే ఆందోళన కలిగిస్తోందని ఎ.పి.సి.ఆర్ రాష్ట్ర కోఆర్డినేటర్ షేక్ అన్సారీ ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ హక్కులను తుడిచి వేస్తూ, భారతీయ జనతా పార్టీ మనువాద పరిపాలనను అమలు చేస్తుందని, దీనిపై మేధావులు సైతం పెదవి విప్పకపోవడం పలు అనుమానాలకు తావిస్తుందని అన్నారు. ఇప్పటికైనా ప్రజలు మేలుకొని రాజ్యాంగ పరిరక్షణకు పాటు పడాలని ఆయన కోరారు.

# 69వ రాష్ట్రస్థాయి బాక్సింగ్, ఉషూ పోటీలు ప్రారంభం..

**పోటీలలో పాల్గొననున్న 13 జిల్లాలకు చెందిన 1,650 మంది క్రీడాకారులు**
**రాష్ట్ర స్థాయిలో 16 అకాడమీలు ప్రారంభిస్తున్నాం..**
**క్రీడాపోటీలు ప్రారంభించిన డిఈఓ కె.వాసుదేవరావు, శాప్ డైరెక్టర్ రవీంద్రనాథ్**





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రస్థాయి 69వ బాక్సింగ్, ఉషూ పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలలో జిల్లా విద్యాశాఖ అధికారి కే.వాసుదేవరావు, శాప్ డైరెక్టర్ రవీంద్రనాథ్ ముఖ్య అతిథులుగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంభించారు. ముందుగా 13 జిల్లాలకు చెందిన క్రీడాకారులు నిర్వహించిన నిర్వహించిన మార్చ్ ఫాస్ట్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి కే.వాసుదేవరావు మాట్లాడుతూ 69వ స్కూల్ గేమ్స్ లో భాగంగా బాక్సింగ్, ఉషూ పోటీలు అండర్14, అండర్ 17, అండర్ 19 బాలుర, గర్ల్స్ పోటీ లు తూర్పుగోదావరి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో పాల్గొని క్రీడాకారులకు వసతి, భోజన సౌకర్యం లతోపాటు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఒక పండగ వాతావరణం జరిగే ఈ కార్యక్రమంలో 13 జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. గెలుపు ఓటములతో సంబంధం లేకుండా క్రీడా స్ఫూర్తితో క్రీడాకారులు వ్యవహరించాలని సూచించారు. శాప్ డైరెక్టర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ 69వ స్కూల్ గేమ్స్ పోటీలు తూర్పుగోదావరి జిల్లా ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. ఈ పోటీలలో 1650 మంది క్రీడాకారులు లో పాల్గొంటున్నట్లు వివరించారు.అన్ని రకాల సౌకర్యాలు కల్పించడంతో పాటు విద్యార్థులకు ఏ విధమైన ఇబ్బంది లేకుండా ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం నాలుగు గంటల నుంచి పది గంటల వరకు పోటీలు జరుగుతాయని తెలిపారు. క్రీడాకారుల సౌకర్యార్థం బాక్సింగ్ రింగును ఒంగోలు నుంచి తీసుకు వచ్చినట్లు తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించడంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 43 వేల మందికి స్పోర్ట్స్ కిట్స్ రాష్ట్ర మంతటా పంపిణీ చేసినట్లు తెలిపారు.రాష్ట్రంలో 16 అకాడమీలు ప్రారంభిస్తున్నట్లు వివరించారు. అర్బన్ డీఈవో బి దిలీప్ మాట్లాడుతూ జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులంతా కష్టపడి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సదుద్దేశంతో ఈ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెక్రటరీలు అవాల ప్రసాద్, భువనేశ్వరి లు మాట్లాడుతూ ఏపీ ఇంటర్ అండ్ జిల్లా స్థాయిలో 69వ స్కూల్ గేమ్స్ పోటీలకు జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, శాప్ చైర్మన్ ,షాప్ డైరెక్టర్, డీఈవో , ఆర్ ఐ పీ అధికారులు సహకారం అందించినట్లు వివరించారు. ఈ క్రీడా పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు ఏ విధమైన అసహకేర్యం కలగకుండా ఒంగోలు నుంచి బాక్సింగ్ రింగును తీసుకొచ్చినట్లు తెలిపారు. వైద్యుల పర్యవేక్షణలో క్రీడా పోటీలు జరుగుతాయని అన్నారు. విద్యార్థులకు మంచినీరు, భోజనం, వసతి శానిటేషన్ తదితర సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఈ క్రీడా పోటీలు పారదర్శకంగా జరుగుతాయని వివరించారు.ఈ కార్యక్రమం లో వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం సభ్యులు నాగరాజు, వీరబాబు,స్వామి,డేవిడ్, బాపిరాజు, బురిడి త్రిమూర్తులు,విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్టీ సంస్కరణల వల్ల తగ్గిన ధరలు..

**ప్రతి కుటుంబానికి ఆర్థిక లబ్ధి - సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ ఎలక్ట్రానిక్ ఎగ్జిబిషన్ ప్రారంభం : జేసీ వై.మేఘాస్వరూప్**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా స్థాయి ఎలక్ట్రానిక్ ఎగ్జిబిషన్-2025ను జిల్లా జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ (సేల్స్ ట్యాక్స్)ఎం.సుధాకర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎస్టీ నోడల్ అధికారి,జాయింట్ కలెక్టర్ వై.మేఘ స్వరూప్ మాట్లాడుతూ, జీఎస్టీ సంస్కరణల వల్ల వినియోగ వస్తువుల ధరలు గణనీయంగా తగ్గాయని, ప్రజలకు ఈ లాభాలు ప్రత్యక్షంగా చేరేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. "సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్" ప్రచారం ద్వారా ప్రజలలో అవగాహన పెంపొందించడం ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. టీవీలు, ఏసీలు, మిక్సీలు, వాషింగ్ మిషన్లు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులపై జీఎస్టీ తగ్గింపుతో వినియోగదారులకు రూ. 5 వేల నుండి రూ. 15 వేల వరకు లబ్ధి చేకూరుతోందని తెలిపారు. జీఎస్టీ తగ్గింపు వల్ల పేద, మధ్యతరగతి వర్గాల కుటుంబాలకు ఆర్థిక లాభం కలుగుతోందని చెప్పారు. జీఎస్టీ హెల్ప్‌లైన్ టోల్‌ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేసి ప్రజలకు ప్రత్యక్ష సమాచారం అందించే విధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. మండల, గ్రామ స్థాయిల్లో కూడా జీఎస్టీ అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. జీఎస్టీ తగ్గింపునకు ముందు ప్రస్తుత ధర సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిఎస్టీ తగ్గింపు ద్వారా పేద, మధ్యతరగతి వర్గాలకు ప్రతి కుటుంబానికి ఆర్థికంగా ప్రయోజనం ఉంటుందన్నారు. వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ ఎం.సుధాకర్ రావు మాట్లాడుతూ, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన ఉద్దేశ్యం "సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్" ఫలాలు వినియోగదారులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవడం అని తెలిపారు. ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించేందుకు పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు తదితర ప్రాంతాల్లో ప్రచార కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమం వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం ధర్మం చర కమ్యూనిటీ హాల్లో అక్టోబర్ 10, 11 తేదీల్లో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ టీ.వీ నాగేశ్వర రావు, జీఎస్టీ ఆఫీసర్ హుస్సేన్ షరీఫ్,డిప్యూటీ ఏసీ కే. సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పీహెచ్సీ ల్యాబ్ టెక్నీషియన్ పుట్టినరోజు సందర్భంగా చీరలు పండ్లు పంపిణీ

**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ల్యాబ్ టెక్నీషియన్ గా పనిచేస్తున్న ఈ శిల్ప పుట్టినరోజు సందర్భంగా గర్భిణీలు వృద్ధులకు వివిధ రకాల పండ్లు చీరలు పంచిపెట్టారు ఈ సందర్భంగా శిల్ప మాట్లాడుతూ పుట్టినరోజు సందర్భంగా 40 మంది వృద్ధులకు చీరలు 50 మంది గర్భిణీలకు వివిధ రకాల పండ్లు పెంచడం ఆనందంగా ఉందన్నారు ఈ కార్యక్రమంలో ఏంపిహెచ్ఇవో కె.రాయుడు, సూపర్వైజర్ సుధాకర్,ప్రాథమిక ఆరోగ్య ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



**సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ ఎగ్జిబిషన్ ప్రారంభించిన**

# శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం వాణిజ్య పన్నుల శాఖ వారి ఆధ్వర్యంలో సీతానగరం మండలం చిన్నకొండెపూడి గ్రామంలో సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా అపర్ణ ఏజెన్సీ నందు ఏర్పాటు చేసిన సీతానగరం మండల గ్రాండ్ ఎలక్ట్రానిక్స్ ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిధిగా రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ పాల్గొని రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు.ఈ సందర్బంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ జిఎస్టి తగ్గింపు వల్ల ప్రజలకు లబ్ది చేకూరుతుందని తెలిపారు. జిఎస్టి 2.0 ద్వారా ప్రతి కుటుంబానికి కూడా నెలసరి రూ.15,000 ఆదా అవుతుందన్నారు. జిఎస్టి ను తగ్గించటం ద్వారా సామాన్యులకు ఆర్థిక ప్రయోజనంతో పాటు పొదుపు పెరుగుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఒక పక్క సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తూ మరొక పక్క సూపర్ జిఎస్టి సంస్కరణలను తీసుకొచ్చి ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన..

**డీఎంఅండ్ హెచ్ఓ వెంకటేశ్వరరావు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వం నిర్వహించే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి డీఎంఅండ్ హెచ్ఓ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కలెక్టర్ కీర్తిచేకూరి ఆదేశానుశారం శుక్రవారం స్థానిక కంబాల పేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలో ఉన్న ఆర్ట్స్ కళాశాల లో ఉన్న పీఎంఎస్ బాలికల వసతి గృహం,ఎస్టీ బాలుర వసతి గృహాల వద్ద జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు సికిల్ సెల్ ఎనీమియా పై అవగాహన కల్పించారు. ఈ వ్యాధి నిర్ధారణ పరిక్షలు నిర్వహించారు. డీఎమ్అండ్ హెచ్ఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సికిల్ సెల్ అనీమియా అనేది జన్యువుల లోపం వలన వస్తుందని,ఈ జన్యు మార్పిడి వలన ఏర్పడే హిమోగ్లబిన్ ఎర్ర రక్త కణాలను కొడవలి లేదా నెలవంక ఆకారంలో మారుస్తుందని అన్నారు. దీని వలన రక్తహీనత, అలసట, బలహీనత, కణజాల నష్టం,తరుచుగా అంటు వ్యాధులు రావడం, నొప్పిగా ఉండడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూపీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ ఎమ్కే అనూహ్య, ప్రోగ్రాం ఆఫీసర్స్, సూపర్వైజర్ డీడీ భవాని, ఎఎన్ఎమ్ లు,ఆశాలు, హాస్టల్ వార్డెన్ క్రాంతి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 105 మందికి పరీక్షలు నిర్వహించారు. డీఎమ్ అండ్ హెచ్ఓ యూపీహెచ్సీ ని సందర్శించడం జరిగింది.

# శెట్టిబలిజ విద్యార్థులకు ఉపకార వేతనాలు మంజూరు..

**ఈ నెల 12న మంత్రుల సమక్షంలో రూ 13లక్షలు పంపిణీకి ఏర్పాట్లు..**
**రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు వెల్లడి ..**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన శెట్టిబలిజ సంఘీయ విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వనున్నట్లు రాష్ట్ర శెట్టి బలిజ సంక్షేమం,అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు తెలిపారు. శుక్రవారం స్థానిక వెంకటేశ్వర నగర్ లో ఏపీ శెట్టి బలిజ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతాన్ని పెంచే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చెప్పారు.ఈ నెల 12వ తేదీ మధ్యాహ్నం 4 గంటలకు స్థానిక గోదావరి గట్టున కరెంట్ ఆఫీస్ ఎదురుగా శ్రీత్యాగరాజ నారాయణ దాస కల్యాణ మండపంలో 230 మంది విద్యార్థులకు రూ 13 లక్షలు ఉపకార వేతనాలు అందించనున్నట్లు చెప్పారు.ఇందులో రూ 10 లక్షలు మంత్రి వాసంశెట్టి సుభాష్‌కృషి తో సీఎస్సార్ కింద గోద్రెజ్ సంస్థ మంజూరు చేయగా మిగిలిన రూ 3 లక్షలు తన వ్యక్తిగత కార్యక్రమం కింద వెచ్చించినట్లు తెలిపారు. పదో తరగతిలో 576 నుండి 600మార్కులు వచ్చిన వారికి రూ 10,000,551 నుంచి 574 మార్కులకు రూ 5000,500 నుండి 550 మార్కులకు రూ.3500 ఉపకార వేతనాలు అందజేస్తామని చెప్పారు. రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ చరిత్రలో ఇది వరకు ఎన్నడూ లేదని, తొలిసారిగా ఇక్కడ జరుగుతుందని తెలిపారు. ఈ మేరకు స్ఫూర్తిని ఇచ్చిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్, నారా లోకేశ్, వాసంశెట్టి సుభాష్ లకు సత్తిబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జరిగే సభకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అధ్యక్షత వహిస్తారు. శాసన మండలి మాజీ డెప్యూటీ చైర్మన్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం, ఏపీ బీసీ కో.ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్ పర్సన్ రెడ్డి అనంత కుమారి లు సభా నిర్వాహక అధ్యక్షులుగా వ్యవహరిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా ఇటీవల స్కోచ్ గోల్డ్ అవార్డు పొందిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవితకు అభినందన సత్కారం నిర్వహిస్తామని తెలిపారు. ఇదే సందర్భంలో ఉభయ గోదావరి జిల్లాలలో శెట్టి బలిజ రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ డైరెక్టర్లకు, మార్కెట్ కమిటీ చైర్మన్లకు చిరు సత్కారం నిర్వహించనున్నా మన్నారు.మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, ఎమ్మెల్సీ సోమువీర్రాజు, ఎమ్మెల్యే లు పితాని సత్యనారాయణ,గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకటరాజు, బత్తుల బలరామకృష్ణ, ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు, రుడా చైర్మన్ బి.వి.రమణ చౌదరి ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో శ్యామలాంబ దేవస్థానం చైర్మన్ కడియాల వీరభద్రరావు,టీడీపీ నగర కార్యదర్శి బుడ్డిగ రాధ, మాజీ కార్పొరేటర్ కడలి రామకృష్ణ,శీలం గోవింద్,ముసిని బాబూ రావు,చింతపల్లి నాని తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాల రక్షణకు తొలి అడుగు

**జిల్లా అధ్యక్షులు రవికుమార్**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి తూర్పు గోదావరి జిల్లా నాయకత్వం దేవాలయాల పరిరక్షణకు ఈరోజు తొలి అడుగు వేసింది. తూర్పుగోదావరి జిల్లా కొత్త కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగిన తర్వాత మొదటిసారిగా సభ్యులంతా ఉమా మార్కండేయ స్వామి గుడిలో దైవాశీస్సులు తీసుకొని అనంతరం దేవాదాయ శాఖ ఉన్నత అధికారిని కలిసి సభ్యుల జాబితాను వారికి అందించి తగిన సహకారం అందించాలని కోరారు. 2012 నుండి తమ సంస్థ దేవాలయాల పరిరక్షణ నిమిత్తం తన కార్యకలాపాలు కొనసాగిస్తుందని అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లాడి రుద్రయ్య పర్యవేక్షణలో తూర్పుగోదావరి జిల్లా కొత్త కమిటీ ఏర్పడిందని అన్నారు. దేవాదాయ అధికారులు తమ సమితికి సహాయ సహకారాలు అందించాలని తమ సభ్యుల జాబితాను వివిధ దేవాలయాలకు పంపించి తమ సమితి విధి విధానాలను తెలియ పరచాలని విన్నవించారు. ఈ సందర్భంగా వారు కూడా సానుకూలంగా స్పందించి తప్పక తమ సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మురళి, బమిడి పల్లి రమణ మూర్తి, పోతుల వేంకటేష్, జట్ల సురేష్,అట్లూరి కిషోర్, పవన్, సాయికృష్ణ, సబ్బిశెట్టి రాంబాబు, చిరంజీవి,ఫణి,దుర్గాశక్తి మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

# బొబ్బిలంకలో 2026 -2027 సంవత్సరానికి గాను గ్రామ సభ



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం బొబ్బిలంక గ్రామపంచాయితీలో 2026 -2027 సంవత్సరానికి గాను ఉపాధి శ్రామికులకు వంద రోజులు పని కల్పించే విధంగా పనులు గుర్తించి గ్రామసభ నిర్వహించడమైనది. ఈ గ్రామ సభలో గ్రామ సర్పంచ్, పంచాయతీ సెక్రెటరీ, కూటమి నాయకులు పోసిన కృష్ణ, ఉపాధి హామీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఉపాధి హామీ శ్రామికులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సోంపు... లాభాల్లో రాజీ లేదు

చాలా మంది భోజనం తర్వాత సోంపు గింజలను తింటుంటారు. ఇలా తినడం వల్ల జీర్ణక్రియ వేగవంతం అవుతుంది. అలాగే పెళ్లిళ్లు, శుభకార్యాల్లో అన్ని రకాల ఆహార పదార్థాలతోపాటు దీన్ని తప్పనిసరిగా పెడతారు. హెూటల్స్‌లోనూ భోజనం చివర్లో ప్రత్యేకంగా అందిస్తారు. ఆహారం బాగా జీర్ణమవుతుందనేది ఇందుకు కారణం..భోజనం తర్వాత సోంపుతో పాటు ఇతర ఆహారాలను కూడా తినవచ్చు. ఆహారం రుచిని పెంచే సుగంధ ద్రవ్యం గ్రీన్ కార్డమమ్ (యాలకులు). ఇది నోటి దుర్వాసనను తొలగించడమే కాకుండా కడుపులోని ఎంజైమ్‌లను కూడా సక్రియం చేస్తుంది. భోజనం తిన్న తర్వాత నోట్లో కాసిన్ని సోంపు గింజలు వేసుకుంటే ఎంతో




ప్రయోజనకరంగా ఉంటుంది. లవంగాలలో యూజినాల్ అనే రసాయనం ఉంటుంది. ఇది క్రిమినాశక లక్షణాలను కలిగి ఉంటుంది. లవంగాలు దంతాలు, చిగుళ్ళకు కూడా ఉపయోగపడతాయి. అందువల్ల మీరు భోజనం తర్వాత లవంగాలను కూడా తినవచ్చు. భోజనం తర్వాత పుదీనా ఆకులను తినవచ్చు. పుదీనా ఆకులు నోటి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. రాత్రి భోజనం తర్వాత 2-3 పుదీనా ఆకులను నోటిలో ఉంచుకోవడం వల్ల దుర్వాసన తొలగిపోతుంది. అయితే ఆమ్లత్వంతో బాధపడేవారు నిపుణుడిని సంప్రదించకుండా పుదీనా ఆకులను తినకూడదు. సోంపు గింజలుమీరు భోజనం తర్వాత జీలకర్ర, మెంతులు కూడా తినవచ్చు. భోజనం తర్వాత జీలకర్ర, మెంతులు కలిపి తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుందని, ఉబ్బరం, గ్యాస్ తగ్గుతుందని తద్వారా బరువు నియంత్రణలో సహాయపడుతుందని నిపుణులు అంటున్నారు. ఆరోగ్యకరమైన ఆహారం. అందుకే దీనిని సూపర్ ఫుడ్ అని పిలుస్తారు. చాలా మంది సోంపు గింజలు తినడానికి ఇష్టపడతారు. కొంతమంది రాత్రంతా వీటిని నీటిలో నానబెట్టి ఉదయం ఈ నీటిని తాగుతుంటారు. భోజనం తర్వాత కొత్తిమీర నీళ్లు తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడి ఆమ్లత్వం తగ్గుతుంది. అలాగే శరీరం నుంచి విషాన్ని బయటకు పంపడంలో కూడా సహాయపడుతుంది. ఇందులో ఉండే ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు జీర్ణక్రియను సజావుగా చేయడంలో, ఉబ్బరం తగ్గించడంలో సహాయపడతాయి. ఇవి శరీరానికి చల్లదనాన్ని ఇస్తాయి.

# బాగా పాలిష్ పెట్టిన బియ్యంతో తీవ్రమైన వ్యాధి.. జాగ్రత్త!



మనం పాలిష్ చేసిన బియ్యంతో వండిన అన్నాన్ని తింటున్నాం. ఇక అసలే బియ్యం పాలిష్ చేసి ఉంటే దానిని మరింత గట్టిగా పిసికి పిసికి నీళ్లతో కడుగుతున్నాము. దీంతో బియ్యంలో ఉండే థయామిన్ పోతుంది. దీనివల్ల విటమిన్ బి1 లోపం వస్తుంది. ఇది తీవ్రమైన అనారోగ్య సమస్యలకు దారితీస్తుంది. ముఖ్యంగా ఇది బెరిబెరి వ్యాధి రావడానికి కారణమవుతుంది. బెరిబెరి అనేది విటమిన్ బి1 లోపం వల్ల వచ్చే ఒక తీవ్రమైన ఆరోగ్య సమస్య. ఇది మన శరీరంలోని గుండెను మరియు నాడీ వ్యవస్థలను ప్రభావితం చేస్తుంది. ఇందులో తడి బెరిబెరి, పొడి బెరిబెరి అని రెండు రకాలు ఉంటాయి. ముఖ్యంగా తడి బెరిబెరి గుండె మరియు రక్త ప్రసరణ వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. తీవ్రమైన సమయాలలో ఇది గుండె ఆగిపోవడానికి కూడా కారణమవుతుంది. గుండె పనితీరులో మార్పులు, శ్వాస ఆడక పోవడం వంటి లక్షణాలు ప్రధానంగా దీనితో కనిపిస్తాయి. ఇక పొడి బెరిబెరి శరీరంలోని నరాలను, కండరాలను దెబ్బతీస్తుంది. దీనివల్ల కండరాల బలహీనత, నరాల నష్టం, నడకలో ఇబ్బంది, స్పర్శ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. చేతులు, కాళ్ళల్లో తిమ్మిర్లు రావడంతో పాటు నడకలో ఇబ్బంది, మానసిక గందరగోళం, మాటలు తడబడడం వంటి లక్షణాలు పొడి బెరిబెరి వ్యాధిలో కనిపిస్తాయి. అసలు ఈ తడి బెరిబెరి, పొడి బెరిబెరి ఎందువల్ల వస్తాయి? కారణాలు ఏమిటి.. అంటే ముఖ్యంగా శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉన్న ఆహారాన్ని తినడం వల్ల, దయా అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోకపోవడం వల్ల ఈ వ్యాధి వస్తుంది. అంతేకాదు ఎక్కువగా ఆల్కహాల్ తీసుకునే వారిలోనూ ఈ వ్యాధి వచ్చే ప్రమాదం ఉంది. ఇవి మాత్రమే కాకుండా థయామిన్ తీసుకోలేని జన్యుపరమైన సమస్యలు శరీరానికి ఉంటే కూడా ఈ వ్యాధి వస్తుంది. పాలిచ్చే తల్లులకు ఆహారంలో థయామిన్ లోపం ఉండడం వల్ల శిశువులకు ఆ వ్యాధి వచ్చే అవకాశం ఉంటుంది.

# ఇది పండు కాదు అమృతం



చౌకగా లభించే.. పోషకాలు అధికంగా ఉండే.. పండ్లలో జామ ముందు వరుసలో ఉంటుంది. ఈ పండులో విటమిన్ సి, ఫైబర్ పుష్కలంగా ఉండటమే కాకుండా ఇది యాంటీఆక్సిడెంట్లకు 'పవర్‌హౌస్' కూడా ప్రసిద్ధి. సరైన సమయంలో, సరైన మార్గంలో మీ రోజువారీ ఆహారంలో జామను చేర్చుకోవడం వల్ల అనేక వ్యాధుల.. చౌకైన, సులభంగా లభించే, పోషకాలు అధికంగా లభించే పండ్లలో జామ ముందు వరుసలో ఉంటుంది. ఈ పండులో విటమిన్ సి, ఫైబర్ పుష్కలంగా ఉండటమే కాకుండా ఇది యాంటీఆక్సిడెంట్లకు 'పవర్‌హౌస్' కూడా ప్రసిద్ధి. సరైన సమయంలో, సరైన మార్గంలో మీ రోజువారీ ఆహారంలో జామను చేర్చుకోవడం వల్ల అనేక వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు. వ్యాధి నిరోధకత కూడా లభిస్తుంది. జామకాయలో విటమిన్ సి, విటమిన్ ఎ, లైకోపీన్, పొటాషియం, ఫైబర్ వంటి అనేక ఇతర ఖనిజాలు అధికంగా ఉంటాయి. ఈ మూలకాలు వివిధ ముఖ్యమైన శరీర విధులు సజావుగా సాగడానికి సహాయపడతాయి. అయితే జామకాయ తినడానికి సరైన సమయం ఏది? అనే ప్రశ్నపై ఆధారపడి ఉంటుంది. నిజానికి, జామ పండ్లు తినే సమయం శరీర అవసరాలు, జీర్ణ సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది. ఉదయం బ్రేక్ పాస్ట్ తర్వాత లేదా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య జామపండ్లు తినడం చాలా మంచిది. ఈ సమయంలో జామపండ్లు తినడం వల్ల శరీరంలో శక్తి ఉత్పత్తి అవుతుంది. జామపండులోని ఫైబర్, సహజ చక్కెరలు రోజంతా అవసరమైన శక్తినిస్తాయి. దీనితోపాటు జీర్ణ ప్రక్రియ మెరుగుపడుతుంది. ఇది కడుపుని శుభ్రంగా ఉంచడానికి సహాయపడుతుంది. జీర్ణక్రియను పెంచడంలో పాత్ర పోషిస్తుంది. జామపండులో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది ఎక్కువసేపు కడుపు నిండుగా ఉంచడానికి సహాయపడుతుంది. భోజనానికి ముందు జామపండు తినడం వల్ల అతిగా తినడం నివారించవచ్చు. బరువు నియంత్రణలో కూడా ఇది చాలా సహాయపడుతుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులు రోజూ మధ్యాహ్నం ఒక జామపండు తినడం వల్ల ఒంట్లో షుగర్ లెవెల్స్ స్థిరంగా ఉంటాయి. ఇందులో ఫైబర్ కంటెంట్ ఉండటం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. జామ పండ్లు తొక్క, గింజలలో అత్యధిక యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ ఉంటాయి.

# ఆరోగ్యానికి ఎంత మంచిదో.. అంతే డేంజర్!



సీతాఫలం రుచికరమైన పండు. దీనిని హిందీ, తెలుగులో సీతాఫల్ లేదా శరీఫా అని కూడా పిలుస్తారు. ఈ పండులో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ నుండి శరీరాన్ని రక్షించి, రోగనిరోధక శక్తిని పెంచడానికి, గుండె, కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి తోడ్పడతాయి. అయితే, ఈ పండును అతిగా తినడం లేదా కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారు తీసుకోవడం ఆరోగ్యానికి హానికరం కావచ్చు. కాబట్టి, సీతాఫలం ఎవరు తినకూడదో తెలుసుకోవడం చాలా ముఖ్యం. సీతాఫలంలో పోషకాలు ఎక్కువగా ఉంటాయి. కానీ అతిగా తింటే జీర్ణ సమస్యలు, వాంతులు వచ్చే అవకాశం ఉంది. విత్తనాలు విషపూరితం. సీతాఫలం పండు ఆరోగ్యానికి చాలా మంచిది. అయినా, కొన్ని ఆరోగ్య పరిస్థితులు ఉన్నవారు, లేదా దీన్ని అతిగా తీసుకునేవారు జాగ్రత్తగా ఉండాలి. సీతాఫలం తీసుకోవడం ఎవరికి ప్రమాదకరమో, దీని దుష్ప్రభావాలు ఏమిటో చూద్దాం. అలెర్జీ సమస్యలు ఉన్నవారు: కొంతమందికి సీతాఫలం తిన్న తరువాత దురద, దద్దుర్లు, చికాకు లాంటి అలెర్జీ సమస్యలు రావచ్చు. అలాంటి లక్షణాలు కనిపిస్తే ఈ పండు తినడం మానుకోవాలి. జీర్ణ సమస్యలు ఉన్నవారు: సీతాఫలంలో పీచు (ఫైబర్) శాతం చాలా ఎక్కువగా ఉంటుంది. దీనిని అతిగా తీసుకుంటే, జీర్ణ సంబంధిత సమస్యలు వస్తాయి. కడుపు ఉబ్బరం, కడుపునొప్పి, బిగుతుగా అనిపించడం, విరేచనాలు లాంటి సమస్యలు రావచ్చు. విషపూరిత విత్తనాలు: సీతాఫలం పండు ఆరోగ్యకరమే. కానీ, దీని విత్తనాలు విషపూరితం కావచ్చు.

# ఈ ఒక్కటి తాగితే చాలు.. కళ్లుచెదిరే బెనిఫిట్స్



అల్లంను ఆయుర్వేదంలో అనాదిగా ఒక ముఖ్యమైన ఔషధంగా ఉపయోగిస్తున్నారు. అల్లం వేరులో ఉండే జింజెరాల్ అనే శక్తివంతమైన సమ్మేళనం మన శరీరాన్ని అనేక వ్యాధుల నుంచి రక్షిస్తుంది. ఉదయం ఒక కప్పు అల్లం టీ తాగితే జీర్ణ సమస్యలు నుంచి బరువు తగ్గడం వరకు ఎన్నో అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. మీకు తెలుసా.. మనం రోజు తాగే అల్లం టీ మామూలు టీ కాదు.. ఇది ఒక సూపర్ పవర్ డ్రింక్ అని చెప్పొచ్చు. ఆయుర్వేదం దీనిని ఔషధంగా వాడింది అంటే దాని పవర్ ఏంటో అర్థం చేసుకోవచ్చు. ఉదయం ఒక కప్పు అల్లం టీ తాగితే రోజంతా ఎనర్జీగా ఉంటారు. అల్లం టీ కడుపు సమస్యలకు దివ్యౌషధం లాంటిది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. గ్యాస్, అసిడిటీని తగ్గిస్తుంది. భోజనం తర్వాత తాగితే జీర్ణం బాగా అవుతుంది. మలబద్ధకం సమస్య కూడా తగ్గుతుంది. కడుపుకి ఇది చాలా రిలాక్సింగ్‌గా పనిచేస్తుంది. మీరు బరువు తగ్గాలని అనుకుంటున్నారా? అయితే అల్లం టీని ట్రై చేయండి. ఇది మీ మెటబాలిజంను పెంచుతుంది. అంటే మీ శరీరం కేలరీలను వేగంగా కరిగిస్తుంది. దీనివల్ల కొవ్వు పేరుకుపోవడం తగ్గి, బరువు తగ్గడం ఈజీ అవుతుంది. అల్లం టీలో ఉండే యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు శరీరంలో నొప్పి, మంటను తగ్గిస్తాయి. కండరాల నొప్పి, కీళ్ల నొప్పి ఉన్నవారికి ఇది చాలా మంచిది. అంతేకాదు పీరియడ్స్ నొప్పి నుంచి కూడా ఇది ఉపశమనం ఇస్తుంది. ఇది ఒక నేచురల్ పెయిన్ కిల్లర్ లా పనిచేస్తుంది. ప్రయాణించేటప్పుడు వాంతులు లేదా వికారం సమస్య ఉందా? లేక గర్భిణీ స్త్రీలలో కనిపించే మార్నింగ్ సిక్నెస్ అయినా సరే, అల్లం టీ తాగితే వెంటనే ఉపశమనం దొరుకుతుంది. వికారం సమయంలో అల్లం తినడం వల్ల కలిగే ప్రయోజనాలు అద్భుతంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. అల్లం టీలో ఉన్న యాంటీఆక్సిడెంట్లు మీ రోగనిరోధక శక్తిని బలంగా ఉంచుతాయి. ఇది జలుబు, దగ్గు, జ్వరం వంటి సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తుంది. ముఖ్యంగా చలికాలంలో ఇది శరీరాన్ని వెచ్చగా, ఎనర్జీగా ఉంచుతుంది.

బిజినెస్ వాయిస్

# అమెజాన్‌లోనూ రాయల్ ఎన్‌ఫీల్డ్ బైకులు కొనేయొచ్చు



దేశీయ ఆటోమొబైల్ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ ఇటీవల ఈ–కామర్స్‌లోకి ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. కంపెనీ పోర్ట్‌ఫోలియోలోని 350 సీసీ సామర్థ్యం ఉన్న మోటార్‌సైకిళ్లను గత నెలలో ఫ్లిప్‌కార్ట్ ద్వారా విక్రయించడం ప్రారంభించింది. తాజాగా కంపెనీ తన బైకుల అమ్మకాలను మరింత విస్తరిస్తూ, అమెజాన్ ఇండియాతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. దీంతో తన అన్ని 350సీసీ బైకులను అమెజాన్ ద్వారా ఆన్‌లైన్‌లో విక్రయించనుంది. వినియోగదారులు ఇప్పుడు క్లాసిక్ 350, బుల్లెట్ 350, హంటర్ 350, గోవాన్ క్లాసిక్ 350, కొత్త మెటియోర్ 350 వంటి మోడళ్లను అమెజాన్‌లో నేరుగా, ఇంటి నుంచే సులభంగా బైకులను కొనేయొచ్చు. అయితే, ప్రస్తుతానికి ఈ సదుపాయం అహ్మదాబాద్, చెన్నై, హైదరాబాద్, న్యూఢిల్లీ, పూణే వంటి ఐదు కీలక నగరాల్లో అందుబాటులో ఉందని రాయల్ ఎన్‌ఫీల్డ్ వెల్లడించింది. అంతేకాకుండా రాయల్ ఎన్‌ఫీల్డ్ అమెజాన్‌లో ప్రత్యేక బ్రాండ్ స్టోర్‌ను కూడా ప్రారంభించింది. ఇక్కడ వినియోగదారులు మోటార్ సైకిళ్లు, విడి భాగాలు, రైడింగ్ గేర్, కంపెనీకి చెందిన ఉత్పత్తులను ఒకే చోట లభిస్తాయి. కొనుగోలు చేసిన వాహనాల డెలివరీలు, అమ్మకాల తర్వాత సర్వీసుకు సంబంధించి కస్టమర్లు సమీపంలోని రాయల్ ఎన్‌ఫీల్డ్ డీలర్‌షిప్‌లను సంప్రదించవచ్చు. ఈ భాగస్వామ్యం ద్వారా రాయల్ ఎన్‌ఫీల్డ్ ఇప్పుడు 350సీసీ బైకులను అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లలో కొనే అవకాశం లభిస్తుంది. ప్రస్తుతం ఈ డిజిటల్ సేవలను కంపెనీ దేశంలోని 10 నగరాల్లో అందిస్తుండగా, త్వరలో ఇతర ప్రాంతాలకూ విస్తరించనుంది.

## మరిన్ని లేఆఫ్స్ ఉంటాయని సంకేతమిచ్చిన టీసీఎస్




దేశీయ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) రానున్న త్రైమాసికంలో మరిన్ని లేఆఫ్‌లు ఉంటాయని సంకేతాలిచ్చింది. గురువారం కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండో త్రైమాసిక ఫలితాల వెల్లడి సందర్భంగా ఉద్యోగుల తొలగింపుపై స్పష్టత ఇచ్చింది. జూలై–సెప్టెంబర్ త్రైమాసికంలో సుమారు 6 వేల మందిని మాత్రమే తొలగించామని వివరణ ఇచ్చింది. సీనియర్, మిడిల్ మేనేజ్‌మెంట్ స్థాయిలలో మాత్రమే ఈ తొలగింపు జరిగినట్టు కంపెనీ ప్రతినిధి తెలిపారు. అయితే, ఐటీ ఉద్యోగుల సంఘం నాసెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయిస్ సెనేట్(నైట్స్) ప్రకారం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం నుంచి రెండో త్రైమసికం మధ్య కంపెనీ మొత్తం 19,755 మందిని తొలగించినట్టు వెల్లడించింది. ఉద్యోగుల తొలగింపులకు అనేక అంశాలు కారణమని కంపెనీ చెబుతోంది. మరింత చురుకైన, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న సంస్థగా మారాలనే లక్ష్యం కోసం ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు తెలిపింది.. ముఖ్యంగా కృత్రిమ మేధస్సు (ఏఐ)లో కంపెనీకి కొత్త స్కిల్స్ ఉన్న ఉద్యోగులు అవసరం. ఇప్పటికే ఉన్న కొన్ని ఉద్యోగాలు రానున్న రోజుల్లో అవసరం ఉండవు. కొన్ని ఉద్యోగాలకు ఎక్కువ మంది ఉన్నారు. కాబట్టి, సంస్థ పునర్వ్యవస్థీకరణలో భాగంగా, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని లేఆఫ్స్ విషయంలో నిర్ణయం తీసుకుంటామని టీసీఎస్ పేర్కొంది.

## జాన్సన్ అండ్ జాన్సన్‌కు రూ. 8,582 కోట్ల భారీ జరిమానా




15 ఏళ్ల నాటి కేసులో బేబీ పౌడర్లను తయారు చేసే జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీకి లాస్ ఏంజెలెస్ జ్యూరీ భారీ జరిమానా విధించింది. కంపెనీ తయారు చేసిన బేబీ పౌడర్ ఉత్పత్తులను వాడిన కారణంగా క్యాన్సర్ వస్తున్నట్టు నిర్ధారణ అయ్యిందని, దానివల్ల మెసోథెలియోమా వ్యాధికి గురై మరణించిన ఓ మహిళ కుటుంబానికి ఇచ్చిన తీర్పులో 966 మిలియన్ డాలర్లు (8,582 కోట్ల రూపాయలు) పరిహారంగా చెల్లించాలని జ్యూరీ తీర్పు వెలువరించింది. కాలిఫోర్నియాకు చెందిన మే మూర్ అనే మహిళ 2021లో క్యాన్సర్‌తో మరణించింది. కంపెనీకి చెందిన బేబీ పౌడర్‌ను జీవితాంతం వాడటం వల్లే తనకు క్యాన్సర్ వచ్చిందని సదరు మహిళ కుటుంబం ఆరోపించింది. మొత్తం జరిమానాలో 16 మిలియన్ డాలర్లను పరిహారంగానూ, కంపెనీ చర్యలకు వ్యతిరేకంగా బలమైన సందేశం పంపేందుకు కంపెనీపై 950 మిలియన్ డాలర్ల శిక్షాత్మక నష్ట పరిహారాన్ని జ్యూరీ విధించింది. దీంతో ఇలాంటి కేసులో ఇప్పటివరకు విధించిన అతిపెద్ద జరిమానాల్లో ఇదొకటి. అయితే, ఈ తీర్పును జాన్సన్ అండ్ జాన్సన్ విభేధిస్తోంది. ఈ నిర్ణయం అన్యాయమని, అత్యంత కఠినంగా ఇచ్చిన ఈ తీర్పుపై అప్పీలుకు వెళ్లే ఆలోచనలో ఉన్నట్టు కంపెనీ తెలిపింది.

## చరిత్ర సృష్టించిన ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా..




ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా ఐపీఓలో చరిత్ర సృష్టించింది. గురువారం ముగిసిన ఐపీఓలో కంపెనీకి రూ. 4 లక్షల కోట్లకు పైగా బిడ్లను అందుకున్న తొలి భారతీయ కంపెనీగా నిలిచింది. ఇది దేశ చరిత్రలోనే ఏ ఐపీఓకైనా ఇప్పటివరకు అత్యధికం. ఈ స్థాయి డిమాండ్ ప్రధానంగా క్యూఐబీ(క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్లు) అయిన బడా ఇన్వెస్టర్ల నుంచి వచ్చింది. క్యూఐబీల్లో బ్యాంకులు, బీమా కంపెనీలు, మ్యూచువల్ ఫండ్‌లు, విదేశీ పెట్టుబడిదారులు ఉన్నారు. ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ దేశంలో ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాల మార్కెట్‌లో విస్తృతమైన వ్యాపార సామర్థ్యాన్ని కలిగి ఉంది. దీంతో భవిష్యత్తులో కంపెనీ మరింత విస్తరించనుందని, లాభాలు తెచ్చిపెడుతుందని ఇన్వెస్టర్లు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే షేర్లను బుక్ చేసుకోవడానికి సిద్ధపడ్డారు. ఇన్వెస్టర్ల విశ్వాసం కారణంగానే మొత్తం బిడ్‌లను అందుకోవడంలో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా రికార్డు నమోదు చేసింది. బీఎస్ఈ డేటా ప్రకారం, అక్టోబర్ 7న మొదలైన ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఐపీఓ ప్రక్రియలో 65.06 లక్షలకు పైగా దరఖాస్తులను అందుకుంది. బిడ్డింగ్ మొత్తంలో సంస్థాగత బిడ్డర్ల నుంచి 166.51 రెట్ల దరఖాస్తులు రావడం గమనార్హం. వీరు వేసిన బిడ్ల విలువ రూ. 3.86 లక్షల కోట్లు. రిటైల్ పెట్టుబడిదారుల నుంచి మూడున్నర రెట్లకు పైగా బుకింగ్‌లు వచ్చాయి.

## జీసీసీల గమ్యస్థానంగా తెలంగాణ




గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ల (జీసీసీ)లను ఆకర్షించడంతో తెలంగాణ టాప్‌లో ఉందని ఎక్స్‌ఫెనో నివేదిక వెల్లడించింది. గత మూడేళ్లలో దేశ వ్యాప్తంగా కొత్త గ్రీన్‌ఫీల్డ్ జిసిసిలో 40 శాతం తెలంగాణలో ఏర్పాటు చేయబడ్డాయని తెలిపింది. జీసీసీలు అనేవి బహుళజాతి సంస్థలు తమ వ్యాపార కార్యకలాపాల కోసం ఏర్పాటు చేసే ఆఫ్‌షోర్ యూనిట్లు. ఇవి ఐటి సేవలు, ఫైనాన్స్, హెచ్‌ఆర్, డేటా అనలిటిక్స్, ఆర్‌అండ్‌డి, కస్టమర్ సపోర్ట్ వంటి వివిధ విభాగాలకు సంబంధించిన సేవలను అందిస్తాయి. జిసిసి కేంద్రంగా తెలంగాణ ఎదుగుతోందని అన్నారు. గురువారం హైదరాబాద్‌లో ఎక్స్‌ఫెనో సీఈఒ ఫ్రాన్సిస్ పదమదన్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ 40 శాతం జీసీసీలను ఆకర్షించగా.. తర్వాత స్థానంలో బెంగళూరు 33 శాతం వాటాను కలిగి ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం ప్రపంచవ్యాప్తంగా వ్యాపార కేంద్రంగా వేగంగా ఎదుగుతోందన్నారు. అధిక నాణ్యత కలిగిన ప్రతిభా వంతులు, వలస ధోరణులు ఇందుకు ప్రధాన మద్దతును అందిస్తున్నాయన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 360కి పైగా జిసిసిలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. వీటిలో 3.1 లక్షలకుపైగా నిపుణులు పని చేస్తున్నా రన్నారు. ఇది రాష్ట్రంలోని మొత్తం వైట్ కాలర్ వర్క్ ఫోర్స్‌లో 14 శాతం కంటే ఎక్కువని ఎక్స్‌ఫెనో సహ వ్యవస్థాపకుడు కమల్ కరంథ్ తెలిపారు. ఇక్కడ ప్రతిభా వంతుల ప్రవాహం, లీడర్‌షిప్, వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. జిసిసి మొత్తం ఉద్యోగాల్లో ఇంజినీరింగ్, ఐటి రోల్స్ 57 శాతం వాటాను కలిగి ఉన్నాయన్నారు.

# డిసెంబర్ 15న ఐపీఎల్ వేలం.. రీటెన్షన్‌కు ఆ రోజు వరకే ఛాన్స్!




ఇండియన్ ప్రీమియర్ లీగ్ అభిమానులకు గుడ్‌న్యూస్. మహిళల ప్రీమియర్ లీగ్ వేలం తేదీలను ప్రకటించిన బీసీసీఐ ఐపీఎల్‌కు కూడా పచ్చజెండా ఊపింది. డిసెంబర్ 15వ తేదీన పంతొమ్మిదో సీజన్ వేలం నిర్వహణకు బీసీసీసీఐ సిద్ధమవుతోంది. ఒకవేళ ఆ రోజు కాకుంటే డిసెంబర్ 13–15 మధ్య కచ్చితంగా ఆక్షన్ ఉంటుందని సమాచారం. అయితే.. వేలం తేదీని ఫ్రాంచైజీలతో మాట్లాడి బీసీసీఐ ఖరారు చేయాల్సి ఉంది. గత రెండు సీజన్లలో విదేశాల్లోనే వేలం నిర్వహించారు. మరి, ఈసారి అదే పంథాను అనుసరిస్తారా? లేదంటే.. స్వదేశంలోనే ఈ క్రతువును పూర్తి చేస్తారా? అనేది తెలియడం లేదు. పదిహేడో సీజన్ వేలంను దుబాయ్‌లో, 18వ సీజన్ మెగా వేలాన్ని సౌదీ అరేబియాలోని జెడ్డా నగరంలో జరిపిన విషయం తెలిసిందే. ఐపీఎల్ వేలం వస్తోందంటే చాలు.. ప్రతిభావంతులపై కోట్లు కుమ్మరించేందుకు ఫ్రాంచైజీలు రెఢీ అవుతుంటాయి. రికార్డు ధర పలికేది ఎవరు? అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. గత సీజన్‌లో రిషభ్ పంత్ రూ.27 కోట్లతో అత్యధిక ధర పలకగా.. శ్రేయాస్ అయ్యర్ రూ.26.75 కోట్లతో రెండో స్థానంలో నిలిచాడు. వెంకటేశ్ అయ్యర్‌ను రూ.23.75 కోట్లకు కోల్‌కతా నైట్ రైడర్స్ అట్టిపెట్టుకుంది.

## కెప్టెన్‌గా శార్దూల్ ఠాకూర్.. సర్ఫరాజ్ ఖాన్ రీ ఎంట్రీ! నో సూర్య కుమార్?



రంజీ ట్రోఫీ 2025–26 సీజన్‌లో భాగంగా జమ్మూ కాశ్మీర్‌తో జరిగే తొలి మ్యాచ్ కోసం ముంబై క్రికెట్ అసోసియేషన్ తమ జట్టును ప్రకటించింది. ఈ జట్టుకు కెప్టెన్‌గా స్టార్ ఆల్‌రౌం డర్ శార్దూల్ ఠాకూర్ ఎంపికయ్యాడు. గాయం కారణంగా బుచ్చి బాబు ఇన్విటేషనల్ టోర్నమెంట్‌కు దూరమైన స్టార్ ప్లేయర్ సర్ఫరాజ్ ఖాన్ తిరిగి జట్టులోకి వచ్చాడు. బీసీసీఐ నుంచి ఫిట్‌నెస్ క్లియరెన్స్ రావడంతో సర్ఫరాజ్‌ను సెలక్టర్లు ఎంపిక చేశారు. అయితే టీమిండియా టీ20 కెప్టెన్, ముం బైకర్ సూర్యకుమార్ యాదవ్ మాత్రం ఆస్ట్రేలియా పర్యట నకు వెళ్లనుండడంతో జమ్మూతో మ్యాచ్‌కు దూరమయ్యాడు. మహారాష్ట్రతో జరిగిన మూడు రోజుల ప్రాక్టీస్ గేమ్‌లో పాల్గొన్న చాలా మంది ఆటగాళ్లు ఈ 16 మంది సభ్యుల జట్టులో ఉన్నారు. రాబోయే దేశీయ సీజన్‌కు ముందు ముంబై కెప్టెన్ పదవికి రాజీనామా చేసిన అజింక్య రహానె కూడా జట్టులో చోటు దక్కించుకున్నాడు. జమ్మూతో మ్యాచ్‌కు ముంబై సెలక్టర్లు బలమైన జట్టును ప్రకటించారు. సీనియర్ ఆటగాళ్లతో పాటు అయూష్ మాత్రే, తనీష్ కొటియన్ వంటి యువ ఆటగాళ్లు ఉన్నారు. అదేవిధంగా భారత టీ20 స్టార్ శివమ్ దూబే సైతం జమ్మూతో మ్యాచ్‌కు ఎంపికయ్యాడు. కానీ తొలి మ్యాచ్‌లో దూబే ఆడుతాడో లేదో ఇంకా క్లారిటీ లేదు. ఎందుకంటే ఆసీస్‌తో టీ20 సిరీస్‌కు ఎంపిక చేసిన భారత జట్టులో దూబే భాగంగా ఉన్నాడు. కాగా రాబోయో రంజీ ట్రోఫీ సీజన్‌లో అక్టోబర్ 15–18 వరకు శ్రీనగర్ వేదికగా ముంబై, జమ్మూ కాశ్మీర్ జట్లు తలపడనున్నాయి.

**జమ్మూతో మ్యాచ్‌కు ముంబై జట్టు**

శార్దూల్ ఠాకూర్ (కెప్టెన్), ఆయుష్ మ్హత్రే, ఆకాశ్ ఆనంద్ (వికెట్ కీపర్), అజింక్యా రహానే, సిద్దేష్ లాడ్, సర్ఫరాజ్ ఖాన్, శివమ్ దూబే, షామ్స్ ములానీ, తనుష్ కోటియన్, తుషార్ దేశ్‌పాండే, సిల్వెస్టర్ డిసౌజా, హార్దిక్ తమోర్ , ఇర్ఫాన్ ఉమీర్, ముషీర్ ఖాన్, అఖిల్ హెర్వాడ్కర్, రాయ్‌స్టన్ డయాస్

క్రీడా వాయిస్

## డబుల్ సెంచరీకి చేరువలో జైశ్వాల్.. తొలి రోజు భారత్‌దే



ఢిల్లీ వేదికగా వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టులో టీమిండియా దుమ్ములేపుతోంది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ తమ మొదటి ఇన్నింగ్స్‌లో 2 వికెట్ల నష్టానికి 318 పరుగుల భారీ స్కోర్ సాధించింది. భారత బ్యాటర్లలో ఓపెనర్ యశస్వి జైశ్వాల్ అద్భుతమైన సెంచరీతో చెలరేగాడు. యశస్వికి ఇది 7వ టెస్టు సెంచరీ. జైశ్వాల్ 173 పరుగులతో తన బ్యాటింగ్‌ను కొనసాగిస్తున్నాడు. అతడి ఇన్నింగ్స్‌లో 22 ఫోర్లు ఉన్నాయి. క్రీజులో జైశ్వాల్‌తో పాటు కెప్టెన్ శుబ్‌మన్ గిల్(20) ఉన్నాడు. అంతకుముందు యువ ఆటగాడు సాయిసుదర్శన్ సైతం కీలక ఇన్నింగ్స్ ఆడాడు.165 బంతుల్లో 12 ఫోర్ల సాయంతో 87 పరుగులు చేసిన సుదర్శన్.. తృటిలో తన తొలి టెస్టు సెంచరీ అవకాశాన్ని కోల్పోయాడు. స్పిన్నర్ వారికన్ బౌలింగ్‌లో వికెట్ల ముందు సుదర్శన్ దొరికిపోయాడు.వీరిద్దరితో పాటు ఓపెనర్ కేఎల్ రాహుల్(38) రాణిచాడు. అయితే రాహుల్ తనకు లభించిన ఆరంభాన్ని భారీ స్కోర్‌గా మలచడంలో విఫలమయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లో జైశ్వాల్–సాయిసుదర్శన్ రెండో వికెట్‌కు 193 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. సుదర్శన్ ఔటయ్యాక జైశ్వాల్ గిల్‌తో కలిసి స్కోర్ బోర్డును ముందుకు నడిపిస్తున్నాడు. ఇక విండీస్ బౌలర్లలో వారికన్ ఒక్కడే రెండు వికెట్లు సాధించాడు. మిగితా బౌలర్లంతా తేలిపోయారు. కాగా తొలి టెస్టులో విండీస్‌ను ఇన్నింగ్స్ 140 పరుగుల తేడాతో టీమిండియా చిత్తు చేసిన సంగతి తెలిసిందే.

# రూ.500 కోట్ల క్లబ్‌లో ‘కాంతార చాప్టర్ 1’.. బాక్సాఫీస్ దగ్గర మాస్ ఊచకోత



కన్నడ నటుడు రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో వచ్చిన కాంతార చాప్టర్ 1 చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. కాంతార సినిమాకు ప్రీక్వెల్‌గా వచ్చిన ఈ చిత్రం దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. మొదటిరోజు నుంచే బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్న ఈ చిత్రం తాజాగా మరో అరుదైన రికార్డును అందుకుంది. విడుదలైన 9 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.509 కోట్ల వసూళ్లను రాబట్టినట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. మరోవైపు ఈ వీకెండ్ కూడా థియేటర్‌లలో పెద్ద సినిమాలేవి లేకపోవడంతో కాంతార మరిన్ని రికార్డులు సృష్టించే అవకాశం ఉంది.

# హారర్ థ్రిల్లర్ ‘కిష్కింధపురి’.. ఓటీటీ, టెలివిజన్ రిలీజ్ డేట్ ఇదే!



యువ కథానాయకుడు బెల్లంకొండ శ్రీనివాస్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం ‘కిష్కింధపురి’. ఈ సినిమాకు కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వం వహించగా.. ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటించింది. హారర్ థ్రిల్లర్‌గా వచ్చిన ఈ చిత్రం మిరాయ్‌కి పోటిగా సెప్టెంబర్ 12న వచ్చి సూపర్ హిట్‌ను అందుకుంది. ఇప్పుడు ఈ చిత్రం తాజాగా ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక జీ5లో ఈ సినిమా అక్టోబర్ 17 నుంచి తెలుగులో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. మరోవైపు దీపావళి కానుకగా అక్టోబర్ 19న ఈ చిత్రం టెలివిజన్ జీ తెలుగులో సాయంత్రం 6 గంటలకు ప్రసారం కాబోతున్నట్లు నిర్వహాకులు వెల్లడించారు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. రాఘవ్ (బెల్లంకొండ సాయి శ్రీనివాస్), మైథిలి (అనుపమ) ఘోస్ట్ వాకింగ్ పేరుతో హాంటెడ్ హౌస్ టూర్స్ నిర్వహిస్తుంటారు. అలా 11 మందితో కలిసి పాడుబడిన సువర్ణమాయ రేడియో స్టేషన్‌కి వెళ్తారు. అక్కడ వేదవతి అనే ఆత్మ వాయిస్ వినిపిస్తుంది. లోపలికొచ్చిన వారందరినీ వదిలిపెట్టనని హెచ్చరిస్తుంది. ఆ తర్వాత ఏం జరిగింది? అసలు వేదవతి ఎవరు? ఎందుకు ఆత్మగా మారింది? సువర్ణమాయ నుంచి బయటపడటానికి రాఘువ్ ఎలాంటి ప్రయత్నాలు చేశాడనేది మిగతా కథ.

# ఆ.. అవకాశం రావాలని కోరుకుంటున్నా



‘ఇద్దరు అమ్మాయిలు, అబ్బాయి ఉన్నప్పుడు ట్రై యాంగిల్ లవ్ స్టోరీ అనుకుంటారు. కానీ ‘తెలుసు కదా’లో ఒక యూనిక్ పాయింట్‌ని టచ్ చేశాం. అది ఇప్పుడు రివీల్ చేయకూడదు. సినిమా చూసినప్పుడు ప్రేక్షకులు ఖచ్చితంగా సర్‌ప్రైజ్ అవుతారు’ అని కథానాయిక శ్రీనిధి శెట్టి అన్నారు. ‘మిరాయ్’ లాంటి పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్ తర్వాత పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నుంచి వస్తున్న మ్యూజికల్ రొమాంటిక్ ఎంటర్టైనర్ ‘తెలుసు కదా’. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి, రాశి ఖన్నా హీరోయిన్స్. స్టైలిస్ట్-ఫిల్మ్ మేకర్ నీరజా కోన దర్శకత్వంలో టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈనెల 17న సినిమా విడుదల కానున్న సందర్భంగా నాయిక శ్రీనిధి శెట్టి మీడియాతో ముచ్చటించారు. ఫస్ట్ టైం లవ్ స్టోరీ చేయటం చాలా హ్యాపీగా ఉంది. నాకు రొమాంటిక్ స్టోరీస్ చేయడం ఇష్టం. ‘కేజీఎఫ్, హిట్ 3’ యాక్షన్, చాలా బ్లడ్ బాత్ ఉన్న సినిమాలు. ‘తెలుసు కదా’ ఒక లైట్ హార్టెడ్ మూవీ. చాలా కొత్తగా ట్రై చేశాం. ఇందులో లవ్, ఎమోషన్, లాఫ్, సాంగ్స్.. అన్ని కమర్షి యల్ ఎలిమెంట్స్ ఉంటాయి. సినిమా చూసిన తర్వాత ఆడియన్స్ మంచి రొమాంటిక్ డ్రామాని ఫీల్ అవుతారు. దర్శకురాలు నీరజ చాలా ప్యాషన్‌తో సినిమా చేశారు. ఆమె విజన్ ఆడియన్స్‌కి ఖచ్చితంగా కనెక్ట్ అవుతుంది. ఈ సినిమాలో ఉన్న స్పెషాలిటీ ఏంటంటే, ఇదొక మంచి ఫీల్ గుడ్ ఎంటర్టైనర్. ఇందులో చాలా కొత్త పాయింట్ వుంది. ఇందులో మూడు క్యారెక్టర్స్ ఆడియన్స్‌కి బాగా కనెక్ట్ అవుతాయి. థియేటర్స్‌లో చూస్తున్నప్పుడు ఎంజాయ్ చేస్తారు. ముఖ్యంగా సిద్ధు క్యారెక్టర్‌ని చాలా ఎంజాయ్ బాగా చేస్తారు.

# ఫ్యామిలీస్టార్’ తర్వాత విజయ్, దిల్ రాజు కొత్త సినిమా



విజయ్ దేవరకొండ దిల్ రాజు కలిసి మరోసారి పనిచేయనున్నారు. వీరిద్దరూ కలిసి ఇప్పటికే ఫ్యామిలీస్టార్ సినిమాను అందించారు. దర్శకుడు పరశురామ్ తెరకెక్కించిన ఈ చిత్రం అనుకున్నంత రేంజ్‌లో అయితే మెప్పించలేదు. అయితే, మరోసారి విజయ్ దేవరకొండతో కలిసి ఒక ప్రాజెక్ట్ చేస్తానని నిర్మాత దిల్‌రాజు గతంలోనే ప్రకటించారు. ఈ క్రమంలోనే సరికొత్తగా యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. విజయ్ దేవరకొండ కొత్త చిత్రం అక్టోబర్ 11న ప్రారంభం కానుంది. ఈ మూవీని దర్శకుడు రవికిరణ్ కోల తెరకెక్కించనున్నారు. గతంలో రవికిరణ్ డైరెక్ట్ చేసిన ‘రాజా వారు రాణి గారు’ సినిమా క్లాసిక్ లవ్ స్టోరీగా ప్రేక్షకులను మెప్పించింది. అయితే, ఇప్పుడు యాక్షన్ సినిమా కోసం ఆయన పనిచేయనున్నారు. ఈ మూవీకి ‘రౌడీ జనార్ధన’ అనే టైటిల్ కూడా ఫిక్స్ చేసినట్లు సమాచారం. అక్టోబర్ 16 నుంచే ముంబైలో షూటింగ్ ప్రారంభం కానున్నట్లు టాక్. %ూఎజ% బ్యానర్‌లో భారీ బడ్జెట్‌తో దిల్ రాజు ఈ మూవీని నిర్మిస్తున్నారు. 2026లో ఈ మూవీ విడుదల కానుంది. ఇందులో హీరోయిన్‌గా కీర్తి సురేష్ నటించనున్నట్లు

## ‘కాకతీయ మెస్‌లో ఫ్రై.. సుబ్బయ్య హోటల్లో పప్పు’.. ఫుల్ ఫన్నీగా ఫంకీ టీజర్



యంగ్ హీరో విశ్వక్ సేన్ నటిస్తోన్న తాజా చిత్రం ఫంకీ ఈ మూవీకి జాతిరత్నాలు’ సినిమాతో బోలెడంత క్రేజ్ తెచ్చుకున్న అనుదీప్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో కయాద్ లోహర్ హీరోయిన్‌గా కనిపించనుంది. తాజాగా రిలీజైన టీజర్ చూస్తే అనుదీప్ కామెడీ మార్క్ కనిపిస్తోంది. టీజర్ ప్రారంభంలో వచ్చే డైలాగ్‌తోనే నవ్వులు తెప్పించాడు. చిన్నప్పుడు మా అమ్మ మాటలు అస్సలు వినలేదు.. ఏం చెప్పారండి.. చెప్పాను కదా ఏం వినలేదని.. అంటూ నవ్వులు పూయించాడు. ఆ తర్వాత విశ్వక్ సేన్ పంచ్ డైలాగ్స్ అభిమానులను తెగ ఆకట్టుకుంటున్నాయి. నేను ఇంత పెద్ద డైరెక్టర్ అవ్వడానికి కారణం ఈ స్కూలే.. ఇక్కడ చదివాను కాబట్టే నాకు చదువుపై విరక్తి పుట్టింది.. అందుకే సినిమాల్లోకి వెళ్లా అంటూ విశ్వక్ సేన్ చెప్పిన డైలాగ్ ఫ్యాన్స్‌ను అలరిస్తోంది. కాగా.. ఈ సినిమాను శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో వీకే నరేశ్, వీటీవీ గణేశ్ కీలక పాత్రలు పోషించారు. ఈ మూవీకి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.

# పవన్ కళ్యాణ్ ‘ఉస్తాద్ భగత్ సింగ్’ తాజా అప్‌డేట్ .. విడుదల తేదీపై క్లారిటీ ఇచ్చిన నిర్మాత




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులకు మరోసారి ఉత్సాహాన్ని కలిగించే అప్‌డేట్ బయటకు వచ్చింది. ఇటీవల విడుదలైన చిత్రం మంచి విజయాన్ని నమోదు చేయడంతో, ఇప్పుడు అభిమానుల చూపు పూర్తిగా ఆయన తదుపరి ప్రాజెక్ట్ “ఉస్తాద్ భగత్ సింగ్ మీదే ఉంది. ఇంతకు ముందు ఈ చిత్రం 2026 మహాశివరాత్రి సందర్భంగా విడుదలవుతుందన్న వార్తలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. అయితే తాజా ఇంటర్వ్యూలో నిర్మాత రవి కిరణ్ ఈ అంశంపై స్పందిస్తూ స్పష్టతనిచ్చారు. రవి కిరణ్ మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్ తన భాగం షూటింగ్ పూర్తిచేశారు. దర్శకుడు హరీష్ శంకర్ రేపటి నుంచి కొత్త షెడ్యూల్ మొదలుపెడుతున్నారు. షూటింగ్‌లో ఇంకా 20 నుంచి 25 రోజుల పని మిగిలి ఉంది. ఆ తర్వాత నిర్మాణం పూర్తవుతుంది. ప్రేక్షకులకి అనుకూలంగా ఉండే డేట్‌ని చూసి మూవీని రిలీజ్ చేస్తామని రవి కిరణ్ అన్నారు.దీంతో సమ్మర్ 2026లో సినిమా థియేటర్లకు వచ్చే అవకాశం ఉన్నట్లు ట్రేడ్ వర్గాల్లో చర్చలు నడుస్తున్నాయి. అయితే నిర్మాత మాత్రం ఇంకా అధికారిక విడుదల తేదీ నిర్ణయించలేదని చెప్పారు. ఈ సినిమాను హరీష్ శంకర్ డైరెక్ట్ చేస్తున్న విషయం తెలిసిందే. గతంలో ‘గబ్బర్ సింగ్’ వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వీరిద్దరూ మళ్లీ కలుస్తుండటంతో అంచనాలు ఓ రేంజ్‌లో ఉన్నాయి. ఈ మూవీకి సంగీతం దేవి శ్రీ ప్రసాద్ అందిస్తున్నారు. ఈ ముగ్గురు కాంబినేషన్‌లో సినిమా వస్తుంది అంటే మరోసారి మాస్ ఫ్యాన్స్ కి పండగే అని చెప్పాలి. చిత్రంలో రాశీ ఖన్నా, శ్రీలీలా హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ ఇద్దరూ టాలీవుడ్‌లో మంచి క్రేజ్ ఉన్న నటీమణులు. బ్యూటీతో పాటు పెర్ఫామెన్స్ పరంగా కూడా ఈ చిత్రానికి వారు కీలకంగా మారనున్నారు. తాజాగా విడుదలైన %ూ+% మూవీ విజయంతో పవన్ స్టార్డమ్ మరింత పటిష్ఠంగా మారింది. దీని ప్రభావం ‘ఉస్తాద్ భగత్ సింగ్’పైన భారీగా కనిపిస్తోంది. పవన్ పాత్ర స్టైల్, పవర్, మాస్ యాంగిల్ అన్నీ కలగలిసిన క్యారెక్టర్‌గా డిజైన్ చేశారని సమాచారం. ఈ సినిమాతోను పవన్ మరో మంచి హిట్ కొట్టడం ఖాయం అంటున్నారు.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com